అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 13-3-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 71 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

ఈడీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నితీశ్ రానా రాజీనామా

2015 నుంచి ఈడీ కేసుల్లో వాదనలు



న్యూఢిల్లీ : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నితీశ్ రానా తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆదివారం మీడియాకు తెలిపారు. 2015 నుంచీ ఈడీ స్పెషల్ పీపీగా పనిచేస్తున్న ఆయన, దర్యాప్తు ...5లో

ప్రభుత్వ రంగం వద్దట! ప్రయివేటే ముద్దట!!

మోడీ కంటే ముందు భారతదేశంలో అభివృద్ధే లేదన్నట్టు "భక్తుల భజన". దాదాపు గత డెబ్బయ్యేండ్లుగా ఫుడ్ కార్పోరేషన్ ధాన్యం, గోధుమలు మన రైతాంగం నుంచి కనీస మద్దతు ధరిచ్చి కొని ఉండకపోతే మన పరిస్థితి ఏమిటి?

గోదావరి పరివాహకంలో వందేండ్లకు సరిపోయే బొగ్గు

కేంద్రం అనుమతి కోసం సింగరేణి పడిగాపులు.... దేశ రక్షణ పెట్టుబడిదారులకే...



సింగరేణి తెలంగాణ కొంగు బంగారం! ఒకప్పుడు లక్షమందికి పైగా ఉన్న కార్మికులు, ఉద్యోగులు నేడు 43 వేలకు, గతంలో ఒక్కరు కూడా లేని కాంట్రాక్ట్ కార్మికులు నేడు 25 వేలకు చేరారు. ఎనిమిది నియోజక వర్గాల్లో ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుంది సింగరేణి. గత ఆరేండ్లలో రాష్ట్రానికి 15 వేల కోట్లు, కేంద్రానికి రూ. 13,500 కోట్లు వివిధ పన్నులు, డివిడెండ్ల రూపంలో చెల్లించింది. దీనిలోని అధికారులు కార్మికులు కేంద్రానికి సంవత్సరానికి మొత్తం వెయ్యి కోట్ల ఆదాయ పన్ను రూపంలో చెల్లిస్తున్నారు. ఇప్పుడు ఆ సింగరేణి గొంతు పిసుకుతున్నారు. ఎవరికోసం...?

ఆరెస్బీ

గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడే "ప్రభుత్వరంగం పుట్టిందే చావడానికి, కొన్ని పుట్టగానే చస్తాయి! కొన్ని కొంత కాలానికి చస్తాయి!" అన్నారు మోడీసాబ్! కంస మామలుంటే పుట్టంగానే చావరా పోరగాండ్లు!?.

సింగరేణి 'గర్భశోకం' : గోదావరి పరివాహక ప్రాంతాల్లో మరో వందేండ్లకు పైబడి సరిపోయే బొగ్గు నిల్వలున్నాయి. ఇప్పుడున్న బొగ్గు బావులు, ఓపెన్‌కాస్ట్‌లు మరో పదేండ్ల కంటే రావని అంచనా. 15 గుర్తించిన బావుల సర్వే జరిగి, కేంద్రం అనుమతి కోసం అర్జీలిచ్చి పడిగాపులు పడాల్సి వస్తోంది మన సింగరేణి. మన తెలంగాణ నేల. మన సింగరేణి. మన



నిక్షేపాలు. అయినా తవ్వరాదట! ఓపెన్ టెండర్లో పాల్గొనాలి. తీరా మనం చెమటోడ్చి కాంట్రాక్టు దక్కించుకున్నా సాలుకి 14 శాతం రెవెన్యూ షేరింగ్ చెయ్యాలట! అంటే సామ్రాట్టుకు కప్పం చెల్లించాలట!.

రాష్ట్రం కూడా తాను కొన్న బొగ్గుకి పైసలివ్వదు. ఆ బొగ్గుతో ఉత్పత్తి అయిన కరెంటుకి రూ. 12 వేలకోట్ల బకాయి పడింది. కారణం, కేంద్ర నుంచి రావాల్సిన నిధులు సకాలంలో రాకపోవడం. సింగరేణి ప్రయివేటైజేషన్‌కు తమకు సంబంధమే లేదని 'బండి' వారి గ్యాంగు ప్రచారం! కాని ఐదు బ్లాకులు అర్రాజు పెట్టింది వారే. కోయగూడెం 'బ్లాకు'ను మాయచేసి, మంత్రం వేసి అరబిందో ఫార్మాకి కట్ట బెట్టారు. సదరు వివరాలు 5లో..

ప్రభుత్వ రంగ పరిశ్రమలు విధ్వంసం

» హెచ్ఎంటీ వాచ్ డివిజన్, హెచ్ఎంటి బేరింగ్స్, హిందుస్థాన్ కేబుల్స్ మన తెలంగాణలోని కేంద్ర ప్రభుత్వ రంగ పరిశ్రమలు. వీటిని పూర్తిగా మూసి వేసేం దుకు 2016లో మోడీ సర్కార్ ఫత్వాలు విడుదల చేసింది. మన పిచ్చిగానీ, లాభాల్లో ఉన్న బీపీసీఎల్‌నే బతకని వ్వని ప్రభుత్వం నష్టాల్లో వున్న వాటిని ఉద్ధరిస్తుందా?

» డిఫెన్స్ పబ్లిక్ రంగ పరిశ్రమైన భారత్ డైనమిక్స్ (బీడీఎల్) మిస్సైల్ టెక్నాలజీలో గుత్తాధిపత్యం గల సంస్థ. ఆకాష్, పృథ్వి, నాగ్ వంటివి దీని సృష్టే. ఇప్పుడు దీనికి పక్కలో బల్లెంలా ఎల్ అండ్ టీని, అదానీ కంపెనీని కూచోబెట్టింది కేంద్రం. ఇజ్రాయిల్, ఫ్రాన్స్, రష్యాల నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకుని, లోయెస్ట్ కొటేషన్ వేస్తేనే కొద్దిగా ఊపిరంది బతక గల్గుతోంది బీడీఎల్.

నేటి నుంచి పార్లమెంట్

రెండో విడత బడ్జెట్ సమావేశాలు

- ఆర్థిక బిల్లు ఆమోదమే తమ ప్రాధాన్యత : ప్రభుత్వం
- ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్షం వ్యూహం
- పెండింగ్‌లో 35 బిల్లులు



న్యూఢిల్లీ : నేటి నుంచి పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో బడ్జెట్‌కు సంబంధించిన ఆర్థిక బిల్లును ఆమోదించడమే తమ ప్రాధాన్యతని ప్రభుత్వం స్పష్టం చేస్తున్నది. బీజేపీ రాజకీయ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా కేంద్ర ఏజెన్సీల చర్య, అదానీపై ఆరోపణలు వంటి అంశాలను లేవనెత్తడానికి ప్రతిపక్షాలు ప్రణాళికలు సిద్ధం చేశాయి. సోమవారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2022-23 కోసం రెండవ బ్యాచ్ గ్రాంట్ల కోసం అనుబంధ డిమాండ్లను సమర్పించనున్నారు. 2023-24 సంవత్సరానికి గాను జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంత బడ్జెట్‌ను కూడా ఆమె లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. సమాఖ్య నిర్మాణంపై దాడి, సంస్థల "దుర్వినియోగం"కు వ్యతిరేకంగా నిరసనకు వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే సిద్ధమవుతున్నాయి. ఈ సమావేశాలు మార్చి 13న ప్రారంభమై ఏప్రిల్ 6 వరకు కొనసాగుతాయి.


అదానీ-హిండెన్‌బర్గ్ అంశంపై ప్రభుత్వం నుంచి సమాధానాలు కోరతామని ప్రతిపక్ష నేతలు తెలిపారు. జాయింట్ పార్లమెంటరీ కమిటి (జేపీసీ) విచారణకు ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తున్నదని ఆరోపిస్తున్నాయి. ప్రతిపక్ష నేతలపై ఇటీవల సీబీఐ, ఈడీ దాడులు నిర్వహించటంతోపాటు.. అరెస్టు చేయడంపైనా ప్రతిపక్షాలు పెద్దఎత్తున ఆందోళనకు దిగే అవకాశం ఉంది. ఎల్ఐసీ, ఎస్‌బీఐల రిస్క్ ఎక్స్‌పోజర్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి అంశాలను కూడా ప్రతిపక్షాలు లేవనెత్తనున్నాయి. బీజేపీయేతర పాలిత రాష్ట్రాలపై 'రాజకీయ ప్రతీకార' అంశాన్ని, ఉపాధి హామీ వంటి పథకాలకు నిధులను నిలిపివేయడంపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయనున్నాయి.

పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ మాట్లాడుతూ ఆర్థిక బిల్లును ఆమోదించడమే ప్రభుత్వానికి అత్యంత ...5లో

టెర్రరిజాన్ని అణిచివేస్తున్నాం

సీఐఎస్ఎఫ్ రైజింగ్ డే పరేడ్‌లో హోంమంత్రి అమిత్‌షా

- అమరజవాన్లకు నివాళి
- తీవ్రవాద నిర్మూలనకు భద్రతా దళాలు పనిచేస్తున్నాయని వ్యాఖ్య



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

దేశంలో ఉగ్రవాదాన్ని అణచివేస్తున్నామనీ, సీఐఎస్ఎఫ్ మూలంగానే నక్సలైట్లు, టెర్రరిస్టులు అదుపులో ఉన్నారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని హకీంపేట్‌లో జరిగిన 54వ సీఐఎస్ఎఫ్ రైజింగ్ డే పరేడ్‌కు హోంమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 53 ఏండ్లుగా దేశసేవలో సీఐఎస్ఎఫ్ కీలకపాత్ర పోషిస్తున్నదనీ, దేశ ఆర్థికప్రగతిలోనూ పారిశ్రామిక భద్రతా దళాల పాత్ర విస్మరించలేనిదన్నారు.. మూడు వేల సిబ్బందితో ప్రారంభమైన సీఐఎస్ఎఫ్ ఇప్పుడు లక్షా 70వేల మందితో సేవలు అందిస్తున్నదని తెలిపారు. దేశ వ్యాప్తంగా రోజూ ఎయిర్‌పోర్టులు, ఢిల్లీ మెట్రో, ఇతర సంస్థల్లోని కార్యకలాపాల ద్వారా 50లక్షల మంది ...2లో

అన్నింటా విఫలమైన బీజేపీ ఓడిపోవాలి

'ఐడియాస్ ఆఫ్ ఇండియా సమ్మిట్' సదస్సులో కవిత

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అన్నింటా విఫలమైన బీజేపీ తప్పనిసరిగా ఓడిపోవాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆకాంక్షించారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ, మూడు నల్లచట్టాలు తెచ్చి, 750 రైతుల ఆత్మహత్యలకు కారణమవటం తప్ప చేసేందేమీ లేదన్నారు. హైదరాబాద్‌లో ప్రతి ఇంటికీ 24 గంటల నీటి సరఫరా ఇస్తుంటే.. దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో రోజుకు రెండు గంటలే నీటి సరఫరా అవుతున్నదని గుర్తుచేశారు. ప్రజలకు కావాల్సిన తాగు, సాగు నీరు, ఉద్యోగాలు వంటి కనీస అవసరాలను కూడా బీజేపీ సర్కారు తీర్చలేకపోయిందని విమర్శించారు. ముంబయిలో ఒక ప్రముఖ ఛానల్ 'ఐడియాస్ ఆఫ్ ఇండియా సమ్మిట్ 2023' పేరిట నిర్వహించిన సదస్సులో '2024 ఎన్నికలు - విపక్షాల వ్యూహం' అనే అంశంపై కవిత మాట్లాడారు. 2014లో 282 సీట్లతో బీజేపీకి ప్రజలు అధికారాన్ని ఇచ్చినప్పుడు, ఆ పార్టీ అనేక హామీలిచ్చిందని గుర్తుచేశారు. నల్లధనం తెస్తామనీ, ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామనీ, రూపాయి విలువ పడిపోకుండా ఆపడం వంటి అనేక హామీలు ఇచ్చినప్పటికీ ఏ ఒక్క హామీని నేరవేర్చలేదన్నారు. 303 సీట్లతో ...2లో



కేసీఆర్‌కు స్వల్ప అస్వస్థత

ఏఐజీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదివారం ఉదయం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. కడుపులో కొంచెం నొప్పిగా ఉందని చెప్పడంతో కుటుంబసభ్యులు ఆయనను గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఏఐజీ ఆస్పత్రి చైర్మెన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి సీఎంకు కావాల్సిన అన్ని వైద్య పరీక్షలు చేయించారు. సీటీ స్కాన్, ఎండోస్కోపీ పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ పరీక్షల్లో సీఎంకు కడుపులో చిన్న పుండు (అల్సర్) ఉన్నట్టుగా తేలింది. మందులతో ఆ అల్సర్ తగ్గిపోతుందని డాక్టర్లు చెప్పారు. అల్సర్ మినహా మిగతా అన్ని పారామీటర్లు సాధారణంగా(నార్మల్)గా ఉన్నట్టు పరీక్షల్లో బయటపడింది. దాంతో అల్సర్ తగ్గడానికి అవసరమైన మందులు ప్రారంభించారు. కాగా, సీఎం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితికి సంబంధించి ఏఐజీ ఆస్పత్రి చైర్మెన్ నాగేశ్వర్‌రెడ్డి హెల్త్‌బులిటెన్ జారీచేశారు. ప్రస్తుతం సీఎం ఆరోగ్యం సాధారణంగానే ఉందని తెలిపారు. సీఎంకు సీటీ స్కాన్, ఎండోస్కోపీ నిర్వహించామనీ, ఆయన గ్యాస్ట్రిక్ ప్రాబ్లంతో ఇబ్బంది పడ్డారని అందులో పేర్కొన్నారు. అల్సర్ ఉన్నట్టుగా పరీక్షల్లో తేలిందని, సంబంధిత వైద్య చికిత్స అందిస్తున్నామని చెప్పారు.

ఇలాంటివాడ్ని దేశం నుంచి వెళ్లగొట్టాలి..

రాహుల్‌గాంధీపై ప్రగ్యా ఠాకూర్ అనుచిత వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీని భారతదేశం నుంచి బయటకు వెళ్లగొట్టాలని బీజేపీ ఎంపీ ప్రగ్యా ఠాకర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారత ప్రజాస్వామ్యంపై విమర్శలు చేసిన ఆయనకు రాజకీయాల్లో చోటు ఇవ్వరాదని, విదేశీ మహిళకు జన్మించిన ఆయనకు దేశభక్తి లేదని ప్రగ్యా ఠాకూర్ ...5లో




నేడే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

29,720 మంది ఓటర్లు



- 137 పోలింగ్ కేంద్రాలు
- ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్
- అన్ని ఏర్పాట్లు పూర్తి : రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలా

వివరాలు 5లో..



మహారాష్ట్రలో మత చిచ్చు

ముస్లింలు లక్ష్యంగా విద్వేష ప్రసంగాలు

- ముంబయి, థానె..సహా వివిధ నగరాల్లో లవ్ జిహాద్ ర్యాలీలు..
- సుప్రీంకోర్టు ఆదేశాల్ని అమలుజేయని బీజేపీ-శివసేన ప్రభుత్వం
- లౌకికవాదాన్ని హిందువులు విడిచిపెట్టాలి : ఎమ్మెల్యే రాజాసింగ్

బీజేపీ-శివసేన సర్కార్ అండదండలతో ఇటీవల మహారాష్ట్రలో హిందూత్వ శక్తులు పెట్రేగిపోతున్నాయి. ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషాన్ని వెళ్లగక్కుతున్నాయి. ఆ వర్గం వారిపై హింసకు దిగాలంటూ హిందువుల్ని రెచ్చగొడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ నగరాల్లో 'లవ్ జిహాద్ ర్యాలీ'ల పేరుతో హిందూత్వ గ్రూపులు చేపడుతున్న ప్రదర్శనలకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. 'సకల్ హిందూ సమాజ్' అనే సంస్థ 'లవ్ జిహాద్ ర్యాలీ'లను చేపడుతోంది.



న్యూఢిల్లీ : కొద్ది రోజుల క్రితం థానె పట్టణానికి సమీపంలో నెవాలీ వద్ద నిర్వహించిన ర్యాలీకు కాషాయ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యకర్తలను ఉద్దేశించి పలువురు వక్తలు ప్రసంగిస్తూ, ముస్లింలపై విద్వేషం వెళ్లగక్కారు. గత కొద్ది నెలలుగా నెవాలీ, లాతూర్, పర్భానీ, జల్గావ్, అహ్మద్‌నగర్, ముంబయి, బారామతి, నందుర్బార్ నగరాల్లో చేపట్టిన ర్యాలీల్లో విద్వేష ప్రసంగాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

దీనిపై పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ ప్రధాన కార్యదర్శి లారా జెసానీ మాట్లాడుతూ, "ముంబయిలో ఈ తరహా విద్వేష ప్రసంగాలు, ర్యాలీలు ఎప్పుడూ చూడలేదు. ఒక వర్గం వారిని టార్గెట్ చేస్తూ 'లవ్ జిహాద్' ర్యాలీలు ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒక వర్గం వారిపై హింసకు దిగాలని బహిరంగంగా పిలుపు ఇస్తున్నారు" అని ఆందోళన వ్యక్త చేశారు. పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా విద్వేష ప్రసంగాలు ఆగటం లేదని లారా జెసానీ చెప్పారు.

యోగిని చూసి నేర్చుకోండి : టి.రాజాసింగ్

"ఛత్రపతి శివాజీ పుట్టిన ఈ నేలపై మసీదులు ఉండాలా? హిందువులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు?" అంటూ స్వామీ భరతానంద మహరాజ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. పాల్ఘార్‌లోని హిందూ శక్తి పీఠాధిపతి అయిన ఆయన, "లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌తో హిందువుల స్థలాల్ని, భూముల్ని ముస్లింలు ఆక్రమించారు" అని అన్నారు. ర్యాలీకి హాజరైన తెలంగాణ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ మతపరమైన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. "లౌకికవాదాన్ని విడిచిపెట్టాలని హిందువులను కోరుతున్నా. వారంతా హిందూ దేశం కోసం పోరాడాలి. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ని చూసి మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే ...5లో

పారిశ్రామికవేత్తలకు దోచిపెడుతున్న కేంద్రం

- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి



నవతెలంగాణ-చిట్యాలటౌన్


కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలు, కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా ఉంటూ ప్రభుత్వరంగ సంస్థలను దోచిపెడుతోందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు విమర్శించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలకేంద్రంలోని మేకల లింగయ్య స్మారక భవనంలో ఆదివారం సీపీఐ(ఎం) నియోజకవర్గ స్థాయి విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశాన్ని అదానీ లాంటి కుబేరులకు తగినంత సంపద దోచుకునే సాధనంగా మోడీ విధానాలు రూపొందించుకున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌తో ధనికవర్గాలకు తప్ప, పేద, మధ్యతరగతి ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ నుండి ప్రజా చైతన్యబస్సు యాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల అనంతరం గ్యాస్ ధరలు విపరీతంగా పెంచడం, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి కారణం బీజేపీ ప్రభుత్వ విధానాలకు అద్దం పడుతుందన్నారు. సంపన్న వర్గాలకు వేల కోట్ల రూపాయలు సబ్సిడీలు ఇచ్చిన ప్రభుత్వం, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని విమర్శించారు. సీపీఐ(ఎం) ప్రజా చైతన్య బస్సు యాత్రలను జయప్రధం చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు మేక అశోక్‌రెడ్డి, అవిశెట్టి శంకరయ్య, అరూరి శ్రీను, జిట్ట సరోజ, బొడ్డుపల్లి వెంకటేశ్, చెరుకు పెద్దులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాక్స్టర్ 'చూజ్ ఫ్రీడమ్' ప్రచారం

హైదరాబాద్ : డయాలసిస్ కేర్‌లో అంతర్జాతీయంగా అగ్రగామిగా వెలుగొందుతున్న బాక్స్టర్ ఇండియా కొత్తగా 'చూజ్ ఫ్రీడమ్' ప్రచారాన్ని ప్రారంభించినట్లు పేర్కొంది. సమయానికి డయాలసిస్ చేయించుకోవాల్సిన ఆవశ్యకత తెలపడంతో పాటుగా తుది దశ మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్న రోగులు (ఇఎస్‌కెడి) రోగులకు పెరిటోనియల్ డయాలసిస్ (పిడి) చికిత్స పట్ల అవగాహన సైతం మెరుగుపరచడం లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. "దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులు ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనకరంగా మారాయి. దాదాపు 85 కోట్ల మంది ఈ వ్యాధులతో బాధపడుతున్నారు. మధుమేహంతో పాటుగా అభివృద్ధి చెందే సికెడి కారణంగా కిడ్నీ ఫెయిల్యూర్ కూడా కావొచ్చు. ఈ ఆరోగ్య ఆందోళనలను పరిష్కరించేందుకు తప్పనిసరిగా చర్యలను తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది." అని బాక్స్టర్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ జనరల్ మేనేజర్ రిషబ్ గుప్తా పేర్కొన్నారు.

జోష్‌గా మహిళ దినోత్సవ వేడుకలు

ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ నిర్వహణ




నవతెలంగాణ-హైదరాబాద్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ (హైదరాబాద్ సర్కిల్) ఫుల్ జోష్‌గా మహిళ దినోత్సవాన్ని నిర్వహించింది. ఆదివారం కోటిలోని లోకల్ హెడ్ ఆఫీసులో నిర్వహించిన ఈ వేడుకలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 500 పైగా మహిళ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, క్విజ్, చారిటీ కార్యక్రమాలు నిర్వహించారు. చురుకైన, మెరిట్ కలిగిన ఆఫీసర్ల పిల్లలకు సహా మెరిట్ కలిగిన పేద బాలికలను సత్కరించడంతో పాటు వారికి ఆర్థికంగా సాయాన్ని అందించారు. పలు పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎస్‌బిఐ లేడిస్ క్లబ్ ప్రెసిడెంట్ నుపూర్ జింగ్రస్, హైకోర్టు న్యాయమూర్తి చిలకూర్ సుమలత, ఎస్‌బిఐ ఎల్‌హెచ్‌ఒ నెట్‌వర్క్ 1 జనరల్ మేనేజర్ మంజూ శర్మ, సిజిఎం అమిత్ జింగ్రాన్, సిఎఒ జిఎం శేఖర్ ఎల్ తదితరులు హాజరై ప్రసంగించారు. వ్యక్తలు తమ స్ఫూర్తిదాయక ఆలోచనలను పంచుకున్నారు.

సుముఖ హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి హరీష్ రావు



హైదరాబాద్ : నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సుముఖ ఆసుపత్రిని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు లాంచనంగా ప్రారంభించారు. ఈ ఆసుపత్రిలో ఇఎన్‌టితో పాటు దంత సంబంధిత వ్యాధులకు చికిత్స చేయడంతో పాటు సర్జరీలు కూడా నిర్వహిస్తామని ఆసుపత్రి నిర్వహకులు తెలిపారు. ఆదివారం జరిగిన ఈ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుర్మాచలం, బిసి కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ రావు, స్థానిక కార్పోరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, హౌస్ ఫెడ్ చైర్మన్ కదారి నవనీత రావు, ప్రముఖ వైద్యులు మా ఇఎన్‌టి డైరెక్టర్ డాక్టర్ మేఘనాథ్, ఫేషియల్ సర్జన్ దినేష్ శర్మ, ఫేషియల్ సర్జన్ జీవి రెడ్డి పాల్గొన్నారు. ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ తిరునహరి సుధాంశ్ తదితరులు హాజరయ్యారు.

కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం సలహామండలి కన్వీనర్‌గా డాక్టర్ మృణాళిని



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం సలహామండలి కన్వీనర్‌గా డాక్టర్ సి. మృణాళిని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆమె వృత్తిరీత్యా అధ్యాపకురాలు. వివిధ అంశాలపై 20 పుస్తకాలను రచించారు. షార్ట్ స్టోరీలు, సామాజిక అంశాలు, నవలలు రాశారు. వివిధ దేశాల్లో సాహిత్య సదస్సుల్లో ప్రసంగించారు. కోమలి గాంధారం, ఇంతిహాసం వంటి వ్యంగ్యంతో పాఠకుల మీద తమదైన ముద్రవేశారు. అరుదైన అనువాదాలు, ఆంగ్లసాహిత్యంలో లోతైన అవగాహనతో తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగానికి తొలి మహిళ మృణాళిని కావడం పట్ల పలువురు కవులు, రచయితలు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ సాహితి అభినందనలు

కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం సలహా మండలి కన్వీనర్‌గా డాక్టర్ మృణాళిని ఎంపిక కావడం పట్ల తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లభపురం జనార్ధన, సి. ఆనందాచారి ఆమెకు అభినందనలు తెలిపారు.

నాన్న వస్తున్నాడంటే భయమేసేది

- లైంగికంగా వేధించేవాడు.. : ఢిల్లీ మహిళా చీఫ్

న్యూఢిల్లీ : ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ స్వాతి మలివాల్ ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. చిన్నతనంలో తన తండ్రి తనను లైంగికంగా వేధించాడని అన్నారు. తనను చిన్నతనంలో తన నాన్న లైంగికంగా వేధించేవాడని, ఆయన ఇంటికి వస్తున్నాడంటేనే భయపడిపోయేదాన్నని, మంచం కింద దాక్కునే దాన్నని పేర్కొన్నారు. దీంతో ప్రతిరాత్రి ఆడవారికి ఎలా సహాయం చేయాలని, పిల్లలను వేధించే పురుషులకు ఎలా గుణపాఠం చెప్పాలని ప్రతి రాత్రి ప్లాన్ చేసేదాన్నని అన్నారు. తాను నాలుగవ తరగతి చదివే వరకు తన తండ్రితో కలిసి జీవించానని, ఈ విధంగా చాలాసార్లు జరిగిందని అన్నారు.

ఏప్రిల్ 14 నుంచి ఇంటింటికీ సీపీఐ

- బీజేపీకో హఠావో.. దేశ్‌కో బచావో నినాదంతో ప్రజల వద్దకు
- జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంబేద్కర్ జయంతిరోజున ఏప్రిల్ 14 నుంచి బీజేపీకో హఠావో దేశ్‌కో బచావో నినాదంతో ప్రజల ముందుకెళ్తున్నామనీ, ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చెప్పారు. మే 15 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, మతోన్మాద విధానాలను ఎండగడతామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రజలు ఎదుర్కొంటున్న డబుల్ బెడ్రూం ఇండ్లు, రేషన్‌కార్డులు, భూ సమస్యలు, దళితబంధు, పెన్షన్ వంటి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఇంటింటికీ సీపీఐ పేరుతో పాదయాత్ర, బస్సుయాత్ర, మోటార్ సైకిళ్ల యాత్రలు 119 నియోజకవర్గాల్లో జరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శులు కె నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, రాష్ట్ర నాయకులు తనతోపాటు చాడ వెంకటొరెడ్డి, పల్లా వెంకటొరెడ్డి ప్రారంభిస్తామని చెప్పారు. 2024లో బీజేపీని అధికారంలోకి రానివ్వకుండా నిరోధించాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తామన్నారు. మతోన్మాద, రాజ్యాంగ వ్యతిరేక విధానాలపై ప్రజలను జాగృతం చేస్తామని అన్నారు. ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని తమ పార్టీ జాతీయ కార్యదర్శి కె నారాయణ ప్రారంభిస్తారనీ, కొత్తగూడెంలో ముగింపు సభకు తమ పార్టీ ప్రధాన కార్యదర్శి డి రాజా హాజరవుతారని వివరించారు. జూన్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రనాయకత్వం ఆధ్వర్యంలో రాజకీయ నినాదంతో రాష్ట్రవ్యాప్త బస్సుయాత్ర చేస్తామన్నారు. ఈ కార్యక్రమం ముగింపు సభను హైదరాబాద్‌లో లక్ష మందితో నిర్వహిస్తామని చెప్పారు.

25న విభజన హామీలపై బయ్యారం నుంచి పాదయాత్ర

విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో బయ్యారం నుంచి పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు కూనంనేని అన్నారు. ఈ ప్రజా పోరు పాదయాత్ర ఏప్రిల్ 25న హన్మకొండలో జరిగే బహిరంగసభతో ముగుస్తుందన్నారు. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించినట్టుగా 13.5 లక్షల మందికి 14 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. జీవో 58,59 ప్రకారం గుడిసెలు, ఇండ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం దరఖాస్తుల గడువు పెంచడాన్ని హర్షిస్తున్నామని చెప్పారు. 2020 వరకు అనే నిబంధనను సడలించాలనీ, ఇప్పటి వరకు ఉన్న గుడిసెలను పరిగణనలోకి తీసుకుని ఆ భూములను క్రమబద్ధీకరించాలని కోరారు.

ఇండ్లు కట్టుకునేందుకు వీలుగా గృహలక్ష్మి కింద వారికి రూ.మూడు లక్షలు కాకుండా రూ.ఐదు లక్షలివ్వాలని డిమాండ్ చేశారు. 59 జీవో ప్రకారం క్రమబద్ధీకరణ రుసుం చాలా ఎక్కువగా ఉందనీ, దాన్ని నామమాత్రంగా నిర్ణయించాలనీ, లేదంటే 500 గజాల్లోపు వారికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ఇంటి స్థలం లేనివారికి స్థలాలివ్వాలని చెప్పారు. కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యలపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఆయన వ్యాఖ్యలను వెంటనే ఖండించాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌పై కేసు పెట్టాలనీ, ఆయన తక్షణమే మహిళలకు క్షమాపణ చెప్పాలని కోరారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మోడీ నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఆయన రాక్షసులకు ప్రతినిధా? ప్రజాస్వామ్యానికి ప్రతినిధా?అని ప్రశ్నించారు. అవినీతి సామ్రాట్ మోడీ అని అన్నారు. బీజేపీ నాయకుల్లో ఒక్కరిపైనా కేసు పెట్టడం లేదనీ, ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు వారిని ప్రశ్నించడం లేదన్నారు. ప్రతిపక్షాల ఐక్యతతోనే బీజేపీ ఓటమి సాధ్యమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటొరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటొరెడ్డి, బాల నర్సింహా, తక్కెల్లపల్లి శ్రీనివాస రావు, పశ్య పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించాలి

జాతీయ నాయకులు, ఈసీని కలుస్తాం

- జమ్మూకాశ్మీర్ రాజకీయ పార్టీల వెల్లడి
- మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా నివాసంలో అఖిలపక్ష భేటీ

న్యూఢిల్లీ : కేంద్రపాలిత ప్రాంతం(యూటీ) జమ్మూకాశ్మీర్‌లో గత కొన్నేండ్లుగా ఎన్నికల నిర్వహించకపోవడంపై అక్కడి రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ విషయంలో మోడీ సర్కారు తీరును తప్పుబట్టాయి. ఎన్నికల నిర్వహించాలనే డిమాండ్‌తో పాటు ఈ ప్రాంతంలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అక్కడి రాజకీయ పార్టీలు చర్చించాయి. ఈ మేరకు కాశ్మీర్‌లోయలోని బంతిండిలో ఉన్న జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) అధినేత డాక్టర్ ఫరూక్ అబ్దుల్లా ఇంటిలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాంగ్రెస్, పీడీపీ, సీపీఐ(ఎం)లతో పాటు పలు ప్రాంతీయ పార్టీలు పాల్గొన్నాయి. తమ ప్రాంతం ఎదుర్కొంటున్న సమస్యలు ఆస్తి పన్ను, విద్యార్థుల నిరసనలు, జమ్మూకాశ్మీర్‌లో ప్రస్తుత రాజకీయ పరిస్థితితో పాటు పలు అంశాలపై చర్చించినట్టు పత్రికా సమావేశంలో ఫరూక్ అబ్దుల్లా తెలిపారు.

సాధారణ పరిస్థితులున్నపుడు ఎన్నికలెందుకు జరగవు?

తమ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితుల గురించి ఢిల్లీకి వెళ్లి జాతీయ నాయకులకు వివరించాలని తాము నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. "జమ్మూకాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులే ఉన్నాయనీ, జీ20 సమావేశం నిర్వహణ కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా లు అంటున్నారు. మరి అలాంటపుడు ఇక్కడ ఎన్నికలు ఎందుకు నిర్వహించలేరు?" అని ఫరూక్ అబ్దుల్లా ప్రశ్నించారు. ఎన్నికలు జరపాలనే డిమాండ్‌తో జాతీయ నాయకుల మద్దతుతో తాము ఎన్నికల సంఘాన్ని కలుస్తామని తెలిపారు. 2014 నుంచి ఇక్కడ ఎన్నికలు జరగటం లేదనీ, ఒక ప్రజాస్వామిక దేశంలో ఇది ఒక వింత విషయమని ఆయన అన్నారు. ఢిల్లీలో సమావేశం తర్వాత తామంతా మళ్లీ ఇక్కడే సమావేశమవుతామనీ, రంజాన్ నెల తర్వాత ఇదే అఖిలపక్ష సమావేశం ఉంటుందని ఫరూక్ అబ్దుల్లా స్పష్టం చేశారు. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడం ద్వారా ఎన్నికలు త్వరితగతిన జరుగుతాయని అన్నారు.

ఈ సమావేశానికి సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఎం.వై తరిగామి హాజరయ్యారు. బెదిరించి తమ మధ్య విభజన తీసుకొచ్చే ప్రయత్నాలు జరిగాయని తరిగామి పత్రికా సమావేశంలో అన్నారు. ఆస్తి పన్ను అయినా, మరేదైనా.. అలాంటి నిర్ణయాలు తీసుకొనే అధికారాన్ని అసెంబ్లీకే ఉండాలని చెప్పారు.

అన్నింటా విఫలమైన బీజేపీ ఓడిపోవాలి

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీకి ప్రజలు రెండోసారి అధికారాన్ని అందించారనీ, మూడు వ్యవసాయ నల్లచట్టాలు తెచ్చి, 750 రైతుల ఆత్మహత్యలకు కారణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్లపాటు అధికారంలో ఉండి పూర్తిగా విఫలమైన బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తక్కువ ధరకే మంగళయాన్ శాటిలైట్‌ను తయారు చేయగలిగిన మనదేశం...ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు ఎందుకు ఇవ్వలేకపోతున్నామని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాలు దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం ఎందుకు ప్రయత్నించడం లేదన్నారు. ఐఐటీ, ఐఐఎం లాంటి విద్యాసంస్థల్లో 28వేల ఉద్యోగ ఖాళీలు ఉన్నా, కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయడం లేదని విమర్శించారు. విద్యార్థులకు సరైన విద్య అందించకుండా విశ్వగురువు ఎలా అవుతామని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. జనగణన, ఓబీసీల జనగణన చేపట్టాలని కోరారు. సీపీఐ(ఎం), ఆమ్ ఆద్మీ పార్టీ, శివసేన, సీపీఐ లాంటి అనేక విపక్షాలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. ఆనాడు బ్రిటిష్ ప్రభుత్వం విభజించు...పాలించు పద్ధతిని పాటిస్తే, నేడు బీజేపీ ప్రభుత్వం రైడ్ అండ్ రూల్ పద్ధతిలో ముందుకుపోతున్నదని విమర్శించారు. ప్రత్యర్థి పార్టీ మీద దాడులు చేయడం, పార్టీని విడగొట్టి దొడ్డిదారిలో పరిపాలించడమే బీజేపీ ప్రస్తుత విధానమని ఎద్దేవా చేశారు. అనేక మంది ప్రతిపక్ష పార్టీ నేతలపై విచారణ జరుపుతున్న మోడీ...అదానిపై ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు.

స్వలింగ వివాహాలకు వ్యతిరేకంగా కేంద్రం అఫిడవిట్

- సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లను కొట్టేయాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ : స్వలింగ వివాహాల(సేమ్ సెక్స్ మ్యారేజ్)ను కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. వాటికి సంబంధించిన పిటిషన్లను కొట్టివేయాలని కోరింది. ఇది దేశ కుటుంబ వ్యవస్థకు విరుద్ధమని పేర్కొంది. భారత శిక్షా స్మృతి(ఐపీసీ)లోని సెక్షన్ 377ను డిక్రిమినలైజ్ చేయడం వల్ల స్వలింగ వివాహాలకు గుర్తింపు ఇవ్వాలని కోరకూడదని తెలిపింది. సహజంగా విజాతీయుల మధ్య జరిగే వివాహానికే గుర్తింపు ఉంటుందనీ, చరిత్ర మొత్తం చూసినా ఇదే ప్రమాణం కనిపిస్తుందని పేర్కొంది. రాజ్యం మనుగడకు ఇది పునాది అని వివరించింది. సేమ్ సెక్స్ మ్యారేజెస్‌కు చట్టపరమైన గుర్తింపు ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు అఫిడవిట్‌ను దాఖలు చేసింది. విజాతీయుల మధ్య పెళ్లికి ఉన్న సామాజిక విలువలను పరిగణనలోకి తీసుకుని, విజాతీయుల మధ్య జరిగే వివాహాలకు మాత్రమే గుర్తింపునివ్వడం రాజ్యానికి తప్పనిసరి అని కేంద్ర ప్రభుత్వం తన అఫిడవిట్‌లో పేర్కొంది. సమాజంలోని వ్యక్తుల మధ్య సంబంధాల విషయంలో వ్యక్తిగత అవగాహనలు రకరకాలుగా ఉండవచ్చుననీ, పెళ్లిళ్లు, కలయికలు వంటివి వేర్వేరు రూపాల్లో ఉండవచ్చుననీ, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో హెటిరోసెక్సువల్ (స్త్రీ, పురుషుల మధ్య) వివాహానికి మాత్రమే గుర్తింపును పరిమితం చేస్తున్నట్టు తెలిపింది. పెళ్లిళ్లు, కలయికలు వంటివి వేర్వేరు రూపాల్లో ఉన్నవాటికి గుర్తింపు ఇవ్వకపోయినప్పటికీ చట్టవ్యతిరేకం కాదని తెలిపింది. సమాజంలో కుటుంబ వ్యవస్థ ఉందనీ, దీనిలో చిన్న చిన్న కుటుంబాలు ఉన్నాయనీ, సమాజం అనే భవన నిర్మాణానికి ఇవి ఇటుకల వంటివని తెలిపింది. కుటుంబాలు కొనసాగాలని తెలిపింది.

స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరపబోతోంది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరుపుతుందని సుప్రీంకోర్టు కాజ్ లిస్ట్ వెల్లడించింది.

టెర్రరిజాన్ని అణిచివేస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రయాణికులకు సీఐఎస్ఎఫ్ భద్రత కల్పిస్తున్నదని పేర్కొన్నారు. సీఐఎస్ఎఫ్ డే నాడే జాతిపిత మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహం చేపట్టారనీ, అప్పుడు దేశవ్యాప్తంగా పెద్దసంచలనమే అయిందని చెప్పారు. ఒక్క లాఠీ లేకుండా దేశానికి స్వాతంత్ర్యాన్ని గాంధీజీ తెచ్చారని వివరించారు. దేశ రక్షణతోపాటు ఆర్థిక తోడ్పాటును అందించడంలో సీఐఎస్ఎఫ్ ముఖ్యపాత్రను వహిస్తున్నదన్నారు. డ్రోన్, రోబోటిక్ సాంకేతిక పరిజ్ఞానాన్ని సీఐఎస్ఎఫ్‌కు జోడించి అద్భుతమైన ఫలితాలు రాబడతామని వ్యాఖ్యానించారు. ప్రయివేటు సంస్థలకు భద్రత కల్పించడంలోనూ సీఐఎస్ఎఫ్ ముందుందని చెప్పారు. డ్రగ్స్, స్మగ్లింగ్ వంటి సంఘవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడంలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నదని అభినందించారు.

సీఐఎస్ఎఫ్ త్యాగాలు అసమానం: సీఐఎస్ఎఫ్ డీజీ శీల్‌వర్ధన్‌సింగ్

పారిశ్రామిక అవసరాలను తీర్చడంతోపాటు ప్రజల రక్షణ, భద్రత కల్పించడంలో సీఐఎస్ఎఫ్ అసమాన త్యాగాలు చేసిందని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ శీల్‌వర్ధసింగ్ అభిప్రాయపడ్డారు. రైజింగ్ డే పరేడ్ సందర్భంగా ఆయ స్వాగతోపన్యాసం చేశారు. హైదరాబాద్‌లోని హకీంపేట్‌లోని జాతీయ పారిశ్రామిక భద్రతా అకాడమీ(ఎన్ఐఎస్ఏ-నిసా) కేంద్రం అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నదని చెప్పారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరజవాన్లకు జోహార్లు అర్పిస్తున్నట్టు తెలిపారు. 'నిసా'లో సీఐఎస్ఎఫ్ దినోత్సవాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అమిత్‌షాతోపాటు కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి, గవర్నర్ తమిళి సై సౌందరరాజన్, సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ శీల్‌వర్ధన్‌సింగ్, ఎంపీ కె. లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. అమర జవాన్లకు నివాళులర్పించిన అమిత్ షా.. సీఐఎస్ఎఫ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కమాండెంట్ అభిషేక్‌సింగ్ చౌధురి నాయకత్వంలో పరేడ్ జరిగింది.

సీఐఎస్ఎఫ్ మాక్ డ్రిల్స్..

అబ్బుర పరిచిన కేరళ 'కలరిపయట్టు' విన్యాసం

రైజింగ్ డే పరేడ్ సందర్భంగా సీఐఎస్ఎఫ్ బలగాలు ప్రత్యేకంగా ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విపత్కర పరిస్థితులను ఏ విధంగా ఎదుర్కొంటారో తెలియజేసే మాక్‌డ్రిల్ ప్రదర్శన దాదాపు అరగంటకుపైగా నిర్వహించారు. కేరళకు చెందిన ప్రాచీన మార్షల్ ఆర్ట్ 'కలరిపయట్టు' విన్యాసాలను మహిళా జవాన్లు ప్రదర్శించి, ఆహూతులందరినీ మంత్రముగ్ధులను చేశారు. రసాయన పరిశ్రమల్లో గ్యాస్‌లీక్ వంటి సమస్యలు, అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు తీసుకునే చర్యలపై చేసిన విన్యాసాలు సైతం ఆహూతులను ఆకర్షించాయి. అంతకుముందు దేశవ్యాప్తంగా సీఐఎస్ఎఫ్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు హోంమంత్రి రివార్డులు అందజేశారు.

ప్రెస్‌మీట్ రద్దు

రైజింగ్ డే పరేడ్‌కు విచ్చేసిన హోంశాఖ మంత్రి అమిత్‌షా అనంతరం మీడియాతో మాట్లాడతారంటూ సీఐఎస్ఎఫ్ అధికారులు ముందుగా ప్రకటించారు. దాదాపు గంట తరువాత ప్రెస్‌మీట్ కోసం సీఐఎస్ఎఫ్ గెస్ట్‌హౌస్‌లో అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా ఆయన కొచ్చికి వెళ్లేతొందరలో మీడియా పాయింట్ పక్క నుంచే బై బై అంటూ చేతులూపుతూ ముందుకు సాగిపోయారు. కొద్దిసేపు మాట్లాడాలని మీడియా విజ్ఞప్తి చేసినా పట్టించుకోకుండా నేరుగా వాహనంలో కూర్చుని హకీంపేట విమానాశ్రయానికి వెళ్లిపోవడం గమనార్హం.

మీడియాలో గుసగుసలు

అమిత్‌షా మీడియాతో మాట్లాడతారని చెప్పంగానే మీడియాలో గుసగుసలు ప్రారంభమయ్యాయి. కవిత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణ విషయమై అమిత్‌షాను ప్రశ్నించాలనే ఉత్సుకతతో మీడియా ఉంది. అయితే అమిత్‌షా ప్రెస్‌మీట్‌కు రాకుండానే వెళ్లిపోవడంతో ఒకింత నిరాశ కనిపించింది. మాట్లాడితే అనవసరమైన రచ్చ జరుగుతున్నదనే భావనతోనే అమిత్‌షా వెళ్లిపోయారని బీజేపీ శ్రేణులు చెప్పడం గమనార్హం. అలాగే సీఐఎస్ఎఫ్ రైజింగ్ డే పరేడ్‌ను మొదటిసారిగా న్యూఢిల్లీ వెలుపల హైదరాబాద్‌లో నిర్వహించడం కూడా వ్యూహాత్మకమేనని తెలిసింది. ఈ ఏడాది చివర తెలంగాణలో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఈ పారామిలిటరీ దళాల పరేడ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్టు వినికిడి.

యూపీలో టీచర్ల కొరత

- బడుల్లో 84వేల ఉపాధ్యాయ కొలువులు ఖాళీ
- నాణ్యమైన విద్యను పొందలేకపోతున్న చిన్నారులు
- యోగి సర్కారుపై విద్యావేత్తల ఆగ్రహం



లక్నో : బీజేపీ పాలిత రాష్ట్రం యూపీలో టీచర్ల కొరత తీవ్రంగా ఉన్నది. బడుల్లో సరిపడా ఉపాధ్యాయులు లేక అక్కడి పిల్లలు చదువులో వెనుకబడి పోతున్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో కలిపి మొత్తం 84వేల టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ విషయాన్ని సాక్షాత్తూ రాష్ట్ర ప్రభుత్వమే అసెంబ్లీలో వెల్లడించింది. యోగి సర్కారుకు హిందూత్వ వంటి మతరాజకీయాలు, గోరక్షణపై ఉన్న శ్రద్ధ రాష్ట్రంలోని బడుల్లో టీచర్ల పోస్టులను భర్తీ చేయడంపై లేదని సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలల హక్కు అయిన ఉచిత నిర్బంధ విద్య చట్టం (ఆర్‌టీఈ), 2009 కింద విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు ఉండాలనే మార్గదర్శకాలు ఉన్నాయి. అయినప్పటికీ యోగి పాలనలో రాష్ట్రంలో అదేమీ కనిపించడం లేదని వారు చెప్పారు.

ఏప్రిల్1 నుంచే కొత్త విద్యాసంవత్సరం

వచ్చే నెల 1 నుంచి యూపీలో కొత్త విద్యా సంవత్సరం మొదలు కానున్నది. యూపీ రాష్ట్ర అసెంబ్లీలో సాక్షాత్తూ ఆ రాష్ట్ర విద్యా మంత్రి సందీప్‌సింగ్ రాష్ట్రంలోని సర్కారు బడుల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను ధ్రువీకరించారు. మంత్రి తెలిపిన సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో 1 నుంచి 8వ తరగతి వరకు బోధించే ప్రాథమిక మరియు ఉన్నతస్థాయి పాఠశాలల్లో దాదాపు 51వేల అసిస్టెంట్ టీచర్ల కొలువులు ఖాళీగా ఉన్నాయి. అయినప్పటికీ.. ఈ కొలువుల భర్తీకి కొత్తగా నియామక ప్రక్రియన ఉండబోదని మంత్రి సూచించడం గమనార్హం. ఇక 9 నుంచి 12వ తరగతులకు బోధించే ప్రభుత్వ ప్రభుత్వేతర, ఏయిడెడ్ సెకెండరీ స్కూళ్లలో 33వేల బోధనాసిబ్బంది, ప్రధానోపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని సెకండరీ ఎడ్యుకేషన్ మినిస్టర్ వెల్లడించడం గమనార్హం.

'బీజేపీ సర్కారు అసత్యాలు'

రాష్ట్రంలోని బడుల్లో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో విద్యార్థులు అనేక సబ్జెక్టుల్లో కావాల్సినంత జ్ఞానాన్ని పొందలేకపోతున్నారని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు విషయంలో యోగి సర్కారు అలసత్వం ప్రదర్శిస్తున్నదన్నారు. టీచర్ల కొరత తీవ్రంగా ఉన్న కారణంగా ఉన్న ఉపాధ్యాయులను అన్ని సబ్జెక్టులు బోధించేలా పరిస్థితులు ఏర్పడుతున్నాయని రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఆర్ఎస్ఎం) అధికార ప్రతినిధి వీరేంద్ర మిశ్రా అన్నారు. ఆర్‌టీఈ కింద ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి 30 మంది చిన్నారులకు ఒక టీచర్, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రతి 35 మందికి ఒకరు ఉండాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లలో (1 నుంచి 8వ తరగతి వరకు) 1.92 కోట్ల మంది విద్యార్థులున్నారని అంచనా. ఈ లెక్కన రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1 లక్షకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండాలనీ, ప్రభుత్వం మాత్రం 51,112 పోస్టులే ఖాళీగా ఉన్నాయని అసత్యాలు చెప్తున్నదని వీరేంద్ర మిశ్రా అన్నారు. టీచర్ల కొరత కారణంగానే రాష్ట్రంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

విజయకుమార్‌కు డీఎస్పీ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో అణగారిన కులాల అభ్యర్థి ఎస్ విజయకుమార్‌కు దళిత్ శక్తి ప్రోగ్రాం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు విజయకుమార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

అద్భుతంగా కవితలు రాస్తున్న స్త్రీలు

ప్రసిద్ధ కవి శివారెడ్డి 'బహిరంగ ప్రకటన' పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రస్తుత పరిస్థితుల్లో స్త్రీలు అద్భుతంగా కవితలు రాస్తున్నారని ప్రసిద్ధ కవి శివారెడ్డి అన్నారు. ప్రముఖ కవి ఇబ్రహీం నిర్గుణ్ రచించిన 'బహిరంగ ప్రకటన' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ కవి సంఘం ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శివారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అద్భుతమైన కవితలు రాసే వారంతా తన పిల్లలేనన్నారు. స్త్రీ హృదయం లేకపోతే పురుషులు కూడా కవితలు రాయలేరని తెలిపారు. కవి నిర్గుణకు మతం, కులంలో నిక్షిప్తమైన దుఃఖం ఉందని ఆయన స్రుసించని వస్తువు లేదని, అంతర్లీనంగా సాధన చేసే శక్తి అతనిలో ఉందని తెలిపారు. దానితోనే పాత కవుల్ని కదిలిస్తున్నారని కొనియాడారు. తెలంగాణ సాహిత్య ప్రధాన కార్యదర్శి ఆనందచారి మాట్లాడుతూ.. రచయితలో భాషా విస్ఫోటనం, సామాజిక బాధ్యత గుర్తించిన మనిషి అన్నారని తెలిపారు.

వీక్షణం సంపాదకులు ఎన్ వేణుగోపాల్ పుస్తకాన్ని పరిచయం చేస్తూ కవిత్వం వైవిధ్యమైనదని దీనిలో పురాసుమృతులు దాగి ఉన్నాయని, అతనిలో సామాజిక బాధ, అంతర్జాతీయ దుఃఖం ఉందన్నారు. వీటితో పాటుగా ముస్లింల ఆధునిక వాస్తవ అస్థిత్వం ప్రతిబింబిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి యాకూబ్, దేవేంద్ర, నరేష్ కుమార్, సూఫీ, శిలాలోలిత, రూపా, రుక్మిణి, సలీమా, నర్సిన్ ఖాన్, తగుళ్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు వెంటనే జీతాలివ్వండి

టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 13వ తేదీ వచ్చినా ఇంకా ఆరు జిల్లాల ఉద్యోగులకు ఫిబ్రవరి వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్లు జమకాలేదనీ, వెంటనే జమ చేయాలనీ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోడల్ స్కూల్, కేజీబీవీ ఉద్యోగుల వేతనాలను ఇంకా చెల్లించలేదని తెలిపారు. గత మూడు నెలలుగా ఎయిడెడ్ టీచర్లకు జీతాల్లేవని పేర్కొన్నారు. జనగామ, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, రాజన్న సిరిసిల్ల, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు, రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ స్కూళ్ల, కేజీబీవీ సిబ్బందికి వేతనాలు జమకాలేదని తెలిపారు. గత ఐదు నెలలుగా పీఆర్సీ బకాయిలు, ఇతర సప్లిమెంటరీ బిల్లు లు ఏపీ మంజూరు కావడం లేదని పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు కొచ్చినందున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

ప్రలోభాలకు గురిచేస్తున్న అభ్యర్థులపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల కోసం ఉపాధ్యాయులకు నగదు, మద్యం పంపిణీ చేస్తూ ప్రలోభాలకు గురిచేస్తున్న అభ్యర్థులపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌కు ఆదివారం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి ఫిర్యాదు చేశారు. బీజేపీ, పీఆర్టీయూటీఎస్ అభ్యర్థుల పక్షాన వారి మనుషులు ఓటర్లకు మద్యం బాటిళ్లు, రూ.రెండు వేల నుంచి రూ.ఐదు వేల వరకు నగదు బదిలీ చేస్తూ ఓట్లు వేయాలంటూ ప్రలోభాలకు గురిచేస్తున్నారని తెలిపారు. కేజీబీవీ, గురుకులాల ఉపాధ్యా యులకు ఇరువురు అభ్యర్థులు నగదు పంపిణీ చేయబోగా పలువురు ఉపాధ్యా యులు తిరస్కరించారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను ప్రలోభాలకు గురి చేస్తూ నైతికంగా దిగజార్చుతున్న అభ్యర్థులను ఓడించటం ద్వారా వారికి తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లను కోరారు.

హ్యాకింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వెబ్‌సైట్ హ్యాకింగ్‌కు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని కోరింది. ఈ మేరకు డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్ (టీపీబీవో) పోస్టులకు, ఈనెల 15, 16 తేదీల్లో జరగాల్సిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (వీఏఎస్) పోస్టులకు పరీక్షలు జరగాల్సి ఉందని తెలిపారు. వెబ్‌సైట్ హ్యాకింగ్ కావడంతో ఆయా పరీక్షలను టీఎస్‌పీఎస్సీ వాయిదా వేసిందని వివరించారు. అయితే హ్యాకింగ్ కావడంపై అనేక అనుమనాలున్నాయని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ అధికారులకు తెలియకుండా టీపీబీవో, వీఏఎస్ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ ఎలా అవుతాయని ప్రశ్నించారు. ఎలాంటి స్పష్టత లేకుండా పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

మహిళా కమిషన్ నిష్పక్షపాతంగా ఉండాలి

- వైఎస్ఆర్‌టీపీ మహిళా విభాగం అధ్యక్షులు కవిత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళా కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వైఎస్‌టీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు గడిపల్లి కవిత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.అధికార పార్టీకి కమిషన్‌లా మారకూడదని తెలిపారు. ఈ మేరకు ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కేసీఆర్ కూతురు కవితపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే స్పం దించిన రాష్ట్ర మహిళా కమిషన్ షర్మిలపై అదే తరహాలో వ్యాఖ్యలు చేసిన ప్పుడు ఎందుకు స్పందించలేదని కవిత ప్రశ్నించారు.

కావ్యాలంకారం

ఎప్పటిలాగే మనం
రోజూ మాట్లాడాలనుకుంటాం
అయినా కొన్ని వారాలదాకా
తంత్రీహాసంలో నిశ్శబ్దం
ఉక్కిరిబిక్కిరి చేస్తుంది
కారణం తెలియని కలవరం
చుట్టూరా పరిభ్రమిస్తుంది

ఈస్టిండియా పాలన గురించో
ఈశాన్య రాష్ట్రాల ఉద్యమం వల్లనో
అయినవీకానివీ ఆపాదించుకొని
ఉద్రేకపడినందుకా

శాతవాహనులలో విష్ణుకుండినులలో
ఎవరు దమ్మను శిరసావహించారనే
రచ్చ నిట్టనిలువుగా చీలినందుకా

పక్షుల భాషను
అనువదించినప్పుడు జారిపోయిన
నుడికారం ఎత్తిచూపి విలాసంగా
నవ్వినందుకా

మా ప్రాంగణంలో పిట్టలకు
మీ కాంపౌండులో మొక్కలకు
ఒకటే వయసైనా
గోలలో తేడా ఉందన్న ధిక్కారానికా

అవ్యవస్థపై నీ అసహనాన్ని కూడా
మధురిమగా తడిసే
నా మనోయవనిక మీద
ఏ అక్షరమూ నమోదుకాని విభావరిలో నేను
కల్లోల పడికూడా
నీ ఇష్టాలంతా నా వాళ్ళుగా
నా పరిసరాలన్నీ నీవి అయినట్లుగా
భావనలు బల పరుచుకుంటున్నప్పుడు
ఒక ఇంద్రజాలం లా నువ్వు కనెక్టవుతావు
కారణాలను ఒక తాత్విక గాథతో
కలిపి కుడతావు

అది మనసంతా నింపుకొని
నేనొక పరిమళభరితమైన వసంతాన్నౌతాను
నిజానికి మనం మన గురించి కాదు
మహా లోకాన్ని వ్యాఖ్యానించే
కావ్యాలంకారాలం

- డా కాచాపురం దుర్గాదేవి
7893093495

నిషిద్ధ వస్తువుపై నిర్భయ ప్రకటన 1818

దీర్ఘ కవితల్లో కవిత్వం రాను రాను తేలిపోతుంది... లేదా వస్తువు డామినేట్ చేస్తుంది కానీ ఈ పుస్తకంలో మాత్రం లోనికి పోనుపోను కవిత్వ ధార చిక్కబడింది. వస్తువు బట్వాడాను బలోపేతం చేసింది.. కొన్ని అంశాలను ముట్టుకునేందుకు సాహితీకారులు భయపడుతున్న దశను మనం చూస్తున్నాం. కానీ ఈ కవి ఆ పరిస్థితుల్ని సవాల్ చేస్తూ రాజ్యం నిషిద్ధం చేసిన ఈ వస్తువును భుజానికెత్తుకున్నడు... అంతేనా పిడికిలి బిగించి దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తున్నాడు.. మనల్నీ జెర్ జోర్ సే బోలో అని పిలుపునిస్తున్నాడు... వరవరరావును, సాయిబాబాను విడిచిపెట్టండి... 75 ఏండ్ల స్వతంత్రదేశం పదానికి అర్థం కల్పించండి.. అని..

ఈ కవి దీర్ఘకవిత కోసం ఎంచుకున్న వస్తువు అత్యవసరంగా చర్చించాల్సిన అనేక సామాజిక అంశాల సమ్మిళితం.. అయితే ఆ భావాలా బట్వాడాలో కవిత్వాన్ని రొమాంటిసైజ్ చేయటం ఆశ్చర్య పరిచింది.. విప్లవ కవిత్వానికి భావ సౌందర్యం సరిగ్గా అమరింది.. భీమా కోరేగావ్ ఒక అమానుష అమానవీయ ఘటనకు సాక్ష్యం.. గాయపడిన గొంతు నుంచి ఈ కవిత్వం పెల్లుబికింది.. న్యాయ వ్యవస్థలో అన్యాయం గురించి అండర్ ట్రయల్ ఖైదీల దయనీయ స్థితిగతుల నుంచి పుట్టిన సజీవ భావ ప్రవహం భీమానదిలా ప్రవహించింది.. ప్రముఖ చిత్రకారుడు పీవీ చారి చిత్రాలు ఈ కవిత్వ సాంద్రతను బొమ్మకట్టి చూపాయి.. చారి బొమ్మల వల్ల ఈ కవిత్వం మరింత ఫోకస్ సంతరించుకుంది..

"కొన్ని తేదీలు కాలాన్ని దుఖానికి బిగిస్తాయ్... గోడ కొక్కేలకి కాదు"...

"కొన్ని తేదీలు క్యాలెండర్‌లో పేజీలు తిప్పనివ్వవు"... కవి తేదీలు అన్నాడు కానీ అది ఈ పుస్తకానికి వర్తిస్తుంది.. అవును ఈ పుస్తకం పేజీలు తిప్పనివ్వదు. ఆలోచనల్లో ఆగిపోనిస్తుంది.. ఈ పేజీలు బాధిత వర్గాన్ని దుఖానికి బిగిస్తుంది..


కవిత్వాన్ని ఇంత బలంగా నిర్మించటం ఇటీవలి కాలంలో నేను చదవలేదు... ఇంత ధృడంగా వాక్యాల్ని పేర్చాలంటే నరాల్లో రక్తం తిరుగుబాటు పాట పాడుతున్నట్లుండాలి... ఇంతటి శక్తిమంతమైన అభివ్యక్తి 'శ్రీరాం పుప్పాల'ది... ఈ కవిత్వ శైలి తన ముందు కవిత్వం కంటే ఎన్నో రెట్లు పదునైనది... ఇది నది ఆక్రోశధ్వని.. ఆ నది నిండా గట్లనొరిసే నిరసన సెగల పరవళ్ళు..

'పద్దెనిమిదొందల పద్దెనిమిది'.. ఇది ఈ పుస్తకం పేరు.. పేరులోఎంత ఫోర్స్ ఉందో కవితా వాక్యాల్లోనూ అంతే వేగముంది.. వత్తి పలుకుతున్న పేరు వెనుక వందల ఏండ్ల వత్తిడుంది..

ఇది నది గొంతుకగా కవి అభివర్ణన.. కానీ ఇది సముద్రహోరు.. తుఫాను గర్జన.. గాయపడ్డ, దగాపడ్డ, చెరచబడ్డ, దోచుకోబడ్డ, అణగారిన గుండెల్లో అగ్నికణం.. నిప్పు కాపిన ఢమ ఢమ డప్పుల మోత..

"తెప్పలన్నీ మునిగిపోతున్నాయి.. ఈ ఉపాఖండం చిమ్మ చీకటిలో మగ్గిపోతోంది"

"పూచీకత్తు దొరకని సామాన్యుని కథంతా ఒక ఉపాయం ప్రకారమే ముగిసిపోతుంది".. ఉపా దగ్గర ఇన్వర్టెడ్ కామాస్ పెట్టుకొని చదవండి ఈ పుస్తక సారాంశం ఏంటో మీకు అవగతమవుతుంది.. ఉప ఖండాన్ని ఉపాఖండంగా అభివర్ణించటం ఇప్పటివరకూ రాని అల్టిమేట్ స్టేట్‌మెంట్ హై లెవెల్ ఎక్స్‌ప్రెషన్.. తద్వారా కవి దేనిని నిరసిస్తున్నాడో.. భీమా నది గొంతులో లావాగ్ని సెగ ఎంతలా పెనుమంటగా ప్రవహిస్తుందో ఎరుక అవుతుంది..



అరిగిన పోయిన మెటఫర్‌లు నేను వాడను కానీ.. ఈ రొండు సిమిలీ ఉదాహరణలు చాలు.. సాహిత్య స్పృహ ఏ కొద్ది మాత్రం ఉన్న వారికైనా ఇట్టే అర్థం అవుతుంది. ఈ కవిత్వం ఏ కోవకు చెందిందో ఈ దీర్ఘ కవితా వస్తువు ఏంటో.... ఈ కవి రెండు రాష్ట్రాల్లో తన అభిమాన వర్గాన్ని బలంగా నిర్మించుకోటంలో సఫలీకృతుడైనవాడు.. ఈ దీర్ఘ కవితలో లెక్కకు మించి రివ్యూలు రాబట్టే సారాంశం ఉంది. అందులో సందేహం లేదు..

తన దీర్ఘకవితా మూలవస్తువు హైలెట్ అయ్యేలా ఎందరో సాహిత్య దిగ్గజాలు.. సాహిత్యేతర సామాజిక వర్గాలు, విద్యావంతులు మేధావుల నుంచి తన ఎఫర్ట్‌కు తగిన సమీక్షలు తప్పకుండా వస్తాయ్... అందరూ అదే ప్రధాన వస్తువుపై దృష్టి కేంద్రీకరిస్తారు. నేను మాత్రం ఈ దీర్ఘ కవితలోని మరో కోణాన్ని మాత్రమే స్పృశించదలిచాను. అది సూటిగా మూల వస్తువుకు సంబంధించనిది కాకపోయినా కవి కవిత్వ నిర్మాణ బలం ఏమిటో విశదపరుస్తుంది. వస్తువును పరిపుష్టం చేసేది..

ఇక కవిత్వం ప్రధాన వస్తువులోకొస్తే..

1- "సగం కాలిన చితులపై నుండి అంటరాని కళేబరాన్నై పైకి లేస్తున్నాను నేను భీమా నదిని"

2- "కవిత్వం ఎక్కుపెడుతున్న విలుకాన్ని కరెంటు ఫెన్సింగు వేస్తున్నారు"

పైన ముందుగా చెప్పిన ఆ రెండు ఉదాహరణలతో పాటు ఈ వాక్యాలు చాలు, ఈ కవిత్వంలోని వస్తువు గురించి అర్థం అవ్వటానికి.. దీర్ఘ కవిత సాధారణంగా ఏదో ఒక వస్తువునే కలిగి ఉండటం మనకు తెలుసు. కానీ ఈ దీర్ఘ కవితలో మూడు అంశాలున్నాయి..

1- వర్ణ వివక్ష
2- భావప్రకటనా స్వేచ్ఛపై దాడి..
3- రాజద్రోహ అభియోగాలు మోపే దుర్మార్గపు నల్ల చట్టం ఉపా..

అయితే ఇవేవీ కొత్త వస్తువులో సంఘటనలో కావు మనలో ప్రతి ఒక్కరికీ అవగాహనుంది.. అయితే సమాజాన్ని జాగృత పరచటంలో కవి అలిసిపోడు.. విసుగుచెందడు.. ఈ విషయంలో సృజనకారుడి నేత్రానికి సాధారణ చూపుకి వ్యత్యాసముంది..

అంశాలు రొటీన్ అనిపించొచ్చు కానీ వాటిపై మీరైనా నేనైనా ఈ కవైనా నిరంతరమూ చర్చకు పెట్టాల్సినవి ప్రశ్నల నిప్పులు రాజేయాల్సినవి సమాధానాల పరిష్కారాలు రాబట్టాల్సినవి.. ఈ ఆవేదన ఆక్రోశం భీమా నది గొంతుతో పలికించటం ప్రత్యేకత అయితే కవిత్వ నిర్మాణం కవి స్థాయిని పెంచింది.. అర్థం అయ్యేలా చెప్పగలిగితేనే సారం తలకెక్కుతుంది.. చరిత్రో, పాఠమో అవగతం అవుతుంది.. ఆ పని ఈ కవిత చేసింది. ఇందులో వాడిన కవిత్వ భాష కవి ప్రతిభకు దర్పణం..

"పదునైన కత్తి మొనలన్నీ గుండె లోతుల్ని తెగ్గోస్తున్నాయ్ జల్లెడైన నీటి చర్మాన్నిప్పటికీ బుల్లెట్లు చీల్చుతున్నాయ్.." అణగారిన వర్గపు ఆక్రందనకు అక్షరరూపం కావా ఈ వాక్యాలు..?

"కవిని జైల్లో పెట్టారు రాజ్యం ఎన్ని సార్లీ తప్పు చేస్తుంది..

ఇరుకుతనమ్ముంచి కూడా గొంతెత్తేవాళ్ల సకల జీవుల భాష మాట్లాడగలరు"..

"ఈ దేశపు నల్ల గౌను ముందు తమ కేసు తామే వాదించుకోలేని అనేక వర్ణాల ఇంద్ర ధనువులున్నాయ్" సాయిబాబా, వరవరరావు అని వేరే చెప్పాలా.. మిత్రులారా పై వాక్యాలు ఎవరెవరిని ఉద్దేసించినవో... అండా సెల్ దుస్థి కల్పించిన కారకులెవరో తెలుసు కదా..

"గాలిపటం కిందకు దిగిపోయాక ఆకాశం కళ్లెవరి కోసం ఆతృతగా వెతుకుతాయి.. పడవెళ్లిపోయాక తీరమెందుకు దిగులు పడుతుంది, నీటిలోని చేపలు తమ కాలితో తన్నకపోతే నదిగుండె నరాలెంత చిక్కబడతాయి.." విరహాన్ని వియోగాన్ని కోల్పోతున్న తనాన్ని కవి ఇలా రొమాంటిసైజ్ చేశాడు. విప్లవ కవితలో ఇలాంటి ఎన్నో ప్రతీకల గురించి ఎంతైనా మాట్లాడుకోవచ్చు.

"చెరసాల కనుపాపల్లో పూసిన తురాయిపూల తహతహ ఇనుప తెరల్ని కరిగించి వేస్తుంది".. రాజ్యం అణచివేత ధోరణి తీరు మారకుంటే ప్రజా తిరుగుబాటు తప్పదన్న సూటి హెచ్చరికను ఎంత సుతిమెత్తగా చెప్పాడో చూడండి.. ఒక చోట "నిదుర మేయని రాత్రులు" అంటాడు.. బాధిత వర్గపు నిద్రపట్టని ఉక్కిరిబిక్కిరి స్థితిని కవి అంతలా ఓన్ చేసుకున్నాడు. ఒక సంక్లిష్టత స్థితిని అంత కవిత్వం చేయటం గమనార్హం..

"ఉడుకు నెత్తురు వెల్ల వేసుకున్న ఇంటి గోడల్లా ఉంటాయి, కోతలయ్యాక కొడవళ్ళిక్కడ నెలవంకలై వచ్చి వాలతాయి..



- శ్రీనివాస్ సూఫీ, 9640311380

గూట్లోకెళ్ళే ముందు పక్షుల్లా సేదతీరతాయి". అంత సీరియస్ సబ్జెక్ట్ లోకి ఇంత కవిత్వ హృద్యం ఎలా నింపాడో చూడండి. ఎర్ర మట్టి గోడలను విప్లవ ప్రతీక చేశాడు.. కొడవళ్లను నిలబెడితే అర్ధచంద్రాకారాకృతిలో నెలవంకల్లా ఉంటాయి... పొలాల్లో కోతల్లో అలసిన కొడవళ్ళు గూట్లోకి వెళ్ళే పక్షుల్లా సేద తీరతాయి, భలే పోలిక. చాలా అందంగా అమరింది.. కోతలు అయ్యాక అని కవి అనటంలో అర్థం వేరే.. కోయాల్సిన కోతలు మాత్రం ఇంకా ఉన్నాయ్, కొడవళ్ల మరింత కక్కు పెట్టుకోవాల్సిన అవసరం ఉంది అని భావన..

మహాకవి వాపోయినట్టు మనుషుల్లో పుట్టుకతో వృద్ధులు ముందుయుగం దూతలు ఉన్నట్టే.. కొడవళ్లలో కూరలు తరిగేవి, ముదురు పనల పొలాలను కోసే కక్కు కొడవళ్ల వేరుగా ఉంటాయ్..

"కాగితప్పూల రెక్కలపై వాన చినుల్ని ఆడుకోనివ్వరేమో కదా.." క్షీణించిన స్వేచ్ఛకు పరాకాష్ఠ ప్రకటన ఇది. కానీ అంత బరువైన వేదన ఎంత సునితంగా చెప్పాడో గమనించండి..

"తోడు పడుకునేందుకు రాని స్నేహితుడి కోసం చేలోని జొన్న కంకులు పాలుకట్టవు" ఊస బియ్యమంత కమ్మగా ఉంది ఈ వాక్యం.. పాలకండె అంత అందంగా ఉంది.. మంచు రాత్రుల్లో మంచెల్లో చేల కావలిగా గ్రామాల్లో పాలకనుకుల వయ్యసంత పాలేర్లే ఉంటారు. జొన్న చేనును దళిత వర్గ కావలితనం స్థితిలోంచి, పహారాలో ఉన్న గిరిజన గూడేల దయనీయ దృశ్యాన్ని ఒక్క వాక్యంలో దృశ్యమానం చేశాడు..

"మనుషులు ఒకర్నొకరు పలకరించుకోటం కన్నా తడిపి ముద్దచేసే వానెక్కడ కురుస్తుంది ?" సమాజంపై కురవాల్సిన మనిషితనం కోసం ముసిరిన నల్లమబ్బు భావాలివి... అంటరాని తనం అనే మన్ను కప్పబడిన మనిషితనాలను మొలిపించాల్సిన చినుకులు కావా ఇవి ?...

"గాలిపటం కిందకు దిగిపోయాక ఆకాశం కళ్లెవరి కోసం ఆతృతగా వెతుకుతాయి.. పడవెళ్లిపోయాక తీరమెందుకు దిగులు పడుతుంది, నీటిలోని చేపలు తమ కాలితో తన్నకపోతే నదిగుండె నరాలెంత చిక్కబడతాయి.." విరహాన్ని వియోగాన్ని కోల్పోతున్న తనాన్ని కవి ఇలా రొమాంటిసైజ్ చేశాడు. విప్లవ కవితలో ఇలాంటి ఎన్నో ప్రతీకల గురించి ఎంతైనా మాట్లాడుకోవచ్చు.

సామాజిక రుగ్మతలు, సమస్యలపై భీమా నది గొంతుతో కవి పడ్డ ఆవేదన అభినందనీయం కానీ.. దేశం గాయాల బొబ్బల బాధితుల బర్నింగ్ వార్డ్ అక్షరాలు, వాక్యాలు పుస్తకాల లేపనాల పూతలతో బర్నింగ్ సమస్య తీరదు మారదు.. ఏసీ గదిలో కూర్చోని ఉక్కిరిబిక్కిరి స్థితిని గతిని నమోదు చేసి చల్లబడితే చాలదు..

హని బాబు, తేల్ తుంబ్డే, గౌతం నవ్ లఖా, సుధా భర్ద్వాజ్, అరుణ్ ఫెరీరా, గోంజాల్వెజ్, వరవర రావు, సాయిబాబా తదితర హక్కుల కార్యకర్తలా ప్రత్యక్ష పోరాట కార్యాచరణ వాగ్దానమివ్వాలి.. అప్పుడే వర్గ సమాజం తన రాతల్ని విశ్వసిస్తుంది.. కావ్య గౌరవం పెంపొందుతుంది.

పొయ్యిమీదనే ఆకలి కాలిపోతున్నది

దేశభక్తంటే
సరిహద్దుల్లో మీసాలు మెలేయ్యడమే కాదు
పేదల ఇండ్లల్ల పొయ్యి వెలుగాలే
కడుపులకింత కూడుడుకాలే !

బతుకును నెట్టుకురావడమంటే
నిచ్చెన లేకుండా మిద్దెక్కినట్లుంది
వొట్టి కాళ్లతో పలుగురాళ్లల్ల నడిచినట్లుంది
పేదల కన్నీళ్ళంటే ఎంత ప్రీతో
వెలిగిపోతున్న "భారతం"లో
నెత్తిమీద గ్యాస్ బండలు

పోయిన కాలాలే బాగుండే
సెలుకల్ల కూలిపోయి వచ్చేటప్పుడు
అమ్మ కట్టెలమోపుతోనే ఇంటికొచ్చేది
ఒక్కనాడు కట్టెల బాధలేదు
ఎన్ని దినాలైనా పొయ్యి దగాదగా మండేది
దీని పాడుగాను నెలకాకముందే
సిలిండర్ గ్యాస్ పెద్దపులై తరుముతున్నది

అడ్డామీది కూలి పని దొరుకని వెతలు
చెట్టుగొట్టొద్దు వంట చెరుకు తేరాదు
ఆరిపోతున్న పొయిల బతుకు బువ్వెట్ల
చేసిన పనంతా గ్యాస్‌కే కాలిపోతే
బతుకు చెరువులో
చేపలు ఈదెదెట్ల సంసారం సాగేదెట్ల ?

మహారాజా !
మీది పోయేదేముంది
కలం మీదే పాలన మీదే
అన్నింటిని పెంచేయ్యండి
ఎన్నింటిని పెంచినా తిరిగితిరిగి
మీ బోశనమే గదా నిండేది !

కరోనాలో
చావుల్ని పెంచినట్లుగా
అన్నింటి మీద మీ ముద్దెరలేసుకోని
నిత్య అవసరాలను నిప్పులను చేయండి
కరెంట్‌ను ముట్టుకున్నా కాలిపోతలేం గానీ
ఏదికొన్నా బొగ్గులైతున్నం
మీది పోయేదేముంది
అన్నింటిని అందకుండా చేసే కాషాయపాలన

ఇప్పట్లో
ఇగ ఏ ఎన్నికల వానలు లేవేమో
మేం గుర్తుండటానికీ!
రోజురోజు అంగట్ల కొన్కొచ్చుకొనే బీదలం
మీరొక్కనాడే కొని అయిదేళ్ళు
మహారాజుల్లా వెలిగిపోతూనే వుంటారు

సబ్సిడీని
కత్తులమూటను చేసిన కర్కశ పాలన"
ఇన్నిసార్లు మా రక్తాన్ని పిండుకోవడమెందుకు
ఒకటేసారి
ఆ కంట్రోల్ బియ్యముల ఏమన్న కలిపి పంపీయండి
ఒక్కసారే తిని ఒక్కసారే గుడ్డు పెడ్తాం !

– వనపట్ల సుబ్బయ్య
9492765358

16న 'అనార్కలి' ఆవిష్కరణ

అభ్యుదయ రచయితల సంఘం తెలంగాణ రాష్ట్ర విభాగం, పాలపిట్ట బుక్స్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అమ్జద్ అనువాద కథల సంపుటి 'అనార్కలి' ఈ నెల 16న గురువారం సాయంత్రం 6:00 గం॥లకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో ఆవిష్కరించనున్నారు. రాపోలు సుదర్శన్ సభాధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి జూలూరి గౌరిశంకర్ ముఖ్యఅతిథిగా, ఏ.కె.ప్రభాకర్ విశిష్ట అతిథిగా, ఏనుగు నరసింహారెడ్డి గౌరవ అతిథిగా, కవి యాకూబ్, అబ్దుల్ వాహెద్, రూప్‌కుమార్ డబ్బీకార్ ఆత్మీయ అతిథిలుగా హాజరు కానున్నారు.

సాహితీ వార్తలు

17న 'మూడు గుడిసెల పల్లె' ఆవిష్కరణ

ఈ నెల 17న ప్రముఖ కథా రచయిత డా. సిద్దెంకి యాదగిరి కథా సంపుటి "మూడు గుడిసెల పల్లె" పుస్తకావిష్కరణ మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి మినీ హాల్లో సాయంత్రం 5:30గం.లకు నిర్వహించనున్నారు. మంజీర రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు కె.రంగాచారి అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి కొలకలూరి ఇనాక్ పుస్తకావిష్కరణ, విశిష్ట అతిధులుగా ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, నందిని సిద్ధారెడ్డి ముఖ్యఅతిథులుగా, తెలుగు సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు, ప్రముఖ కవి గాయకులు దేశపతి శ్రీనివాస్ వక్తలుగా హాజరు కానున్నారు.

జాతీయ స్థాయి కథలు, కవితల పోటీలు

వురిమళ్ళ ఫౌండేషన్ - అక్షరాల తోవ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కథలు, కవితల పోటీలు నిర్వహించనున్నారు. 'వురిమళ్ల శ్రీరాములు' స్మారక కథల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5000/-, రూ.4000/-, రూ.3000/- లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు రూ.1000 చొప్పున ఇవ్వనున్నారు. 'వురిమళ్ళ పద్మజ' స్మారక కవితల పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.4000/-, రూ.3000/-, రూ.2000/- లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు రూ.1000 చొప్పున అందివ్వనున్నారు. వీరితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాహిత్యంలో విశేష కృషి చేసిన ఒకరికి 'భోగోజు పురుషోత్తం సముద్రమ్మ' సాహితీ పురస్కారం కూడా అందివ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు కథలు, కవితలు 15 ఏప్రిల్ లోగా భోగోజు ఉపేందర్‌రావు, ఇ.నెం. 11-10-694/5, బురహాన్ పురం, ఖమ్మం - 507001 చిరునామాకు పంపవచ్చు. వివరాలకు 9494773969 నంబరు నందు సంప్రదించవచ్చు.

మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ - పాలపిట్ట

కథల పోటీ ఫలితాలు

మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ - పాలపిట్ట సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీ - 2022 ఫలితాలు వెలువరించారు. బహుమతులకు ఎంపికయిన కథల వివరాలు... ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు - షేక్ షబ్బీర్ హుస్సేన్ (లాలాల్ సాయిబు), జాలాది రత్న సుధీర్ (కొరడా దెబ్బలు), తెలిదేవర భానుమూర్తి (చేదు నిజం), వీటితో పాటు 7 ప్రత్యేక బహుమతులుకు చీకట్లోంచీ... - విహారి, పూర్ణ చంద్రోదయం - ఉణుదుర్తి సుధాకర్, కరు(రో)ణ - డాక్టర్ నక్కా విజయరామరాజు, నల్ల చీమలు - స్ఫూర్తి కందివనం, అసతోమా సద్గమయ - వేణు మారీడు, దేవుడు - మనిషి - తటవర్తి నాగేశ్వరి, రేపటి సూర్యుడు - శరత్చంద్ర కథలు ఎంపికయ్యాయి.

మన కాలం గొప్ప పాత్రికేయ విమర్శక నవలాకారిణి కె.రామలక్ష్మి

నివాళి

"కాలం కరుణామయహంతకి" అంటాడు మఖ్దూం ఓ సందర్భంలో... 2023 సినీ ప్రముఖుల్ని తీసుకుపోతోంది. ఒక్కొక్కర్ని... 92 ఏండ్ల నిండు జీవితం గడిపిన కె.రామలక్ష్మి 3 మార్చి 2023 శుక్రవారం కన్నుమూశారు. కూచి రామలక్ష్మి 1930 డిసెంబర్ 31న ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ జిల్లా కోట నందూరు గ్రామంలో జన్మించారు. మద్రాస్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని మేరి స్టెల్లా కాలేజీలో డిగ్రీ పూర్తి చేసారు. రామలక్ష్మి ఆధునిక



భావాలు; పురోగమన దృక్పథం, ధిక్కార స్వరం, ఫెమినిస్ట్ ఆలోచనలు ఈమె రచనల్లో కనిపిస్తాయి. దాదాపు 100 పుస్తకాలు రాసారు. ఖసా సుబ్బారావు నడిపిన తెలుగు స్వతంత్ర పత్రికలో ఆంగ్ల విభాగంలో ఉప సంపాదకురాలిగా పనిచేసారు. డా॥ సినారె తొలి పుస్తకానికి ఆ పత్రికలో తొట్టతొలిగా సమీక్ష చేసింది రామలక్ష్మి. 1950 ఏప్రిల్ 30న ఆరుద్రని రిజిస్టర్ మేరేజ్ చేసుకొంది. హెచ్.ఎం. రెడ్డి, శ్రీశ్రీలు నాటి పెండ్లికి పెద్దలూ, సాక్షులు.. ఆదర్శాలు ఆచరణలో చూపాలనే ధోరణి ఆమెది. తెలుగు, హిందీ, తమిళం, సంస్కృతం, ఆంగ్లం భాషల్లో మంచి పట్టు ఉన్న రామలక్ష్మి 15 నవలలు, మూడు కథా సంపుటాలు పలు చిత్రాలకు రచనలు చేసారు. సెన్సార్ బోర్డు సభ్యురాలిగా ఉన్నారు. చిన్నారి పాపలు, జీవనజ్యోతి చిత్రాలకు కథా రచన చేసారు. జీవనజ్యోతికి నంది పురస్కారం వచ్చింది. కథ, నవల, విమర్శ, సమీక్ష, అనువాదం, పాత్రికేయ వృత్తి, సినీ కథలకు రచనలు.. ప్రాచీనాంధ్ర సాహిత్యంపై మంచి పట్టు వున్న రామలక్ష్మి 1954లో విడదీసే రైలు బళ్లు నవల రాసి ప్రఖ్యాతినొందారు. అవతలి గట్టు, మెరుపు తీగె, తొణికిన స్వరం (1961), మానని గాయం, ఆణిముత్యం, పెళ్ళి (2013), కస్తూరి (2001), ప్రేమించు ప్రేమకై, ఆడది, ఆశకు సంకెళ్ళు, కరుణ కథ, లవంగి, ఆంధ్ర నాయకుడు, పండరంగని ప్రతిజ్ఞ మొ॥ నవలు రాసారు. రామలక్ష్మి మృతికి తెలుగు సాహిత్యానికి తీరనిలోటు.

- తంగిరాల చక్రవర్తి

సర్వ సమతా సత్యవాదం - బాపురెడ్డి కవితానాదం

ప్రసిద్ధ సమకాలీనాంధ్ర కవుల్లో డా॥జె.బాపురెడ్డి గణనీయులు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారికి గూడ సుపరిచితులైన వీరు 1936 జులై 21న కరీంనగర్ జిల్లా 'సిరిసిల్ల' తాలుకా పరిధిలోని 'సిరికొండ'లో జంకె కృష్ణారెడ్డి, రామలక్ష్మి దంపతులకు జన్మించారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి, గ్రామీణ వాతావరణం లో వేళ్లు తన్నుకున్న వీరి జీవితం, అంచెలంచెలుగా వృత్తిరీత్యా ప్రతిష్టాత్మక ఐ.ఏ.ఎస్. ఉన్నతాధికారి స్థాయికి ప్రవృత్తిరీత్యా ప్రముఖ కవిగా విజ్ఞాన వేత్తగా ఎదిగిన పరిణామాలు ఎంతో ఆసక్తికరంగా ఉన్నాయి. యువతరానికి స్ఫూర్తిదాయకంగా వెలుగొందాయి.

బాపురెడ్డి బహు గ్రంథకర్త. పాఠశాల స్థాయి లోనే కవిత్వ రచన ఆరంభించి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఉండగా శోభ పత్రికలో ఎకనా మిక్స్ సుందరి అనే కవితను ప్రచురించి ఉత్తమ కవిత అవార్డును సొంతం చేసుకున్నారు. చైతన్య రేఖలు అనే కవిత్వ సంపుటిని ప్రచురించారు. వీరు రచించిన ఋతురాగం గేయ నాటిక నంది అవార్డును కైవసం చేసుకున్నది. బాపురెడ్డి గేయాలు, శ్రీకారశిఖరం, ప్రేమారామం, నా దేశం నవ్వుతుంది, బాపురెడ్డి భావ గీతాలు, ఆటపాటలు, నవగీత నాట్యం, వంటి గేయ సంపుటాలు, రాకెట్టు రాయబారం, భావి జీవులు, సాగర సౌధం, విజయ హేల, కళ్యాణ యాత్ర, చాచా నెహ్రూ, ఎన్జీవో, చేతన కేతనం, స్వాతంత్ర్యహేల, సకల జన సంక్రాంతి మొదలైన గేయ నాటికలు, బాపు రెడ్డి పద్య కావ్యాలు, మన చేతుల్లోనే ఉంది, రంగు రంగుల చీకట్లు, ప్రణవ ప్రణయం, కాలం మాయాజాలం, సౌదామిని కవితలు, ఆత్మీయ రాగాలు, అక్షరానుభూతులు, వాడిపోని వసంతాలు, లోకానులోకనం వంటి కవిత్వ సంపుటాలు, ఆధునిక తెలుగు కవిత్వం తీరు తెన్నులు, సాహితీ వైవిధ్యము మొదలైన విమర్శ గ్రంథాలు, అనంత సత్యాలు, నాద వేదాలు, బాపురెడ్డి గద్య కావ్యాలు, పంచ బాణసంచా, వంటి గ్రంథాల తో పాటు quest of harmony, longing for life, Urn of love, loving is living, anatomy of time, varieties and visions వంటి ఆంగ్ల గ్రంథాలు, వ్యవధి లేదు, పైకెత్తాలి, ప్రకృతిలో పవిత్రత, అజ్ఞాత శాంతి సందేశం, రాకుమారుడు పగడాల కడలి వంటి అనువాద గ్రంథాలు మొదలైన 50కి పైగా రచనలు చేశారు.



నవ్యత, మానవత, ప్రసన్నత, భావుకత, తాత్వికతలు బాపురెడ్డి కవితల్లో ప్రసాదభరితమై సజీవంగా దర్శనమిస్తాయి. వచన కవిత్వం రాజ్యమేలుతున్న నేటి కాలంలో వీరు సాహసంతో పద్యప్రక్రియను స్పృశించి అనుభూతి, అభివ్యక్తి, సౌందర్యం, సందేశం. స్ఫూర్తితో ఛందో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ, రసరమ్య భావవాహినులను పొంగించి, తమ పద్యరచనా పటిమను నిరూపించుకున్నారు. వీరి గేయాలు లలిత పద బంధురమై, సురాసుర సంగీత సాహిత్య ప్రియులకు విందు చేశాయి. సుప్రసిద్ధ సంగీత వీరి లలిత గీతాలకు స్వరకల్పన చేసి శ్రోతలనలరించారు.

ఇక వీరి గేయనాటికలు రమణీయ భావ పేటికలు. హృద్య కవితావాటికలు. చారిత్రక, పురాణేతిహాస కథాభరితంగా నడుస్తున్న గేయనాటికల ఇతివృత్తాలను తమ కలంతో సామాజిక ఇతివృత్తాలుగా మార్చి గేయనాటికా రచనల్లో నూతన ఒరవడిని సృష్టించారు. వీరి అనువాదాలు అనుభూతి పరాలు, ప్రఖ్యాత పాశ్చాత్య కవయిత్రుల మూడు ఆంగ్లకృతుల్ని వీరు తెలుగులోకి అనువదించి మూలకృతులలోని కవి హృదయాన్ని ఆవిష్కరించారు. తెలుగులో వీరు ఎంత హృదయంగమంగా కవితలల్లారో, అంతే హృద్యంగా నాలుగు ఆంగ్లకృతులను కూడా విరచించి, ఉభయకవి మిత్రులనిపించుకున్నారు. వివిధ దృక్కోణాలతో తన 'మనసులోని మాటలను సామాజిక సాహిత్య వ్యాసాలుగా తీర్చిదిద్ది, వ్యాససంపుటం ద్వారా 'ఆధునిక తెలుగు కవిత తీరుతెన్నులు' తెలుగు వారికందించి విమర్శకునిగా కూడా గుర్తింపు పొందారు. వీరి ప్రతి రచనలోనూ, ప్రణయ, ప్రణవ, ప్రగతి భావాలు, అంతర్వాహినిగా కన్పిస్తాయి. మానవజాతికి నిర్మాణాత్మక శాంతిమయ జీవితదర్శాన్ని అందించే సౌందర్యలహరి ప్రణయం, భౌతిక సత్యాన్ని పరతత్వాన్ని జోడించే పరిమళసోపానమది. ఆయత్నపూర్వక సంవేదనాభివ్యక్తితో మనలను పునీతులగా చేసే తీయని భావమిది. అందుకే ప్రకృతి పురుషయోగ తత్వం ప్రతిఫలించే ప్రణయ తత్వం మానవ జీవిత సత్యం కావాలని వీరు తమరచనల్లో ఆశించారు. వీరి ప్రగతి భావాలు నిర్మాణాత్మక నిర్ణయాత్మక ఫలితాలను సృష్టించాయి. అనంత సత్య గర్భితమైన చరాచర సృష్టిలో మానవ జీవితానికి ఉపయుక్తమయ్యే సామాజిక భావోద్దీపన వీరి ప్రగతి తత్వంలో దర్శనమిస్తుంది. సామాజిక వైరుధ్యాల పట్ల స్పందన అవశ్యమని తన ప్రగతిశీల భావాల్లో నిరూపించారు. తరతరాల ఏకతాభావాన్ని సమతావేదికపై నిలపాలనీ అపుడే సామాజిక అసమానతలు తొలగిపోయి మమతా మానవతలు పరిమళిస్తాయని ప్రగతి దృక్పథంతో భావించారు.

వీరి 'భావ భౌతికవాదం' తెలుగులో సరికొత్త స్వేచ్ఛావాదంగా నిలిచి సాహితీ విమర్శకులను సైతం ఆలోచింపజేస్తోంది. భౌతికాన్ని భావంతో సంధానించినప్పుడు అనుభూతమయ్యేది ఆనందమనే అనంతసత్యం. ఒక వస్తువులోని అనంత రూపగుణాలను విశ్వసించడం వల్ల నూతన విలువలు ఏర్పడతాయి.

బాపురెడ్డి ప్రణవనాదం ఆధ్యాత్మిక, తాత్విక భావాలను వినిపించింది. ప్రాపంచిక విషయ సుఖాలలో మునిగిన మనిషి అశాశ్వతమైన కాయమే సత్యమని భ్రమించి జీవితాన్ని వృథా చేసుకుంటున్న విషయాన్ని తమ ఆధ్యాత్మక భావాలలో రంగరించిపోశారు. భక్తి, జ్ఞాన, కర్మ యోగ సాధనల ద్వారా అంతులేని ప్రశాంతతను, పవిత్రతను పొంది, ప్రజ్ఞానాన్ని సంపాదించి మోక్షము పొందవచ్చునని రెడ్డి ప్రణవదృష్టితో చెప్పారు.



- డాక్టర్ చింతోజు మల్లికార్జునాచారి
99499 27142

ఇక, వీరి 'భావ భౌతికవాదం' తెలుగులో సరికొత్త స్వేచ్ఛావాదంగా నిలిచి సాహితీ విమర్శకులను సైతం ఆలోచింపజేస్తోంది. భౌతికాన్ని భావంతో సంధానించినప్పుడు అనుభూతమయ్యేది ఆనందమనే అనంతసత్యం. ఒక వస్తువులోని అనంత రూపగుణాలను విశ్వసించడం వల్ల నూతన విలువలు ఏర్పడతాయి. అవి మన ఆదర్శాలకు అనుగుణంగా ప్రతిఫలించాలని దైవత్వం అనంతత్వాలను ప్రకటితం చేయాలని వీరు తన వాదం ద్వారా అభిలషించారు. అధివాస్త వికతను ఆనందము వైపుమళ్ళించడమూ, సామా జిక స్పృహను సౌందర్యం వైపు నడిపించటమూ రెడ్డి భావభౌతికవాద ప్రస్థానం.


బాపురెడ్డి నిరంతరాన్వేషి, కవితా పిపాసి. తన ఆరు దశాబ్దాల సుదీర్ఘ సాహితీ స్రవంతిలో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తన గళాన్ని వినిపించారు. అలుపెరుగని కవితా తృష్ణతో కడదాకా రచనలు చేసిన బాపురెడ్డి ఇటీవల లోకాన్ని వీడి వెళ్లడం తెలుగు సాహిత్యానికి తీరని లోటు. తెలుగు సాహితీవినీలాకాశంలో బాపురెడ్డి ఒక ధ్రువతారగా వెలుగుతూనే ఉంటారు.

(వ్యాసకర్త 'బాపురెడ్డి కవితా దృక్పథం' పై ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టం పొందారు)

లిప్పన్ కళాకృతులు

లిప్పన్ ఆర్ట్ లేదా మడ్ మిర్రర్ ఆర్ట్ అనేది గుజరాత్ రాష్ట్రానికి చెందిన కళ. నేను గత నెలలోనే గుజరాత్ రాష్ట్రాన్ని చూడటానికి వెళ్ళాను. అక్కడ గాంధీజీ పాదముద్రలతో పాటు ఆ రాష్ట్ర సాంప్రదాయ కళల్ని కూడా చూశాను. మేము వెళ్ళిన జాతీయ పిల్లల వైద్య నిపుణుల సమావేశంలో అక్కడి సంస్కృతి కళలకు సంబంధించి స్టాల్స్ ఎన్నో పెట్టారు. వాటిలో ఈ లిప్పన్ ఆర్ట్ స్టాల్ కూడా ఉంది. మట్టితో తయారయే కళా రూపాల్ని, గ్రామీణ ప్రాంత మహిళలు తమ ఇళ్ళను అలంకరించుకోవడానికి తయారు చేసుకుంటారు. ఈ లిప్పన్ ఆర్ట్‌కు గుజరాత్ రాష్ట్రంలోని కచ్ ప్రాంతం పేరు. మా చిన్నప్పుడు ఎంతో గొప్పగా నేర్చుకున్న 'కచ్ వర్క్' ఈ ప్రాంతందే అని తెలుసుకునే సరికి ఎంతో ఆనందమేసింది. కచ్ వర్క్ నేర్చుకుంటే కుట్లు కుట్టడంలో బి.ఎ పాస్ అయినట్టే. కచ్ వర్క్ అంటే అంత కష్టంగానూ, అంత గొప్పగానూ చెప్పకునేవారు. లిప్పన్ ఆర్ట్‌ను మట్టి, ఆవుపేడ కలిపి ఇళ్ళ గోడలను అందంగా తీర్చిదిద్దుతారు.





లిప్పన్ ఆర్ట్‌లో బేస్‌గా వాడటానికి అట్టముక్కలు, మందపాటి ఎమ్‌డిఎఫ్ బోర్డుల్ని ఉపయోగిస్తాము. బాగా



మందంగా ఉన్న ఎండిఎఫ్ బోర్డును నలుచదరంగా కత్తిరించుకుని రెడీగా ఉంచుకోవాలి. ఇప్పుడు ఈ బోర్డుపై మనకు నచ్చిన డిజైనును గీసుకోవాలి. మొదట పెన్సిల్‌తో గీసి ఉంచుకుంటే దానిపై మట్టి మిశ్రమంతో గీతలు గీసుకోవచ్చు. పూర్వకాలంలో మట్టి, పేడల మిశ్రమం వాడినప్పటికీ ఈ కాలంలో మనం వాల్‌పుట్టీ పౌడర్‌ను వాడవచ్చు. వాల్ పుట్టి పౌడర్‌ను తెచ్చుకుని దానిలో ఫెవికాల్‌ను కలిపి ముద్దగా చేసుకోవాలి. ఇంకొంచం మెత్తగా ఫైన్‌గా రావడానికి రెండు చుక్కల నీరు, రెండు చుక్కల నూనెను కలపాలి. కోన్‌లో నుంచి జారేలా కొద్దిగా జారుడుగా కలుపుకోవాలి. అంటే గోరింటాకు కోన్‌ను తయారుచేసినట్లుగా, ప్లాస్టిక్ కాగితపు కోన్‌లో వాల్ పుట్టి మిశ్రమాన్ని నింపి పెట్టుకోవాలి. ఇప్పుడు ఎక్కువ గజిబిజి లేకుండా సులభమైన గీతల డిజైన్‌ను వేసుకుని, దానిపై కోన్‌తో మిశ్రమాన్ని దిద్దాలి. ఇది పూర్తిగా ఎండిన తర్వాత రంగులు వెయ్యాలి. రెండు మూడు రంగుల డిజైన్‌లు వేసుకోవాలి. రంగులు వేయటం పూర్తయ్యాక అద్దాలు అతికించాలి. గుండ్రం, నలుచదరం, డైమండ్ ఆకారాల అద్దాలను అందంగా అతికించి కళాకృతిని కనువిందుగా మలుచుకోవాలి.


పాత డబ్బాలపై డిజైన్లు

వాల్‌పుట్టితో పాటు ఎమ్‌సీల్ కూడా ఉపయోగించవచ్చు. లేదంటే షాపుల్లో దొరికే శిల్పకార్‌క్లేను



కూడా వాడవచ్చు. ఆర్ట్ షాపుల్లో క్లే పౌడర్ దొరుకుతుంది. రకరకాల కంపెనీల మట్టి దొరుకుతుంది. వీటిలో ఏదైనా వాడవచ్చు. మేము దిగిన హెూటల్‌లో కూడా ఈ మట్టి ఫ్రేములు ఎన్నో అలంకరించబడ్డాయి. ఎయిర్‌పోర్టులోనూ ఈ మట్టి కళాకృతులు ఎన్నో కనిపించాయి. వాల్‌పుట్టి మిశ్రమాలకు రంగులు వేసి కూడా వాడవచ్చు. దీని కోసం యాక్రిలిక్ రంగుల్ని వాడవచ్చు. లేదంటే ఫుడ్ కలర్స్‌ను కూడా ఉపయోగించవచ్చు. ఇలాంటి రంగుల మట్టితో ప్లాస్టిక్ డబ్బాలు, సీసాల మీద కూడా డిజైన్లు వేయవచ్చు. రంగుల మట్టిలో మెటాలిక్ రంగుల్ని లేదా మెరుపుల్ని కూడా వాడితే బాగుంటుంది. హార్లిక్స్ డబ్బాలకు ఈ డిజైను వేసుకుంటే అందంగా ఉంటుంది. రంగుల పుట్టి కోన్‌లతో చుక్కలు, గీతలు గీసుకున్నట్టుగా డిజైన్ వేసుకోవచ్చు. హార్లిక్స్ డబ్బానే కాదు ఏదైనా ప్లాస్టిక్ డబ్బాలను వాడుకోవచ్చు. రంగురంగుల మట్టితో డిజైన్లు వేశాక అద్దాలు అతికించుకోవచ్చు. దీనిలో పూలు పెట్టుకుని పూల కుండీగా వాడుకోవచ్చు. లేదంటే టీపాయ్ మీద అందంగా అలంకరించుకోవచ్చు.

ఫ్రేములపై డిజైన్లు



కొన్ని పెద్ద ఫ్రేములను వేసుకునేటపుడు కోన్లు తయారు చేసుకోనవసరం లేదు. పిండి మిశ్రమం కలుపుకున్నాక పక్కన పెట్టుకుని చేత్తో బండమీద తాల్చుకోవాలి. తాళ్ళను పేనినట్టుగా సన్నగా చేత్తో పాలతాలికలు చేసినట్టుగా చేసుకోవాలి. ఒకే విధంగా ఉండేలా తాడులా పేనినాక బోర్డు మీద పెన్సిల్ గీత వెంబడి అతికించుకుంటూ పోవాలి. చివర్లు కత్తిరించడానికి చిన్న కత్తి వాడాలి. దానికి కావాల్సిన టూల్స్ కూడా షాపుల్లో దొరుకుతాయి. మొత్తం డిజైను పూర్తయ్యాక గీతల వెంట అతికిన తాడు మీద సన్నగా గాట్లు పెట్టుకోవాలి. టూత్‌పిక్స్, ఫోల్‌సెప్స్, నీడిల్ వంటివి వాడితే మెలిబెట్టిన తాడు లాగా డిజైను వస్తుంది. మనకు నచ్చినట్టుగా డిజైన్లు చేసుకోవచ్చు. రంగులు వేసుకోవాలి. అద్దాలు కూడా అతికించాలి. గుజరాత్ గ్రామాల్లో మట్టితో పాటు ఒంటె పేడను కూడా కలపుతారు. దీనివల్ల ఇంటిలోపల చల్లదనంగా ఉంటుంది. ఇది ప్రధానంగా లోపలి గోడలకు పరిమితమైనప్పటికీ, వెలుపలి గోడలపై కూడా కళాకృతులు వేసుకుంటారు.

ఆకులపై కూడా...

ఈ లిప్పన్ ఆర్ట్‌ను ఆకుల మీద కూడా వేయవచ్చు. ఆకులను బాగా ఎండబెట్టి దాని మీద ఈ ఆర్ట్‌ను వేయవచ్చు. మామిడి, బాదం, రావి ఆకులను పేపర్ల



మధ్యలో ఎండబెట్టాలి. ఎండాక దాని మీద సులభమైన డిజైన్లు వేసుకుంటే బాగుంటుంది. మొదటగా ఆకును పూర్తి ఆకుపచ్చ రంగును వేసుకోవాలి. రంగుతో నింపాక కోన్‌తో సన్నగా డిజైన్లు వెయ్యాలి. దీనికి మరల రంగులు వెయ్యడం కష్టం కాబట్టి రంగుల మట్టి కోన్లు వాడితే బాగుంటుంది. నాలుగైదు రంగుల కోన్లు తయారు చేసి ఉంచుకుంటే బాగుంటుంది. కోన్ల చివరి భాగం గాలి పోకుండా జాగ్రత్తగా అతికించుకోవాలి. వాడేటప్పుడు చివర్న కత్తిరించాలి. ఏ మాత్రం గాలి దూరినా మొత్తం కోన్ ఎండిపోతుంది. ఇలా ఆకు మీద డిజైను వెరైటీగా ఉంటుంది.

నగలు చేసుకుందాం...



మందపాటి జనపనార షీట్లపై లిప్పన్ ఆర్ట్ వేయవచ్చు. ఆర్ట్‌లో రకరకాల డిజైన్లు వేసినట్టుగా, బేస్‌లో కూడా రకరకాలుగా పెట్టుకోవచ్చు. మందపాటి గోతం సంచిని ఫెవికాల్ కలిపి ఎండబెడితే వంగిపోకుండా గట్టిగా ఉంటుంది. దీనిపై మట్టి కోన్‌తో డిజైన్లు వేసుకోవచ్చు. ఇంకా మట్టి మిశ్రమంతో జువెల్లరీ కూడా చేసుకోవచ్చు. నెక్లెస్‌లాగా కూడా చేసుకోవచ్చు. ముందు చిన్న ఉంగరం చేసుకుందాం. పుట్టి మిశ్రమాన్ని గుండ్రంగా చేత్తో తాల్చినాక చప్పగా అణగగొట్టినట్లుగా చేయాలి. చిన్న స్కేలుతో నొక్కితే చప్పగా అణుగుతుంది. దీన్ని గుండ్రంగా వేలుకు చుట్టుకొని దానికి రంగులు వేయాలి. గుండ్రని ఉంగరానికి డిజైన్లు వేసి ఆరనివ్వాలి. ఇలా సరదాగా ఉంగరాలు చేసి పెట్టుకోవచ్చు.

– డాక్టర్ కందేపి రాణీప్రసాద్


ఆరోజుల్లో సెలవులెందుకంటే..?



మనం జీవితంలో సగటున 3,000 రోజులు నెలసరితో గడుపుతాం. అంటే ఎనిమిదేళ్లకు పైగా అన్నమాట. ఆ రోజులు ఇబ్బందిగా, అసౌకర్యంగా ఉంటాయి. కొందరైతే దుర్భర కడుపునొప్పి, ఓవర్ బ్లీడింగ్, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, వికారాలతో బాధపడుతుంటారు. ఇంకొందరు పొత్తికడుపులో పోట్లతో ప్రసవవేదనను తలపించేంత యాతన అంటూ ఇబ్బంది పడుతుంటారు. ఈ పెయిన్‌ఫుల్ పీరియడ్స్ కారణంగానే నెలసరి సెలవు మంజూరు చేయాలంటూ గళం విప్పారు. ఇదెంతో అవసరమని ఉద్యోగినులు వాదిస్తోంటే.. కొన్ని కంపెనీలు మాత్రం ఈ ప్రతిపాదనకు సుముఖంగా లేవు. ఈ నేపథ్యంలో దీని పరిణామాలూ పర్యవసానాలేంటో చూద్దాం..

- మెన్‌స్ట్రువల్ లీవ్ చాలా మంచి ఆలోచన. నెలసరిలో యాతన అనుభవించేవారికి ఈ సెలవు ఎంతగానో తోడ్పడుతుంది. ఆ సమయంలో విశ్రాంతి తీసుకుని ఆరోగ్యంగా ఉండటమే కాదు, మరింత శక్తి పుంజుకుని హుషారుగా పనిచేస్తారు' అంటున్నారు కాలేజ్ ఆఫ్ న్యూజెర్సీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జెస్సికా బర్నాక్. రుతుస్రావానికి సంబంధించిన అంశాలపై ఏండ్ల తరబడి పరిశోధన చేశారు.
- 20 శాతం స్త్రీలు నెలసరిలో తీవ్ర నొప్పితో బాధపడుతున్నారు. 80 శాతం మంది 50 ఏండ్లు వచ్చేలోపు గర్భాశయంలో ఫైబ్రాయిడ్స్‌తో అవస్థపడుతున్నారు. సమస్య తీవ్రతను గుర్తించి ఆ రోజుల్లో సెలవు ఇచ్చేందుకు సంస్థలకు అభ్యంతరం లేదు కానీ అది పెయిడ్ లీవ్ అంటేనే వివాదాస్పదమౌతోంది. ముఖ్యంగా అత్యధిక జీతాలు చెల్లించే కార్పొరేట్ సంస్థలు గంటకు ఇంతని లెక్కకట్టి అది తమకెంత నష్టదాయకమో వివరిస్తున్నాయి.
- దక్షిణ కొరియా, ఇండోనేషియా, జాంబియా లాంటి కొన్ని దేశాలు ఇప్పటికే నెలసరి సెలవలను ఆమోదించి అమలుపరిచాయి. దేశంలోనూ ఫుడ్ డెలివరీ కంపెనీ జొమాటో సహా ఎన్నో సంస్థలు తన ఉద్యోగులకు ఈ సౌకర్యం కల్పించింది.
- 'నెలసరి సెలవు అమలైతే స్త్రీల సామర్థ్యాన్ని కించపరచడం, వ్యతిరేకత చూపడం, వివక్ష ఎక్కువవడం లాంటివే కాదు.. అనేక సంస్థలు ఉద్యోగం ఇవ్వడానికే నిరాకరించే ప్రమాదముంది' అంటున్నారు విశ్లేషకులు.

ఇట్ల చేద్దాం



ఆలివ్ ఆయిల్, చక్కెరలతో తయారుచేసిన స్క్రబ్ పొడిబారిన చేతులను కోమలంగా మార్చడంలో సహకరిస్తుంది. ఇందుకోసం అరకప్పు చక్కెరలో టేబుల్‌స్పూన్ ఆలివ్ నూనె వేసుకొని బాగా కలుపుకోవాలి. అవసరమైతే ఇందులో కొన్ని చుక్కల ఏదైనా అత్యవసర నూనె కూడా వేసుకోవచ్చు. ఇప్పుడు ఈ మిశ్రమం కొద్దిగా తీసుకొని దాన్ని చేతులపై రాసుకొని రెండు నిమిషాల పాటు మృదువుగా మర్దన చేయాలి. ఆపై గోరువెచ్చటి నీటితో కడిగేసుకుంటే సరిపోతుంది. ఇలా రోజూ చేయడం వల్ల కొన్ని రోజుల్లోనే పొడిబారిన చేతులు తిరిగి కోమలంగా మారతాయి.

ప్రభుత్వ రంగం వద్దట! ప్రయివేటే ముద్దట!!

(మొదటిపేజీ తరువాయి)

పెద్దమనిషి లిక్కర్ స్కాంలో ఊచలెక్కబెడ్తున్నాడిప్పుడు. దీనికి రాష్ట్ర బీజేపీ నేతలేం సమాధానం చెప్తారు? సంజయా ! తెలంగాణలో మీ నంగనాచి కబుర్లు చెల్లవు?!

దేశరక్షణ కూడా అదానీదేనా? : మన కండ్లముందే దెబ్బతిని పోతున్న మరో కీలక సంస్థ మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ. దాదాపు ఏడాదిన్నర క్రితం ఏడు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసిన వాటిలో ఇది ఆర్మర్డ్ వెహికల్ నిగమ్ లిమిటెడ్ (ఏవీఎన్ఎల్)లో ఉంది. 2024-25 నాటికి రూ. 30 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తుందని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఇప్పటికి రూ. తొమ్మిది వేల కోట్లు చేరలేదు దీని టర్నోవర్.

ఇటీవల 12 లక్షల డిజిటల్ యూనిఫార్మ్- ట్రూప్స్ కంఫర్ట్స్ లిమిటెడ్ (టీసీఎల్)కి అసలు ఆర్డరే ఇవ్వకుండా దిగుమతి చేసుకుందీ మోడీ ప్రభుత్వం.

గత ఐదు సంవత్సరాల్లో రూ. 2 లక్షల కోట్ల మిలటరీ ఎక్విప్‌మెంట్ దేశంలోకి దిగుమతి చేసుకున్నారని ఇటీవల ఎన్‌డీటీవీ వార్త ప్రసారం చేసింది. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు అంతర్జాతీయ బజార్లో తిరిగి ఆర్డర్లు సంపాదించుకోవాలట! మన మిలటరీకి చెందిన ఆర్డర్లు మాత్రం అదానీకి, ఎల్ అండ్ టీకి ఇస్తారట! వ్వా! మోడీసాబ్! వ్వా..!!.

భజనవద్దు! నిజాలు చూడండి..!

మోడీ కంటే ముందు భారతదేశంలో అభివృద్ధే లేదన్నట్టు "భక్తుల భజన". దాదాపు గత డెబ్బయ్యేండ్లుగా ఫుడ్ కార్పోరేషన్ ధాన్యం, గోధుమలు మన రైతాంగం నుంచి కనీస మద్దతు ధరిచ్చి కొని ఉండకపోతే మన పరిస్థితి ఏమిటి? భారీనీటి ప్రాజెక్టులు కట్టి ఆహార ధాన్యాల స్వయం ప్రతిపత్తి సాధించకపోయుంటే ప్రాణ తర్పణాలతో సాధించుకున్న స్వాతంత్ర్యం కుక్కలు చించిన విస్తరైయుండేది కదా! అంబేద్కర్ రాసిన విద్యుత్ (సప్లై) చట్టం 1948 విద్యుత్‌ను ప్రజలకు కొనుక్కోగలిగిన రేట్లకు (అఫార్డబుల్ ప్రైస్) అందించాలని అంది.

ఫుడ్ కార్పొరేషన్, ఫెర్టిలైజర్ కార్పొరేషన్‌లు రెండూ కేంద్ర ప్రభుత్వ రంగం పరిశ్రమలే! ఇవి రెండూ ధ్వంసమై, విద్యుత్ ప్రయివేటు పరమైతే మన దేశ పరిస్థితేమిటి?

తెలంగాణ వచ్చిన తర్వాత రైతాంగం నుంచి రూ. 1,07,777.37 కోట్ల ఖరీదు చేసే ధాన్యం ఎఫ్‌సీఐ కొనింది. ఇదే లేకుంటే మన రైతాంగం పరిస్థితేంటి? ఈ ఏడాది కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మన రాష్ట్రంలో పత్తి కొనకపోతే ఆదిలాబాద్ రైతన్న అల్లాడిపోవడం లేదా?

మౌలిక వసతుల కల్పనకు ఒక మన తెలంగాణకే ఎల్ఐసీ రూ. 90 వేల కోట్లు సమకూర్చింది. జీహెచ్ఎంసీలో మురుగునీటి సౌకర్యాలు మొదలు, వీధి దీపాలకు, రోడ్లకు ఈ డబ్బు ఖర్చు చేసారు. ఎల్ఐసీ ఐపీఓ తర్వాత ఎల్ఐసీ చట్టంలోని సెక్షన్ 27(ఎ)ను సవరిస్తున్నారు. గతంలో 25 శాతమే ప్రయివేటులో పెట్టుబడి పెట్టాలన్న ఆంక్షలు పోయి సంపూర్ణంగా పెట్టుబడులు పెట్టే అవకాశం ఏర్పడింది. ఇప్పుడిక ఎల్ఐసీ డబ్బుతో అదానీ లాంటి ఆశ్రిత పెట్టుబడిదారులకు ఎంత కావాలంటే అంత పెట్టుబడి పెట్టొచ్చు. దీంతో 5-6 శాతం వడ్డీకి దొరికే సౌలభ్యం మన జనం కోల్పోతారు. ఇదంతా మోడీ పుణ్యమే!

బీజేపీ సైద్ధాంతికంగానే ప్రభుత్వ రంగానికి వ్యతిరేకం. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ పాత్ర ఉండరాదని వారి ఆలోచన. జన సంఘం ప్రారంభకులు, వారి సిద్ధాంత కర్త శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఈ విషయం స్పష్టంగా చెప్పారు. 1949లోనే ప్రయివేటు పెట్టుబడికి పూర్తి సేచ్ఛనివ్వాలన్నారు. 'వర్గ పోరాటం' తప్పన్నారు. 'ఉత్పత్తి పెంచడానికి శ్రమ పెట్టుబడితో సహకరించాలన్నారు. ఇబ్బడిముబ్బడిగా పెరిగిన ఉత్పత్తి ఎవరికి లాభం చేకూరుస్తోందో అందరూ నేడు గమనిస్తున్నారు కదా!

స్ఫూర్తిదాయకం..శ్వేతవర్ణ శోభితం

- ఆకట్టుకున్న ఐద్వా కార్యకర్తల ర్యాలీ

మలప్పురం : కేరళలో మలప్పురంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ కార్యాలయం ప్రారంభం సందర్భంగా ఆదివారం నిర్వహించిన ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. 1200 మంది మహిళా వాలంటీర్లు శ్వేత వర్ణ దుస్తులు యూనిఫాంగా ధరించి ఈ ర్యాలీలో పాల్గొనడం విశేషం. ఇంత పెద్ద సంఖ్యలో వివిధ సామాజిక తరగతులకు చెందిన మహిళలు ఐక్యంగా యూనిఫాం ధరించి ర్యాలీ చేయడం ఇదే తొలిసారి. ఐద్వా జిల్లా కార్యాలయాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ ప్రారంభించారు. ఐద్వా అధ్యక్షులు పికె శ్రీమతి పతాక ఆవిష్కరణ చేశారు.

నేడే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సోమవారం పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. మొత్తం 137 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో 126 మెయిన్ పోలింగ్ స్టేషన్లు, 11 అదనపు పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. మొత్తం 29,720 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 15,472, స్త్రీలు 14,246, ఇతరులు ఇద్దరు ఉన్నారు. 137 పోలింగ్ స్టేషన్లలో మహబూబ్‌నగర్ జిల్లాలో 15 పోలింగ్ స్టేషన్లు, నాగర్ కర్నూల్ 14, వనపర్తి 7, జోగులాంబ గద్వాల్ 11, నారాయణ పేట్ 5, రంగారెడ్డి జిల్లాలో 31, వికారాబాద్ 18, మేడ్చల్ మల్కాజ్ గిరి 14, హైదరాబాద్ జిల్లాలో 22 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది.

ఎన్నికల నిర్వహణకు 739 పోలింగ్ సిబ్బంది నియామకం

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 739 పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించారు. మొత్తం 137 పోలింగ్ కేంద్రాలు కాగా ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి 137 పీఓలు, 137 ఏపీఓలు, 319 ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించారు. మొత్తం 593 మంది సిబ్బందిని నియమించగా అందులో 146 మంది రిజర్వ్‌గా నియమించారు. అందులో 29 మంది పీఓలు, ఏపీఓలు 30, పోలింగ్ పర్సనల్ 87 మంది రిజర్వ్ గా ఉన్నారు.

డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన మెటీరియల్‌ను తీసుకుని పోవడానికి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు నియమించిన పోలింగ్ అధికారులు, సిబ్బంది ఆదివారం ఉదయం 8 గంటలకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు వచ్చిన మెటీరియల్ తీసుకెళ్లారు. రిసెప్షన్ సెంటర్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు. హైదరాబాద్ జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం 12 మంది సెక్టోల్ అధికారులను నియమించారు. ఈ మేరకు పోలింగ్ సిబ్బంది తమ పోలింగ్ సామాగ్రితో పాటు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం : రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలా

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలా తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. స్టాచుచరి, నాన్ స్టాచు చరి పత్రాలతో పాటు బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్స్, ఓటరు జాబితాను ఎన్నికల సిబ్బంది పరిశీలన చేసుకోవాలని ఆమె సూచించారు. 12 సెక్టరోల్ అధికారులను, 29 మంది అబ్జర్వర్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోలింగ్ స్టేషన్‌ల వద్ద పోలీసు బందోబస్తు, ఓటర్లకు మౌలిక సదుపాయాలు తాగునీరు, టెంట్లు, వికలాంగుల కోసం ర్యాంపులను ఏర్పాటు చేశామని తెలిపారు. రిసెప్షన్ సెంటర్‌ను సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఎలుకల్లోనూ కరోనా వైరస్

- అమెరికన్ సొసైటీ ఫర్ మైక్రోబయాలజీ జర్నల్‌లో వెల్లడి..

న్యూయార్క్ : ఎలుకల్లో కరోనా వైరస్ సంక్రమించవచ్చని అధ్యయనం వెల్లడించింది. న్యూయార్క్ సిటీ ఎలుకలకు కరోనా వైరస్ సంక్రమించవచ్చని అధ్యయనం కనుగొంది. న్యూయార్క్ నగరంలో మొత్తం 8 మిలియన్ల ఎలుకలు ఉన్నాయి. ఇవి ప్రజలతో కాంటాక్ట్ అయ్యే అవకాశం పుష్కలంగా ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. న్యూయార్క్ ఎలుకలు సార్స్ కోవ్-2 యొక్క ఆల్ఫా, డెల్టా, ఓమిక్రాన్ వేరియంట్లకు పాజిటివ్ గా పరీక్షించబడ్డాయి. మొత్తం 79 ఎలుకల్లో 16.5 శాతం ఎలుకలకు కరోనా సోకినట్లు పరిశోధకులు గుర్తించారు. ఎలుకలకు కరోనా సోకుతుందని నిరూపించిన తొలి ప్రయోగం ఇదే అని అన్నారు. అమెరికన్ సొసైటీ ఫర్ మైక్రోబయాలజీ యొక్క ఓపెన్-యాక్సెస్ జర్నల్ ఎంబియోలో ఈ పరిశోధనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అయితే, కోవిడ్ సోకిన ఎలుకలకు ఎలా కరోనా సోకింది..? ఇది మానవులకు ప్రమాదాన్ని తీసుకువస్తుందా..? అనేది స్పష్టంగా తెలియలేదు. ఈ వైరస్ ఎలుకల్లో కొత్త వేరియంట్ల పరిణామం చెందుతుందో లేదో తెలుసుకోవడానికి ఈ పరిశోధన ఉపయోగపడుతుందని డాక్టర్ హెన్రీ వాన్ చెప్పారు. మానవులను ప్రభావితం చేసే మహమ్మారిలో జంతువుల ప్రముఖ పాత్రను పోషిస్తాయని ఈ ప్రయోగం ద్వారా వెల్లడైందని అధ్యయన వేత్తలు చెప్పారు.

నేటి నుంచి పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

ప్రాధాన్యతా అంశమని అన్నారు. రైల్వేలు, పంచాయతీరాజ్, పర్యాటకం, సంస్కృతి, ఆరోగ్య మంత్రిత్వ శాఖల మంజూరు డిమాండ్లపై చర్చలు జరుపుతామని చెప్పారు. ఆర్థిక బిల్లు ఆమోదం పొందిన తరువాత, ప్రతిపక్షాలు లేవనెత్తిన డిమాండ్లను పరిశీలిస్తామని అన్నారు.

పెండింగ్‌లో 35 బిల్లులు

పార్లమెంట్ ఉభయ సభల్లో 35 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రాజ్యసభలో 26 బిల్లులు, లోక్‌సభలో 9 బిల్లులు ఆమోదం కోసం ఉన్నాయి. మల్టీ స్టేట్ కో ఆపరేటివ్ సొసైటీస్ (సవరణ) బిల్లు, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లులను ప్రభుత్వం గత శీతాకాల సమావేశాల్లో సంయుక్త కమిటీకి నివేదించింది. ప్రస్తుతం వాటిని ప్యానెల్ పరిశీలిస్తోంది.

రాజ్యసభలో పెండింగ్‌లో ఉన్నవి..

రాజ్యసభలో పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాల (సవరణ) బిల్లు, రాజ్యాంగం (షెడ్యూల్డ్ తెగలు) ఆర్డర్ (మూడో సవరణ) బిల్లు, రాజ్యాంగం (షెడ్యూల్డ్ తెగలు) ఆర్డర్ (ఐదో సవరణ) బిల్లులు ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొందాయి. ఏ పార్లమెంటరీ పరిశీలనకు సూచించబడనీ, ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో తమిళనాడు లెజిస్లేటివ్ కౌన్సిల్ (రద్దు) బిల్లు-2012, పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్నిర్మాణం (మూడో) బిల్లు-2013, ఢిల్లీ అద్దె (రద్దు) బిల్లు-2013, రాజ్యాంగం (షెడ్యూల్డ్ తెగలు) ఆర్డర్ (సవరణ) బిల్లు-2019 ఉన్నాయి. రాజ్యసభలో పెండింగ్‌లో ఉన్న అనేక బిల్లులు పార్లమెంటు స్టాండింగ్ కమిటీ పరిశీలనతో క్లియర్ చేయబడ్డాయి. అస్సాం లెజిస్లేటివ్ కౌన్సిల్ బిల్లు-2013, బిల్డింగ్, ఇతర నిర్మాణ కార్మికుల సంబంధిత చట్టాల (సవరణ) బిల్లు-2013, రాజ్యాంగం (79వ సవరణ బిల్లు)-1992 (శాసన సభ్యులకు చిన్న కుటుంబ నిబంధనలు), ఢిల్లీ అద్దె (సవరణ) బిల్లు-1997, ఢిల్లీ అద్దె (రద్దు) బిల్లు-2013, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ (ఖాళీల తప్పనిసరి నోటిఫికేషన్) సవరణ బిల్లు, ఇండియన్ మెడిక్‌లైన్ బిల్లు-2013, హెూమియోపతి ఫార్మసీ బిల్లు-2005, ఇంటర్-స్టేట్ మైగ్రెంట్ వర్క్‌మెన్ (ఉపాధి నియంత్రణ అండ్ సేవా నిబంధనలు) బిల్లు, మైన్స్ (సవరణ) బిల్లు-2011, మునిసిపాలిటీల నిబంధనలు (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) బిల్లు-2001, రాజస్థాన్ లెజిస్లేటివ్ కౌన్సిల్ బిల్లు-2013, రిజిస్ట్రేషన్ (సవరణ) బిల్లు-2013, సీడ్స్ బిల్లు-2004, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (సవరణ) బిల్లు-2008, మధ్యవర్తిత్వ బిల్లు-2021 తదితర బిల్లులు రాజ్యసభలో పెండింగ్‌లో ఉన్నాయి.

లోక్‌సభలో పెండింగ్‌లో ఉన్నవి..

లోక్‌సభలో పెండింగ్‌లో ఉన్న 9 బిల్లుల్లో రెండు బిల్లులు స్టాండింగ్ కమిటీకి పంపించారు. బాల్య వివాహాల నిషేధ (సవరణ) బిల్లు-2021, విద్యుత్ (సవరణ) బిల్లు-2022, డిఎన్ఎ టెక్నాలజీ (యూజ్ అండ్ అప్లికేషన్) రెగ్యులేషన్ బిల్లు-2019, తల్లిదండ్రులు మరియు వృద్ధుల నిర్వహణ అండ్ సంక్షేమం (సవరణ) బిల్లు-2019, పోటీ (సవరణ) బిల్లుతో సహా స్టాండింగ్ కమిటీల నుండి పార్లమెంటు ఇప్పటికే నివేదికలను స్వీకరించిన మూడు బిల్లులు జాబితా చేయబడ్డాయి.

ఈడీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నితీశ్ రానా రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

సంస్థ తరఫు న్యాయవాదిగా కోర్టులో వాదనలు వినిపిస్తున్నారు. రాజకీయంగా పెను సంచలనం సృష్టించిన పి.చిదంబరం, కాంగ్రెస్ నాయకుడు డి.కె.శివకుమార్, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులు, టీఎంసీ నాయకుడు అభిషేక్ బెనర్జీ, రాబర్ట్ వాద్రా..మొదలైనవారి ఈడీ కేసుల దర్యాప్తుల్లో కీలక పాత్ర పోషించారు. జమ్మూకాశ్మీర్ తీవ్రవాదుల నిధుల కేసులో లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌లపై ఈడీ ఆరోపణలు నమోదుచేయగా, ఈ కేసుల్లో ఆయన న్యాయవాదిగా ఈడీ తరఫున పనిచేశారు. అంతేగాక ఎయిర్ ఇండియా కుంభకోణం, విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ, భూషన్ ఉక్కు, రాన్‌బాక్సీ రెలిగేర్ మోసం, ప.బెంగాల్‌లో పశువుల అక్రమ తరలింపు కేసుల్లోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. '2020 న్యాయ ప్రముఖుల్లో అత్యంత శక్తివంతుడి'గా నితీశ్ రానాను ఫోర్బ్స్ మ్యాగజైన్ పేర్కొంది.

ఇలాంటివాడ్ని దేశం నుంచి వెళ్లగొట్టాలి..

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించింది. బ్రిటన్ పర్యటనలో రాహుల్‌గాంధీ మోడీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు చేశారు. భారత్‌లో మునపటి ప్రజాస్వామ్యం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ ఒక రహస్య సంస్థగా మారిందని, రాజ్యాంగ వ్యవస్థల్ని కబలిస్తోందని ఆయన ఆరోపించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షాల గొంతును అణగదొక్కుతోందని అన్నారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల దాడి మొదలైంది. విదేశాల్లో భారత్ గురించి మాట్లాడటమేంటని బీజేపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ అంశంపై భోపాల్ ఎంపీ ప్రగ్యా ఠాకూర్ మాట్లాడుతూ, "రాహుల్‌గాంధీ భారత్‌కు చెందిన పౌరుడు కాదని మేం భావిస్తున్నాం. ఎందుకంటే ఆయన తల్లి ఇటలీకి చెందినవారు. విదేశాలకు వెళ్లి భారత్ గురించి అలాంటి వ్యాఖ్యలు చేస్తారా? రాహుల్‌గాంధీకి ఈ దేశ రాజకీయాల్లో చోటు లేదు. ఇలాంటివాడ్ని దేశం నుంచి బయటకు వెళ్లగొట్టాలి. కాంగ్రెస్ మనుగడ పతనావస్థలో ఉంది. అందువల్లే ఆ పార్టీ నాయకుల మెదళ్లు కలుషితం అవుతున్నాయి" అని అన్నారు.

మహారాష్ట్రలో మత చిచ్చు

(మొదటిపేజీ తరువాయి)

నేర్చుకోవాలి. ముస్లింల ఇండ్లపైకి 100 బుల్‌డౌజర్లను పంపాడు. వారి ఇండ్లను కూల్చాడు" అని అన్నారు. హోలీ రంగుల్ని ముస్లిం దుకాణదార్ల నుంచి కొనుగోలు చేయరాదని, హిందువుల దుకాణాల వద్దకే వెళ్లాలని, ఆర్థికంగా ఆ వర్గాన్ని బాయ్‌కాట్ చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చాడు.

సుప్రీం ఆదేశాలు బేఖాతరు

గత ఏడాది నవంబర్ నుంచి రాష్ట్రంలో 'లవ్ జిహాద్ ర్యాలీ'లు సాగుతున్నాయి. ప్రతిచోటా ముస్లింలను లక్ష్యంగా చేసుకొని విద్వేష ప్రసంగాలు చేయటం పరిపాటిగా మారింది. ముంబయిలో జనవరి 29న సకల్ హిందూ సమాజ్ చేపట్టిన ర్యాలీలో వక్తలు పెద్ద ఎత్తున విద్వేష ప్రసంగాలు చేశారు. ఈ విషయం సుప్రీకోర్టు వరకు చేరింది. ఇలాంటి ర్యాలీలకు ఇకపై అనుమతి ఇవ్వమని మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. తదుపరి ర్యాలీకి సంబంధించిన వీడియో రికార్డులను సమర్పించాలని సుప్రీం ఆదేశించింది. విద్వేష ప్రసంగాలు వెలువడితే పోలీసులు వెంటనే జోక్యం చేసుకోవాలని, వారిని అరెస్టు చేయాలని చెప్పింది. అత్యున్నత న్యాయస్థానం సుప్రీం నుంచి ఆదేశాలు వచ్చినా, సకల్ హిందూ సమాజ్ ర్యాలీలు అలాగే కొనసాగుతున్నాయి. కోర్టు ఉత్తర్వులు వెలువడ్డాక 11 ర్యాలీలు చేపట్టింది. వీహెచ్‌పీ, భజరంగ్ దళ్, సనాతన్ సంస్థ, దుర్గా వాహిని, విశ్వ శ్రీరాం సేన, హిందూ రాష్ట్ర సేన, హిందూ జనజాగృతి సమితి, హిందూ ప్రస్తాన్‌కు చెందిన నాయకులు ర్యాలీల్లో పాల్గొంటూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు.

సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాలు



నవతెలంగాణ - సరూర్‌నగర్
మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 13న సోమవారం జరగనుంది. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గడ్డి అన్నారం డివిజన్ పరిధిలోని సంస్కృతి పాఠశాలలో, సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని వీఎం హోం పాఠశాలలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనుంది అని సరూర్‌నగర్ ఇన్స్‌పెక్టర్ జానకి రెడ్డి తెలిపారు.

బడంగ్‌పేట్‌లో బండి సంజయ్ దిష్టి బొమ్మ దహనం

నవతెలంగాణ-బడంగ్‌పేట్
ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు,



బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మసాబ్ చెరువు కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- ఎఫ్‌టీఎల్ హద్దురాళ్లు ఏర్పాటు చేయాలి
- గోరెంకల నర్సింహ్మా
- టీఎమ్‌కేఎమ్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షులు డిమాండ్

నవతెలంగాణ-తుర్కయంజాల్
తుర్క యాంజల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసభ్ చెరువు ఎఫ్‌టీఎల్ లోపల మట్టి పోయడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం టీమ్ కెఎమ్ కెఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా తుర్కయాంజాల మున్సిపాలిటీ సీపీఐ(ఎం) కన్వీనర్ డి.కిషన్, టీఎమ్‌కెఎస్ మండల నాయకులు కామాటి ప్రభాకర్ ప్రజా సంఘాల నాయకులు శారద, యాదయ్య, శ్రీధర్ తదితరులతో కలిసి సందర్శించారు. అనంతరం గోరెంకల నర్సింహ్మా మాట్లాడుతూ మసాబ్ చెరువులో ఉన్న ఎఫ్‌టీఎల్ హద్దురాళ్ల లోపల పక్కనే ఉన్న రియల్‌ఎస్టేట్ వాళ్లు వందల కోట్ల రూపాయలు విలువ కలిగిన చెరువుల్లో నీళ్ళు ఉండగానే ట్రాక్టర్లతో బయట నుంచి మట్టి తీసుకొచ్చి చెరువులో ఎట్ల నింపుతారని ప్రశ్నించారు. ఎఫ్ టీఎల్ హద్దురాళ్ల లేకుండా చేసి మట్టిని పోసి నింపడం చట్టరీత్యా నేరమని అన్నారు. చెరువులో నీరు ఉండగా మట్టితో పూడ్చడాన్ని ఖండిస్తున్నామన్నారు. సాగర్ హైహే రోడ్డు



పక్కనే ఉన్న చెరువును మట్టితో నింపుతుంటే ఇరిగేషన్ అధికారులు, ఆర్‌డీఓ మున్సిపాలిటీ కమిషనర్ ఏమి చేస్తున్నారు, ప్రభుత్వ ఆస్తులను కాపాడల్సిన కనీస బాధ్యత లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే మున్సిపాలిటీ చైర్మెన్ ఎందుకు చూస్తూ ఉన్నారని ప్రశ్నించారు. వెంటనే చెరువు కుంటలను శాటిలైట్ ద్వారా రీ సర్వే చేసి ఎఫ్‌టీఎల్‌లో హద్దురాళ్ల ఏర్పాటు చేయా లని. జిల్లాలో రియల్‌ఎస్టేట్, పట్టణీ కరణ, పరిశ్రమలు పేరుతో పెద్ద ఎత్తున కబ్జాదారులు కబ్జాలు చేస్తున్నారని, అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తి నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శిం చారు. అధికారులు వెంటనే స్పందించి మాసాబ్ చేరువలో పోసిన మట్టిని ఎత్తివేయాలని, మట్టి పోసిన వారిపై ల్యాండ్ గ్రామింగ్ కేసులు పెట్టి అరెస్టు చేయాలని హెచ్చరించారు. లేదంటే ప్రజా సంఘాలను రాజకీయ పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మత్స్య కార్మిక సంఘం నాయకులు కామటి ప్రభాకర్, ఇతర ప్రజా సంఘాల నాయకులు కె.శారద, రత్నమ్మ శేషమ్మ, కల్పన, ఉప్పలమ్మ డి.ప్రేమాజి, బొట్టు జానీ, యం.యాదయ్య, బోదాసు వెంకటేష్, ఎన్.యాదగిరి, లక్ష్మయ్య, ఎల్లేశ్, శివప్రసాద్, శ్రీధర్,మధు, నాగయ్య, నవీన్, టి.కృష్ణ, రామచంద్రయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

- మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనచారి
- విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-బోడుప్పల్
మహిళల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ తొలి శాసనసభ స్పీకర్ మధుసూదన చారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడకలను విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అంబర్‌పేట భార్గవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర శాసనసభ తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ దర్గా దయాకర్‌రెడ్డి, న్యూమరాలజిస్ట్ దైవజ్ఞశర్మ సినీ నటుడు సంపూర్ణేష్ బాబులు హాజరై మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మధుసూదన చారి మాట్లాడుతూ సమాజంలో పురుషుడితో సమానంగా మహిళలూ అన్నిరంగాల్లో రాణిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి మహిళా ఆత్మస్థైర్యంతో ఎంతటి ఒడిదుడు కులు ఎదురైనా వాటిని ఎదుర్కొంటూ ముందుకుపోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో



పెద్దపీట వేస్తోందని, సమాన ప్రాధాన్యం కల్పిస్తూ ముందుకు నడిపిస్తోందని తెలిపారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అందివచ్చిన అవకాశాలను పునికిపుచ్చు కొని అన్ని రంగాలలో ప్రావీణ్యం సాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జె.మహేశ్వరరెడ్డి, పాండుయాదవ్, విశ్వబ్రహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్ల హన్మాండ్లు చారి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు అన్నోజు కృష్ణ చారి, భారతి, శ్రావణి, రమాదేవి, జ్యోతి, వరలక్ష్మి పద్మ, వాణి, ఉమారాణి, కె.ఈశ్వర్ చారి, నాయకులు పాశం రాజు యాదవ్, కాటపాక కుమార్, సునీల్, శ్రీను నాయక్, దేవ్‌సింగ్, మేడ్చల్ జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి మద్దోజు రాజేష్ చారిలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- మహిళలు లేనిది సమాజమే లేదు
- అడ్వకేట్ స్నేహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్
నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళలు లేనిది సమాజమే లేదనీ హైకోర్టు న్యాయవాది స్నేహారెడ్డి అన్నారు. శనివారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బహుజన మహిళ ఐక్యవేదిక, ఇందుమతి ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ చౌరస్తాలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓట్ నీడ్ గ్యారెంటీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు సోగర బేగం హైకోర్టు అడ్వకేట్ స్నేహారెడ్డి, మహిళా రచయిత్రి తెలంగాణ ఉద్యమకారురాలు దాసోజు లలితలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాలలో ముందుండాలన్నారు. తరతరాలుగా మహిళలను కట్టుబాట్ల మధ్యన బందీగా చేశారని తెలిపారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో మహిళలకు ప్రత్యేక హక్కులు కల్పించాలని తెలియజేశారని పేర్కొన్నారు. అదేవిధంగా మహిళా చట్టాలను కచ్చితంగా ప్రభుత్వాలు అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని, మహిళలపై అనేక దాడులు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం మహిళా సమస్యలను పక్కనపెట్టి అనవసరమైన విషయాలలో ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తూ ఉంటే లిక్కర్ స్కాంలో ఇరుక్కుపోయిన తన బిడ్డని కాపాడుకునే పనిలో సీఎం కేసీఆర్ బిజీగా ఉన్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మహిళలకు అన్యాయం జరుగుతున్నా అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా పట్టించుకోని మహిళా మంత్రులు కేసీఆర్ భజన బృందంలో సభ్యులుగా చేరి వారి సొంత పనులకు కేసీఆర్‌కు మహిళల ఆత్మగౌర వాన్ని తాకట్టు పెట్టి తెలంగాణ బొడ్డెమ్మ కవితను కాపా డడం కోసం ఢిల్లీలో ధర్నా చేయడం మహిళా సమాజం సిగ్గుతో తలదించుకు నేలా చేస్తున్నారని, మహిళా మంత్రులను తీవ్రస్థాయిలో విమర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనగానే వేడుకలు చేసి హంగామా చేయడం కాదనీ, మహిళల సాధికారత కోసం, విద్య, వైద్య, ఉపాధి రంగాలలో మహిళలకు అండగా ఉండాలని, మహిళా హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా కళాకారులు ఎంకన్న బృందంచే పడుతున్నటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు బడంగ్‌పేట్ ప్రజలను ఎంతగానో అలరించాయి. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఎంతో మంది ప్రజలు చైతన్యవంత మయ్యారని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో మహిళా పారిశుధ్య కార్మికులను స్థానిక వైద్య సిబ్బందిని ఆశా వర్కర్లు మహిళా సంఘం నాయకులను స్థానిక మహిళలను బహుజన సమాజ్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం మహిళా కన్వీనర్ ఇందుమతి, అందరిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు గుడ్ల శ్రీనివాస్, బాలాపూర్ మండల అధ్యక్షులు దాసరి కిరణ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి కృష్ణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

లార్డ్స్ హైస్కూల్లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

అందరిని ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు



నవతెలంగాణ - మీర్‌పేట్
జిల్లెలగూడ లార్డ్స్ హై స్కూల్ 18వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారుల ఆటపాటలతో స్కూల్ ప్రాంగణం మార్మోగిపోయింది. ఆటపాటలే కాకుండా చిన్నారుల ప్రదర్శనలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, ప్రముఖ సైకాలజిస్ట్, అడ్వకేట్, లైవ్ స్కిల్ కోచ్ జవహర్‌లాల్ నెహ్రూ, ఈ అభ్యాస అకాడమీ సీఈవో ఫనిపవన్ హాజరై మాట్లాడుతూ పిల్లల్లో ఉన్నటువంటి ప్రతిభను బయటకు తీయడం లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్‌కి మాత్రమే సాధ్యమని అన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం చిన్నప్పుడు నుండి చదువుతోపాటు వాళ్లలో ఉన్న టాలెంట్ ని వెలికి తీసి ప్రోత్సాహిస్తూ సామాజిక బాధ్యతను నేర్పించాలని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లార్డ్స్ విద్యాసంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్ ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్, ఎస్సీసీఆర్టీ శేషు, డైరెక్టర్లు శ్రీలత, అనురాధ, ప్రిన్సిపల్ సతీష్ కుమార్ పాటు ఇతర బ్రాంచ్ ప్రిన్సిపల్స్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ఇంట్లో చోరీ

- 55,500 రూపాయల నగదు, 7 తులాల బంగారం మాయం
- పండుగలకు ఊరు వెళితే జాగ్రత్త అనే పోలీసులు ఇప్పుడు ఏం చేస్తున్నారు అని స్థానికుల ప్రశ్న?

నవతెలంగాణ-వనస్థలిపురం
వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పండగలకు ఊరు వెళితే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత మీపైన ఉంది అన్న పోలీసులు పండగ లేనప్పుడు ఇల్లు చోరీకి గురిఅయితే బాధ్యులు ఎవరని ఆయా కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సుభద్రనగర్ రోడ్ నెంబర్ 4, ప్లాట్ నెంబర్ 13లో నివసిస్తున్న దివి పాండురంగారావు ఇతను భార్య దివి కోటి సూర్యప్రభ ఇద్దరు కలిసి నివసిస్తున్నారు. వీరికి సంతానం లేదు. ఈనెల 9 నాడు తన బంధువుల ఇంట్లో శుభకార్యానికి విజయవాడ వెళ్లారు. తన ఇంట్లో మొక్కలకు ప్రతిరోజు పక్కింటి వాళ్ళు వచ్చి నీళ్ళు లేనప్పుడు పోయటం పరిపాలి. 10నాడు నుంచి రోజు రెండు రోజులు పక్కింటి వాళ్ళు మొక్కలకు నీళ్ల పోయటం 12 నాడు నీళ్ల పోయడానికి వచ్చిన పక్కింటి వాళ్లకి మెయిన్ డోర్ తెరిచి ఉండుటతో సందేహం కలిగి వెంటనే ఇంటి ఓనర్ పాండురంగారావుకు సమాచారం ఇచ్చారు. వెంటనే బయలుదేరి వచ్చిన పాండురంగారావు ఇంట్లో లోపలకి ప్రవేశించి తన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి



పాల్పడ్డారని గ్రహించి వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వనస్థలిపురం సీఐ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో డిటెక్టివ్ సీఐ వెంకటయ్య నేతృత్వంలో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకుని తనిఖీలను చేపట్టారు. ఈ మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఊరెళ్ళితే జాగ్రత్తలు తీసుకోండి, మాకు సమాచారం ఇవ్వండి
ఊరు వెళ్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు ఎన్నోసార్లు స్థానికులకు సమాచారం అందిం చిన స్థానికులు పెడచెవిని పెట్టడంతో ఇలాంటి పరిణా మాలు చోటు చేసుకుంటూ పరిపాటిగా తయారైంది. స్థానిక పోలీసులు పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతిఒక్కరితో సమన్వయంతో ముందుకు సాగుతాము క్రైమ్ రేటు తగ్గిద్దాము, ప్రజలు ప్రశాంతంగా ఉంటేనే మనం ప్రశాంతంగా నిదురిద్దామన్న ధైర్యంతో ఉన్న ఎల్లప్పుడూ చుక్కెదురు అవ్వటం జరుగుతున్న అని స్థానికులు తెలిపారు.

విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీయడానికే వైజ్ఞానిక ప్రదర్శనలు

ఏసీపీ అంజయ్య

నవతెలంగాణ-బడంగ్‌పేట్
విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీయడానికే విద్యా సంస్థలు వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించటం జరుగుతుందని మహేశ్వరం ఏసీపీ అంజయ్య అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరామ కాలనీలోని శ్రీహర్ష టెక్నో స్కూల్‌లో విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్ 2023కు మహేశ్వరం ఏసీపీ సి.అంజయ్య, జల్‌పల్లి మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డిలు ఎగ్జిబిషన్‌ను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైన్స్ ఎగ్జిబిషన్ వల్ల విద్యార్థినీ విద్యార్థుల్లో శాస్త్ర, సాంకతికపరమైన నైపుణ్యత పెరుగుతుందన్నారు.

విద్యార్థులు కృషి, పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో



జల్‌పల్లి మున్సిపల్ చైర్మెన్ అబ్దుల్లా సాధి, ఎస్ఐ మధుసూదన్, నాయకులు ఉస్కేమూరి నిరంజన్, యువ నాయకులు యంజాల అర్జున్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, శ్రీధర్ గౌడ్, కె.బాషమ్మ, స్కూల్ కరస్పాండెంట్ ఉస్కెమూరి బాలకృష్ణ, స్కూల్ ప్రిన్సిపల్ టి.సుజాత, అధ్యాపక బృందం, నాయకులు, కార్యకర్తలు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గృహప్రవేశానికి హాజరైన నాయకులు

నవతెలంగాణ-సంతోషనగర్
అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందించి ప్రపంచ దేశాల్లోని ఆదర్శంగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ శ్రీనివాస్ గౌడ్, భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ సభావట్ దూద్యానాయక్ అన్నారు. ఆదివారం యాకుత్ పురా నియోజకవర్గం సైదాబాద్ మండలం ఐఎస్ సదన్ డివిజన్ వినయ్ నగర్ కాలనీ పరిధిలోని టీపీసీసీ శ్రీనివాస్‌గౌడ్ నూతన గృహప్రవేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ సభావట్ దూద్యానాయక్, పప్పు సెట్ జె.పి జైన్ సీఎండి ఇష్ట బిల్డర్స్, రామావత్ పంతు జ్యోతి వరుణ్ నాయక్, మైసిగండి గ్రామపంచాయతీ సర్పంచ్ రామావత తులసి రామ్ నాయక్, లావడ్య గోపాల్ నాయక్, వార్డు సభ్యులు జటావత్ శంకర్ నాయక్, సభావట్ వినోద్ నాయక్, జటావత్ కిషన్ నాయక్, సీనియర్ నాయకులు జటావత్ సర్యానాయక్, నాయకుల అధికారులు సిబ్బంది కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దూద్యా నాయక్ మాట్లాడుతూ.. కష్టపడే తత్వం ఉండి మంచి మనసుతో కృషి చేస్తే సమాజంలో అన్ని సాధ్యమేయని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ నాయక్ తెలంగాణ జర్నలిస్ట్ సింగ్ అభిమానులు కుటుంబ సభ్యులు స్నేహితులు నాయకులు కార్యకర్తలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్ఎస్



తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా

నవతెలంగాణ-హయత్‌నగర్
ఎన్నికల్లో ప్రజలకు విశ్వాసం కల్పించి, అమలు కానీ హామీలను ప్రజలకు ఇచ్చి రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ ఎస్ పార్టీకి ఈసారి ఎలాగైనా బుద్ధి చెప్పాలని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి సుదమల్ల వెంకట స్వామి, సహాయ కార్యదర్శి కొంతం మాధవ రెడ్డిలు బీఆర్ఎస్ ప్రభుత్వంను విమర్శించారు. ఆదివారం హయత్ నగర్‌లోని మండల కార్యాలయం ఆవరణలో రంగారెడ్డి జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో 1,90,000 ఉద్యోగాలు ఉంటే సగం కూడా భర్తీ చేయలేదని, నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేదాకా నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందేనని విమర్శించారు. 57సంవత్సరాలు నిండిన వారికి ఇప్పటికీ పింఛన్లు మంజూరు కావడంలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచుతూ ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం బస్ చార్జీలు, విద్యుత్ చార్జీల పెంపుతో సామాన్యుల నడ్డి విరుస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ముఖ్యమంత్రి కుమార్తె ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కామ్‌లో వస్తున్న ఆరోపణలు నిర్ధారణ అయ్యేదాక తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిట్ల మహేశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కాలప్ప, శేఖర్, నరేందర్ గౌడ్, నీలమ్మ, రాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్కిల్స్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్
విద్యార్థులు చిన్నతనం నుండి స్కిల్స్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి అన్నారు. సాగర్ గ్రామర్ స్కూల్‌లో నిర్వంచిన ఇంగ్లీష్ పేర్ కార్యక్రమాన్ని స్కూల్ కరస్పాండెంట్ దన్‌సాగర్ ప్రిన్సిపల్ స్వప్నతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుండి ఇంగ్లీష్ నైపుణ్యాలను పెంపొందించు కోవాలని ఆమె విద్యార్థులకు సూచించారు స్కిల్స్ డెవలప్మెంట్ చేసుకుంటేనే పోటీ ప్రపంచంలో విద్యార్థులు



రాణిస్తారని ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తారని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో కూడిన విద్యన అలవర్చుకోవాలని ఆమె విద్యార్థులకు సూచించారు

బండి సంజయ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

అధ్యక్షురాలు ఊర్మిళ రెడ్డి

నవతెలంగాణ - సరూర్‌నగర్
ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని వెంటనే అరెస్ట్ చేయాలని ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు లిక్కీ ఊర్మిళ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఊర్మిళారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితకు బేషరుతుగా క్షమాపణ చెప్పాలని, బీజేపీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ విలువలు లేని వ్యక్తిఅని అన్నారు. నోటికి ఏది వస్తే అది మాట్లాడితే ఎక్కడికి అక్కడే అడ్డుకుంటామని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో మహిళలే బీజేపీకి బుద్ధి



చెప్తారని చెప్పారు. మహిళల గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని అన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-హయత్‌నగర్
ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ వెంటనే అట్టి వ్యాఖ్యలు వెనక్కి తీసుకొనేలా చేయగలిగితే మంచిదని, లేకపోతే బీజేపీ నేతలను ఎక్కడికక్కడ ఉరికిచ్చి కొడతామని ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఎల్బీనగర్ చౌరస్తాలో బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. తదనంతరం ఆయనతోపాటుగా ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా పాల్గొని మాట్లాడుతూ బీజేపీకి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని, నిత్యం మహిళలను పూజిస్తున్నామని చెప్పుకునే భారతీయ జనతా పార్టీ పాలనలో మహిళలు వివక్షకు గురిఅవుతున్నారని, సాక్షాత్తు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనమని, మహిళాలోకం చేతిలో బండి సంజయ్‌కి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కేసీఆర్ కుటుంబంపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈడీ అధికారులు ఎమ్మెల్సీ కవితని ఏకధాటిగా తొమ్మిది గంటలపాటు ప్రశ్నించిందని, దర్యాప్తు సంస్థలకు సహకరించాలని ఉద్యేశంతో కవిత ఓపికగా సమాధానం చెపితే దానిని వక్రీకరిస్తు భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు దేవుళ్ళను, దేవతా మూర్తులను పూజిస్తున్నామని చెప్పుకునే మీరు మహిళపై వ్యక్తిగత ఆరోపణలకు చేయడమే కాకుండా సంస్కారహీనంగా అరెస్టు చేయకపోతే ముద్దు



పెట్టుకుంటారా అని అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. భాగ్యలక్ష్మి గుడికి పోయి ఆ మహిళా మూర్తిని కొలిచిన నువ్వు ఈరోజు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. నీకు మహిళల పట్ల ఉన్న ఆలోచన తెలియజేస్తుందని, నీతీరు మార్చుకోకపోతే మహిళాలోకం తగిన రీతిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

గత రెండు సంవత్సరాలుగా కేసీఆర్ కుటుంబంపై సంస్కారహీనంగా మాట్లాడుతూ పదేపదే వారి కుటుంబంపై పలు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నావు, బండి సంజయ్ నీకు నీ తల్లిదండ్రులు నీకు సంస్కారం నేర్పలేదా, వెంటనే చేసిన వ్యాఖ్యలును వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలి, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పని హెచ్చరించారు. మా మహిళా లోకం వదిలిపెట్టే ప్రసక్తే ఉండదని, చట్టం తనపని తాను చేసుకుంటూ పోతుందని, కేసీఆర్ ప్రభుత్వం అతీతం కాదని అందరికీ తెలుసు, అటువంటిది దర్యాప్తు సంస్థలకు అన్ని విధాలుగా సహకరిస్తున్న కవిత మీద ఇలా అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమైన విషయమని, నీ వ్యవహార తీరు మారకపోతే మహిళలోకం బుద్ధి చెప్పాల్సింది వస్తుందని హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో హస్తినపురం కార్పొరేటర్ సుజాత నాయక్, మాజీ కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాస రావు, కొప్పుల విఠల్ రెడ్డి, భవాని ప్రవీణ్, సాగర్ రెడ్డి, జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాళ్లు అంజలి, శ్వేతారెడ్డి, సువర్ణరెడ్డి, అదిలక్ష్మీ, లత, ప్రమీల, లక్ష్మి ప్రసన్న, మల్లిక, నాగలక్ష్మి, రంగేశ్వరి నాయుడు, చంపాపేట వర్కింగ్ ప్రెసిడెంట్ అనసూయ, ఉష, ఎల్.లక్ష్మీ, రజిని, సరోజ, రమాదేవి, కవిత, నాగమణి, డివిజన్ అధ్యక్షులు వరప్రసాద్ రెడ్డి, చింతల రవికుమార్, జక్కిడి మల్లారెడ్డి, రాజిరెడ్డి, చిరంజీవి, మహేష్ యాదవ్, కటికరెడ్డి అరవింద్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని సీనియర్ మహిళలు, ఉద్యమకారులు, మాజీ మహిళా అధ్యక్షురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-జవహర్‌నగర్

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుంది. సీఐ సీతారం తెలిపిన వివరాల ప్రకారం... కార్పొరేషన్ లోని దొండతోటలో బల్ల ఉమామహేశ్వరరావు(37), భార్య చిన్నమ్ములు పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. బోర్వెల్ కంపెనీలో పనిచేస్తు కుటుంబాన్ని పోషించేవాడు. గత కొంత కాలంగా ఉమామహేశ్వరరావు మద్యానికి బానిసై అప్పులపాలయ్యాడు. ప్రతీరోజు మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో తరచు గొడవ పడేవాడు. శనివారం భార్య పనికోసం బయటకు వెళ్ళగా ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉమామహేశ్వరరావు సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చిన భార్య తలుపులు కొట్టగా ఎంతకూ తీయకపోవడంతో చుట్టుపక్కల వారి సాయంతో తీసి చూడగా అప్పటికే మృతి చెంది కనిపించాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

నేరాల నియంత్రణ కు ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కీసర సీఐ రఘువీర్ రెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపల్ పరిధి 15వ వార్డులోని సాయిబాబా కాలనీలో కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకటరెడ్డి సొంత ఖర్చుతో ఏర్పాటుచేసిన 15 సీసీ కెమెరాలను (రూ.1,40,000/-) సీఐ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజు, కో ఆప్షన్ షఫీ, కాలనీ అధ్యక్షులు సోమిరెడ్డి, సెక్రటరీ మోహన్, ఉపేందర్ రెడ్డి, ప్రవీణ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు , కాలనీవాసులు పాల్గొన్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో

ఎమ్మెల్సీ ఎన్నికలకు అంతా సిద్ధం

- ఎన్నికల కేంద్రాలకు తరలివెళ్లిన అధికారులు
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పరిస్థితులను సమీక్షించిన కలెక్టర్ అమోయ్ కుమార్





నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఈనెల 13న సోమ వారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే ఎన్నికల కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించామని జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం శామీర్‌పేట్‌లోని కలెక్టరేట్ ఆవర ణలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 14 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఆయా ఎన్నికల ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడెంగ్, మైక్రోఅబ్జర్వర్లు, ఓపీవో, ఎన్నికల సిబ్బందికి అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలతో పాటు సిరా వంటి ఇతరత్రా ఎన్నికల సామాగ్రిని అందచేశారు. వారికి ప్రత్యేక వాహనంలో పోలీసు బందోబస్తు కల్పించగా ఎన్నికల విధులు నిర్వహించేందుకు సిబ్బంది తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో కీసరలో 8, మల్కాజిగిరిలో 6 ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 6,536 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మహిళా ఓటర్లు 3,498, పురుష ఓటర్లు 3,038 మంది ఉన్నారు. అలాగే ఎన్నికలు జరిగే అన్ని చోట్లో వెబ్‌క్యాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ అమోయ్ కుమార్ తెలిపారు. ఎన్నికలు ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను సరూర్‌నగర్‌లోని స్టేడియంకు తరలించి అక్కడ భద్రపర్చడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖల అధికారులు, ఎన్నికల అధికారులు తదితరులు ఉన్నారు.

రూ. 3 కోట్లతో కాలనీ సమస్య పరిష్కరిస్తా



- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి
- దమ్మాయిగూడలో పర్యటించిన మంత్రి

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

రూ. 3 కోట్ల తో కాలనీ ల సమస్య పరిష్కరిస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. దమ్మాయి గూడ మున్సిపాల్టీ పరిధిలోని అహ్మద్ గూడ 4వ వార్డులో, స్థానిక కౌన్సిలర్ మంగళపూరి వెంకటేష్ ఆధ్వర్యంలో మంత్రి పర్యటించారు. గతంలో వరదల వల్ల తీవ్రంగా మునిగిపోయి, వరద ముప్పు కలిగిన బాలాజీ నగర్ కాలనీని మంత్రి పర్యవేక్షించి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజులలో వర్షాల వలన రాంకీ సంస్థ ద్వారా విడుదలయ్యే లిచిడ్ వాటర్ ద్వారా కాలనీకి ఎంతో ముప్పు ప్రమాదం పోంచి ఉందని, గమనించి మూడు కోట్ల రూపాయల వ్యయంతో బాలాజీ నగర్ కాలనీ సమస్యను పరిష్కరించి, కాలనీ ప్రజలను కాపాడు కుంటానని మంత్రి హామీ ఇచ్చారు. . ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ చైర్‌పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్, వైస్ చైర్మెన్ నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, భాస్కర్ గౌడ్, బీఆర్ఎస్ స్థానిక అధ్యక్షులు తిరుపతిరెడ్డి, యూత్ అధ్యక్షులు మణికంఠ, కౌన్సిలర్లు నాను నాయక్, సుజాత, నరసింహ రెడ్డి, రమేష్ గౌడ్, సంపన్న బోలు హరి గౌడ్, 4వ వార్డు అధ్యక్షులు బాకర్, ఎస్టీ సెల్ అధ్యక్షులు రవి రాజ్ రాథోడ్, యూత్ అధ్యక్షులు నగేష్ గౌడ్, మహిళా సెల్ ప్రెసిడెంట్ లావణ్య, పద్మక్క పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసి మంత్రి

జవహర్‌నగర్ : పేదల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధి భరోసానిస్తుందని, కార్పొరేట్ స్థాయి వైద్యం అందు తుందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. ప్రతీ పల్లెకు, బస్తీకి వైద్యం అందుతుందంటే ఈ ఘనత సీఎం కేసీఆర్ కే దక్కు



తుందని జవహర్‌నగర్ కార్పొరేషన్ 17 వ డివిజన్ కు చెందిన మురుగన్ అనారోగ్యానికి గురికాగా స్థానిక కార్పొ రేటర్ అళగిరి చిత్ర సుబ్రహ్మణ్యం సహకారంతో సీఎం సహా యనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.30 వేలు మంజూ రయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును బాధితుడికి ఆదివారం మంత్రి కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద ప్రజల వైద్యం కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్న గొప్ప మనసున్న మహారాజు సీఎం కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ 17 డివిజన్ నాయకుడు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

షీ టీంల ద్వారా మహిళల రక్షణకు పెద్దపీట



- ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి

నవతెలంగాణ-కాప్రా

రాష్ట్రంలో షీ టీంల ద్వారా మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగిందని ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్ ఈ.సి.నగర్ మహిళ భవన్‌లో అంత ర్జాతీయ మహిళా దినోత్సవం పద్మినీ అధ్యక్షతన ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. పలు వురు మహిళలను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం అని రంగాల్లో ముందున్నట్టుగానే, మహిళలు కూడా అన్ని రంగాలలో ముందుండాలని పిలుపునిచ్చారు. మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై ఆరోగ్యం మహిళ అనే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువ చ్చిందని, అదేవిధంగా మహిళలు మహిళా భవన్ పైన మరో అంతస్తు నిర్మించాలని, వీధిలైట్లు వేయించాలని, బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా వెంటనే సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో మాజీ కార్పరేటర్లు కొత్త రామారావు, సింగి రెడ్డి ధన్ పాల్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, రెడ్డి నాయక్, మలా రెడ్డి, శివకుమార్, కిట్టు, సీనియర్ సిటిజన్స్ సత్తి రెడ్డి, సమ్మ య్య నాగేశ్వర రావు, మహిళలు వి.వి. లక్ష్మి, పద్మినీ, భవా ని, అరుణ, మాలతి, నవనీత, నాగరత్నం, విజయ లక్ష్మి, రాజ్యలక్ష్మి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు



సమాజాన్ని చైతన్యం చేసే పాటలను ఆదరించాలి

- 'పొద్దు వాలుతున్నదో..' అల్బమ్ ఆవిష్కరణలో విమలక్క

నవతెలంగాణ-హైదరాబాద్

సమాజాన్ని చైతన్యం చేసే పాటలు రావాలని, వాటిని ప్రజలు ఆదరించాలని అరుణోదయ సాంస్కృతిక సారథి నాయకురాలు, ప్రజా గాయకురాలు విమలక్క అన్నారు. 'పొద్దు వాలుతున్నదో' అల్బమ్ వీడియో సాంగ్‌ను ఆదివారం హైదరా బాద్‌లో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోని 90 శాతం ఉన్న ప్రజల సంపద కేవలం పది శాతం మంది వద్ద ఉందన్నారు. సంపద వికేంద్రీకరించబడాలని అన్నారు. ఆ సంపద పేదల చేతుల్లోకి రావాల న్నారు. సమాజంలో దోపిడీ, పీడన పోవాలన్నారు. సమాజానికి సందేశాన్ని ఇచ్చే పాటలను ఆదరించాలన్నారు. ఇలాంటి పాటలు మరిన్ని రావాలన్నారు. ఈ సందర్భంగా 'పొద్దు వాలుతున్నదో' టీం సభ్యులకు ఆమె అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాట రచయిత రాజు చీరాల, హీరో శేఖర్ నాని, తోటి నటులు మొహమ్మద్ గౌసోద్దీన్, రాణి, స్వామిగౌడ్, మహేశ్‌గౌడ్, దినేశ్, ప్రణీన్, శ్రీను, టీం సభ్యులు పాల్గొన్నారు.

సమానత్వంతోనే మహిళలకు స్వాతంత్ర్యం



- జవహర్ నగర్ మేయర్ మేకల కావ్య

నవతెలంగాణ-జవహర్‌నగర్

సమానత్వంతోనే మహిళలకు నిజమైన స్వాతంత్రం లభిస్తుందని, తెలంగాణ ప్రభుత్వం మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని మేయర్ మేకల కావ్య అన్నారు. ఆదివారం జవహర్ నగర్ కార్పొరేషన్ లోని 27వ డివిజన్ కార్పొరేటర్ జిట్టా శ్రీవాణి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేయర్ హాజరై మాట్లాడుతూ గతంలో మహిళలకు చదువు ఎందుకులే అనే మాటలు వినబడేవని.. నేడు తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక గురుకులాలు ఏర్పాటు చేసిందని.. ప్రతీ ఆడబిడ్డను ఉన్నత చదువులు చదువుకునేలా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. మహిళలు ప్రతి రంగంలో మగ వారితో సమానంగా రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఆడవారు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉన్నతస్థితికి చేరుతారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, తెలంగాణ ఉద్యమ కారుడు పరుశురాం, యూత్ నాయకులు ప్రణీత్, దిలీప్, జహంగీర్, కుమార్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు వీణా, స్వప్న, క్రిష్ణవేణి, కమలా, ఉమా, మంగ, సుభద్ర, కుమారి, సంగీతా కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు తెలంగాణ ప్రజలు అండగా ఉండాలి

- బీఆర్ఎస్ మల్కాజిగిరి ఇన్‌చార్జి రాజశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఎమ్మెల్సీ కవితకు తెలంగాణ ప్రజలందరూ మద్దతుగా ఉండాలని బీఆర్ఎస్ మల్కాజిగిరి ఇన్‌చార్జి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఆదివారం కంటోన్మెంట్ బోయిన్ పల్లి ప్లే గ్రౌండ్‌లో బోర్డు మాజీ ఉపాధ్యాక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్ర మానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారం భించారు. అనంతరం విజేతలకు బహుమతులు, పాల్గొన్న మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా దినోత్సవ వారోత్సవాలను సీఎం కేసీఆర్ ఘనంగా నిర్వహిస్తున్నారని అయితే కేంద్ర ప్రభుత్వం మహిళలని కూడా చూడకుండా కూడా జాగతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవితను అనవసరంగా వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అంతకు ముందు మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మహిళల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న సంక్షేమ పథకాలను అమోఘమైనవని చెప్పారు అంతేకాకుండా కంటోన్మెంట్ బోర్డ్ ప్రాంతంలో తాను కూడా అనేక గ్రూపుల ఏర్పాటు చేసి మహిళలకు సమయం ఉపాధికి పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక సహాయం అందించానని చెప్పారు. కార్యక్ర మంలో బోర్డు మాజీ సభ్యులు నళిని కిరణ్, ప్రభాకర్, బీఆర్ ఎస్ నాయకులు ముప్పిడి మధుకర్, మహిళలు, జక్కుల రూప రెడ్డి, పద్మ మంజుల, అంబికా, భాగ్య, మేరీ, పార్వ తి, సబితా, జయ, అనిత, మొదలుగు వారు పాల్గొన్నారు.

అశోక్ కుమార్ మృతి తీరని లోటు

- ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అశోక్ కుమార్ మృతి తీరని లోటు అని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఓల్డ్ అల్వాల్ లోని మృతుడు మన్నే అశోక్ కుమార్ నివాసానికి ఆదివారం ఎమ్మెల్యే వచ్చి వారి కుటుంబీకులను పరామర్శించారు. మృతుడి కుమారుడు అశ్విన్‌ను, వారి కుమార్తె ఆర్తిని, వారి కుటుంబ సభ్యులను కలిసి వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అశోక్ కుమార్ లేని లోటు తీర్చలేనిదని, ఆయన మరణం బాధాకరమని నివాళు లు అర్పించారు. అశోక్ సమా జంలో ఒక మంచి గౌరవం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ అల్వాల్ సర్కిల్ ఉపాధ్యక్షులు బి.నాగేశ్వర్ రావు, లక్ష్మణ్, నాగన్న, శ్రీకాంత్ రావు, శ్రీదర్ రావు, నారాయణ , నిరం జన్, ఆనంద్ తదితరులు హజరై మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు, కంటి అద్దాల పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

మధుర చారిటబుల్ ట్రస్ట్ వారి మెగా మెడికల్ క్యాంపులో కంటి పరీక్షలు నిర్వహించుకుని, ఆపరేషన్లు చేయించుకున్న వారందరికీ చర్లపల్లి డివిజన్ పరిధిలో కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధుర చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ రాగిడి లక్ష్మారెడ్డి, ట్రస్ట్ సభ్యులు విచ్చేసి 30 మందికి మందులు, అలాగే 200 మందికి కంటి అద్దాలను వారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ట్రస్ట్ చైర్మెన్ రాగిడి లక్ష్మారెడ్డి సహాయ సహకారాలతో ట్రస్టు ద్వారా గత 20 సంవత్సరాల నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్నో కంటి ఆపరేషన్లు, కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం, పేద మహిళలకు ఉపాధి లక్ష్యంగా కుట్టు మిషన్లు, అల్లికలు ఎంబ్రాయిడరీ వర్క్ శిక్షణ,ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఎంతోమంది మహిళలకు ఉపాధి కల్పన కల్పించామన్నారు. రాబోవు రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు ఉధృతంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్‌లలో నిర్వహిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోశయ్య, వెంకట్ గౌడ్ , ముస్తక్ హైమద్, ముత్యాలు, సోమేశ్వర రావు, పర్వురావు యాదవ్, మహేష్ ప్రకాష్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంజరి సంతోష్, యూత్ కాంగ్రెస్ ఉప్పల్ అసెంబ్లీ సెక్రెటరీ బోల్లు వెంకట్, నిమ్మ సురేందర్ రెడ్డి , శ్రవణ్ కుమార్, కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయభారతి సొసైటీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



- బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్ కుమార్

నవతెలంగాణ-కంటోన్మెంట్

విజయభారతి సొసైటీలో సమస్యలను పరిష్కరిం చేందుకు తన వంతు కృషి చేస్తానని కంటోన్మెంట్ బోరు మాజీ సభ్యుడు ప్యారాసాని శ్యామ్ కుమార్ తెలిపారు. కాలనీవాసులు ఆదివారం కాలనీలో సంక్షేమ సంఘం ఆధ్వ ర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ కుమార్ పాల్గొని జయ భారతి సొసైటీలో పర్యటిం చారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీ వాసులు కోరారు. తన వంతు కషి చేస్తున్నామని ఆయన తెలిపారు. అద్యక్షులు బిందు, ఉపాధ్యక్షుడు జగన్మోహన్, సెక్రటరీ అరుణ, ప్రధాన కార్యదర్శి కె యస్ రావు, కోశాధికారి శారద, కమిటీ సభ్యులు రామారావు, రాయ్, సాయి బాబా, మాధవి, రమేష్, వికే రావులు పాల్గొన్నారు.



గృహ ప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ మంగాపురం కాలనీలో ఆలకుంట కురుమమ్మ -రాములు నూతన గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి హాజరయ్యారు. స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గడ్డం రవికుమార్, రహమాన్, బొదాసు రవి, నవీన్ గౌడ్, శివ కుమార్, కిట్టు, అలకుంట రాములు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

జంపన్న యువసేన ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డ్ ఒకటో వార్డు కట్టెల మండి ప్రాంతంలో ఆదివారం జంపన్న యువసేన ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకలు ప్రారంభించారు. అనంతరం మహిళలతో కలిసి జంపన కేక్ కట్ చేశారు. మహిళ లకు ఈ సందర్భంగా జంపన్న యువసేన ఆధ్వర్యంలో గిఫ్ట్‌లు అందజేసారు. ఈ వేడుకల్లో ఫీలోమీన, గంగావతి, శ్యామల,అండాలు, పెరుక మహేందర్, సిరాజ్, షకీబ్, తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారతదేశంలో పెరుగుతోన్న 'ప్యాంక్రియాటిక్' వ్యాధులు

- గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణులు
- అత్యంత అధునాతన, రోబోటిక్ 'ప్యాంక్రియాటిక్ సర్జరీస్' పై యశోద ఆస్పత్రి జాతీయ సదస్సు



నవతెలంగాణ-బేగంపేట్

దేశం నలుమూలల నుంచి వచ్చిన 500 మందికి పైగా సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టుల భాగస్వామ్యంతో అత్యంత అధునాతన, రోబోటిక్ "ప్యాంక్రియాటిక్ సర్జరీస్"పై యశోద హాస్పిటల్ నేషనల్ కాన్ఫరెన్స్ అండ్ లైవ్ వర్క్‌షాప్ ఆదివారం విజయవంతంగా ముగిసింది. యశోద హాస్పిటల్స్, ఇండియన్ హెపాటో-ప్యాంక్రి యాటో-బిలియరీ సర్జన్స్ అసోసియేషన్ (ఐహెచ్‌పీబీఏ) సహకారంతో ప్యాంక్రియాటిక్ సర్జరీలపై రెండు రోజుల జాతీయ సదస్సును యశోద హాస్పిటల్స్- హైటెక్ సిటీలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశోద గ్రూప్ హాస్పిటల్స్, డైరెక్టర్, డాక్టర్. పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం దాదాపు 1.4 మిలియన్ల మంది ప్యాంక్రి యాటిక్ క్యాన్సర్ బారిన పడుతున్నారని, వారిలో చాలా మందికి వ్యాధి నయం కావడానికి చాలా ఆలస్యంగా నిర్ధారణ అవుతుందన్నారు. రోగనిర్ధారణ తర్వాత 10 శాతం కంటే తక్కువ మంది రోగులు ఐదు సంవత్సరాలు మాత్రమే జీవిస్తున్నారని తెలిపారు. పొగాకు ధూమపానం, అధిక ఆల్కహాల్ వినియోగం, ఊబకాయం వంటి జీవనశైలి ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌కు కారణం అన్నారు. 50 సంవ త్సరాల లోపు పురుషులు ఈ ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ బారిన ఎక్కువ పడుతున్నట్టు చెప్పారు. "ప్యాంక్రియాస్" మన మానవ జీర్ణవ్యవస్థలో అత్యంత ముఖ్యమైన, కీలకమైన అవయవాలలో ఒకటని.. ప్యాంక్రియాస్ వ్యాధులు వైవిధ్య మైనవి, సంక్లిష్టమైనవి, విస్తతమైనవి అని తెలిపారు. ముఖ్యంగా ప్యాంక్రియాస్ వ్యాధుల వైద్య నిర్వహణ చాలా కష్టమన్నారు. ప్యాంక్రియాస్ శస్త్రచికిత్స అనేది శస్త్రచిక త్సలలో అత్యంత సంక్లిష్టమైనదని చెప్పారు. అత్యంత అనుభవం, నైపుణ్యం కలిగిన సర్జన్లు మాత్రమే ఈ శస్త్రచి కిత్సలు చేయగలుగుతారని, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌లు ఇతర ప్యాంక్రియాటిక్ వ్యాధులకు ల్యాప్రోస్కోపిక్, ఇటీవల రోబోటిక్ సర్జరీల వంటి మినిమల్ ఇన్వేసివ్ విధానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. 500 మందికి పైగా ప్రాక్టీస్ సర్జన్లు, ప్యాంక్రియాస్ వైద్య రంగంలో దేశవ్యా ప్తంగా ఉన్న సుమారు 20 మంది ప్రముఖ జాతీయ ప్యాంక్రి యాస్ వైద్య నిపుణులతో ప్యాంక్రియాటిక్ వ్యాధుల పూర్తి స్పెక్ట్రమ్ పై చర్చించడంతోపాటు అన్ని రకాల ప్యాంక్రి యాటిక్ సర్జరీలలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా ఉపయోగించాలో తెలిపే ఈ తరహా సదస్సు ఇదే తొలిసారి అన్నారు.

యశోద హాస్పిటల్స్-హైటెక్ సిటీలోని సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, మినిమల్ యాక్సెస్ అండ్ రోబోటిక్ సర్జన్,డాక్టర్. విజయకుమార్ బడా, మాట్లాడుతూ ప్యాంక్రియాస్ తో అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయని తెలిపారు. అక్యూట్ ప్యాంక్రియాటైటిస్, క్రానిక్ ప్యాంక్రి యాటైటిస్, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్, ప్యాంక్రియాటిక్ సిస్ట్ సిస్టిక్ ఫైబ్రోసిస్ వంటిన్నారు. భారతదేశంలోని దక్షిణాది రాష్ట్రాలలో 100,000 జనాభాలో 200 మంది అక్యూట్ ప్యాంక్రియాటైటిస్ బారిన పడుతున్నారని అన్నారు. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ అనేది ప్రపంచంలో 4వ స్థానం లో, మరణాలలో 7వ స్థానంలో ఉందన్నారు. ఇది 2030 నాటికి మరణాలలో రెండవ స్థానానికి చేరవచ్చని అన్నారు. ఇప్పుడు యశోద హాస్పిటల్ హైటెక్ సిటీలో సరికొత్త తరం రోబోటిక్ సిస్టమ్ అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్యాంక్రి యాటిక్ సర్జరీలు చేయడానికి, ప్రధాన ప్యాంక్రియాటిక్ సర్జరీలలో ఉన్న వివిధ సంక్లిష్టతలను అర్థం చేసుకోవడానికి చాలా మంది యువ సర్జన్లకు సరైన వేదిక లేదన్నారు. ఐహెచ్‌పీబీఏ అనేది భారతదేశం అంతటా కాలేయం, ప్యాంక్రియాస్ సంబంధిత వైద్య విధానం సర్జన్‌లందరి జాతీయ సంఘం అని తెలిపారు.

పాండు యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్ ఆయన సతీమణి విద్యావతి తో కలిసి తాడ్బండ్‌లో స్థానికుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అరుంధతి హాస్పిటల్ సహకారంతో తాడ్బండ్‌లో ఏర్పాటుచేసిన ఈ ఉచిత వైద్య శిబి రాన్ని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా అన్ని రకాల వైద్య పరీక్షలు అరుంధతి హాస్పిటల్‌లో ఉచితంగా చేయించడం జరుగుతుంది అని పేర్కొన్నారు. అంతే కాకుండా కంటోన్మెంట్ ప్రజలు శ్రేయస్సుకు అహర్నిశలు కషి చేస్తున్నారని పాండు యాదవ్‌ను అభినందించారు. చాలామంది ప్రయివేటు ఆస్పత్రుల్లో పెద్ద మొత్తంలో అయ్యే బిల్లు కట్టడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. అటువంటి పేద వారిని దష్టిలో పెట్టుకొని ఇప్పటికే అరుంధతి హాస్పిటల్ "గిఫ్ట్ ఏ స్మైల్ " కింద దాదాపుగా 2000 పై చిలుకు శస్త్ర చికిత్సలు పూర్తిగా ఉచితం గా చేశారని చెప్పారు ఇకముందు కూడా ఉచితంగా అన్ని రకాల వైద్య సేవలను అందిస్తామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, నేతలు ముప్పిడి మధుకర్ ప్రవీణ్ యాదవ్ , జీనా , సురేష్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాలల్లో పండ్లు పంపిణీ



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం అల్వాల్ సర్కిల్ ఉప కమిషనర్ నాగమణి పలు వృద్ధాశ్రమాలను సందర్శించారు. వారికి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శుల నియామకం



నవతెలంగాణ-అడిక్ మెట్

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శులను ఆదివారం విద్యానగర్ బీసీ భవన్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా పరంకుశ సత్యనా రాయణ,త్రిదండపాణి ప్రవీణ్ కుమార్‌లకు రాష్ట్ర యువజన కార్యదర్శులుగా నియామక పత్రాలను అందజేశారు. తమపై నమ్మకంతో ప్రత్యేక బాధ్యతలు అప్పగించిన బీసీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు నీల వెంకటేష్, సిద్ధి భాస్కర్ రాష్ట్ర విద్యార్థి సంఘం అధ్యక్షుడు జీలపల్లి అంజి, సంఘ కార్యవర్గ ప్రముఖ సభ్యులు పాల్గొన్నారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 224వ అన్నదాన కార్యక్రమం



నవతెలంగాణ-అడిక్‌మెట్

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 224వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని, సభ్యులు శ్రీ వర్షితరెడ్డి, ఖుషి కోమల్, చందన, సుచిత్ర, వర్షిత, అఖిల్, ఇర్ఫాన్, హరీష్ కుమార్, శుభం, రవి గౌడ్, భగత్ విశ్వాస్ పాల్గొన్నారు.

జలకాలాటకు ఓయూ సిద్ధం

- 16న ఓయూ ఈత కొలను పున: ప్రారంభం
- పూర్తయిన ఏర్పాట్లు
- మొదలైన దరఖాస్తుల పక్రియ
- ఫిట్‌నెస్‌కు ఈత అవసరం : డైరెక్టర్ ప్రో.రాజేష్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో స్విమింగ్ పూల్ (ఈత కొలను) సేవలను ఈ నెల 16న పున: ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఓయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రో.రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఈత కొట్టాలంటే ఫీజులు చెల్లించాల్సిందే.. మొదలైన దరఖాస్తు పక్రియ

స్విమ్మింగ్ పూల్ సేవలను యూజర్ చార్జీలను ఈ విధంగా నిర్ణయించారు. ఓయూ విద్యార్థులకు రూ. 100, ఓయూ ఉద్యోగులకు రూ. 750, ఇతరులకు రూ 2000, అప్లయిడ్ కళాశాలల వారు రూ 750గా నిర్ణయించారు. ఇప్పటికే ఓయు స్విమింగ్ పూల్‌లో దరఖాస్తులు గత మూడు రోజుల నుండి అందజేస్తున్నారు. ఇక ఫీజు ను ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. రూ. 100 చెల్లించి దరఖాస్తు ఫారం ను పొందాల్సి ఉంటుంది.

ప్రత్యేక రక్షణ చర్యలు,నిబంధనలు ఇవే..

ఇక ఇక్కడ వచ్చే వారు స్విమ్మింగ్ డ్రస్‌తో రావాలి. వచ్చే ముందు స్నానం చేసి రావాలి. తప్పనిసరి గా డాక్టర్స్ చేత మెడికల్ సర్టిఫికేట్ ను దరఖాస్తుకు జత చేయాలి. ఆస్తమా, ఫిట్స్ ఉన్నవారిని, 7 సంవత్సరాల లోపు పిల్లలను అనుమతించరు. ఇక ఈత రాని వారు 4 ఫీట్‌ల లోతులోనే స్విమ్మింగ్ చేయాల్సి ఉంది. ప్రమాదం జరగకుండా ముందే ఐదుగురు లైఫ్ గార్డ్స్ ను, ఒక మహిళ, ఒక పురుష కోచ్‌లను అందుబాటులో ఉంటారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో స్విమింగ్ పుల్..

స్విమింగ్ పూల్ పొడవు 50 మీటర్‌లు, వెడల్పు 25 మీటర్‌లు, లోతు 4 నుంచి 7 ఫిట్‌లు ఉండే ఈ స్విమింగ్ పూల్ 20 లక్షల టీ నీటి సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ ఈత కొలనును అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నిబంధనలతో నిర్వహించనున్నారు. 24 గంటల పాటు పూల్ ఫిల్టరేషన్ చేస్తారు, లిక్విడ్ హై ఫ్లో క్లోరైడ్ టీసీసీ 90 ఏ కెమికల్ వినియోగిస్తున్నారు. ఇక్కడకు వచ్చే వారికి సంరక్షణ కు,ఆరోగ్యానికి,పెద్ద పీట వేశారు.

స్విమింగ్ పూల్ సమయాలు

ఉదయం..బ్యాచ్‌లు

1వ బ్యాచ్ ఉదయం 6 నుంచి 6:40 వరకు
2వ బ్యాచ్ 6: 45 నుంచి 7:25
3వ బ్యాచ్ 7:30 నుంచి 8:10
4వ బ్యాచ్ 8:15 నుంచి 8:55

ఇక మహిళలకు 5వ బ్యాచ్‌ను కేటాయించారు. వారికి 9:20 నుంచి 10 గంటల వరకు ఉంటుంది.

సాయంత్రం బ్యాచ్‌లు

6వ బ్యాచ్ 3:30 నుంచి 4:10 వరకు
7వ బ్యాచ్ 4:15 నుంచి 4:55 వరకు ,
8వ బ్యాచ్ 5:00 నుంచి 5:40 వరకు

ఇలా ప్రతీ బ్యాచ్‌కు 40 నిమిషాల సమయం కేటాయించారు.

ఆత్మ రక్షణ, సంపూర్ణ ఆరోగ్యం కోసం ఈత



ఈత సంపూర్ణ ఆరోగ్యంతో పాటుగా ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుంది. వేసవి కాలంలో విద్యార్థులకు పెద్దలకు ఒక ఫిజికల్ ఎక్సర్‌సైజు. ఈత ఫిట్నెస్‌ను వద్ధి చేస్తుం ది. అందరూ ఈత నేర్చుకొని ఉంటే మంచిది.అంతర్జాతీయ ప్రమా ణాలతో ఈ పూల్ రన్ చేస్తున్నాము. అన్ని రకమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాము.

– ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రో.రాజేష్ కుమార్

అంధత్వ నివారణపై అవగాహన కల్పించడం అవసరం

- సినీ దర్శకుడు శైలేష్, నటుడు సుహాస్
- గ్లకోమా వ్యాధిపై అవగాహన కల్పించడానికి ఎల్‌వీపీఈఐ అవేర్‌నెస్ వాక్



నవతెలంగాణ- బంజారాహిల్స్

చూపును నిశ్శబ్దంగా దొంగిలించే గ్లకోమా కంటి వ్యాధి కారణంగా ఏర్పడే అంధత్వ నివారణపై విస్తృతంగా అవగాహన కల్పించడం ఎంతైనా అవసరమని ప్రముఖ సినీ దర్శకులు, రైటర్ శైలేష్ కొలను, నటులు సుహాస్ పాగోలు, ప్రియదర్శి అన్నారు. ప్రపంచ గ్లకోమా వారాన్ని పురస్కరించుకొని ప్రజలలో అవగాహన కల్పించడానికి ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్‌వీపీఈఐ) బంజారాహిల్స్ క్యాంపస్ నుంచి అవేర్‌నెస్ వాక్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నటుడు ప్రియదర్శతో కలిసి హాజరైన వారు వాక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జ్ఞానేంద్రియాల్లో అన్నింటికంటే ముఖ్యమైనది నయనం అని.. పెద్దలు నయనం ప్రధానం అంటారన్నారు. గ్లకోమాను త్వరగా గుర్తించడానికి ప్రతీ సంవత్సరం కంటి పరీక్ష చేయించడం చాలా కీలకమని తెలిపారు. త్వరగా గుర్తించి, సరైన చికిత్స చేయించగలిగితే గ్లకోమా వలన సంభవించే అంధత్వాన్ని నివారించవచ్చనే సంకల్పంతో నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలకు ప్రజలందరూ స్వచ్ఛందంగా కదిలి రావాలని పిలుపునిచ్చారు. ప్రపంచం తోపాటు భారతదేశంలో కూడా అంధత్వాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరు నడుము కట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ, గ్లకోమా కన్సల్టెంట్, డాక్టర్ సిద్ధార్థ్ దీక్షిత్, సీనియర్ గ్లకోమా కన్సల్టెంట్, డాక్టర్ శిరీష సెంథిల్, ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, సీనియర్ గ్లకోమా కన్సల్టెంట్, డాక్టర్ అనిల్ కుమార్ మండల్‌తో పాటు పలువురు వైద్యులు, రోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మార్చి 12 నుండి 18 వరకు ప్రపంచ గ్లకోమా వారంగా జరుపుకుంటున్న సందర్భంలో ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ పేషెంట్ ఇంటరాక్టివ్ ఫోరమ్‌ను కూడా నిర్వహిస్తున్నదనీ సంస్థ ప్రకటించింది. పేషంట్ ఇంటరాక్టివ్ ఫోరమ్‌నూ ఆరు భాషలలో (బెంగాలీ, ఇంగ్లీష్, హిందీ, కన్నడ, ఒడియా, తెలుగు) ఎల్‌విపిఇఐ యూట్యూబ్ ఛానల్‌లో మార్చి 15 వ తేదీన మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 వరకు నిర్వహిస్తారని.. కింది లింక్‌ను ఉపయోగించి మీ ప్రశ్నలను పంపవచ్చు అని ఈ ప్రశ్నలకు లైవ్ పేషెంట్ ఇంటరాక్టివ్ సెషెన్‌ను ఎల్‌విపిఇఐ గ్లకోమా నిపుణులు సమాధానాలు ఇస్తారు.

ప్రశ్నలు పంపడానికి లింక్ : shorturl.at/fsEX8 లైవ్ సెషన్‌లో పాల్గొనేందుకు లింక్ : shorturl.at/zISV7

బలమైన పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ
- సీపీఐ సికింద్రాబాద్ మూడో మహా సభ



నవతెలంగాణ-ఓయూ

బలమైన పోరాటాల ద్వారానే ప్రజా సమస్యల పరిష్కారం అవుతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఈటి నరసింహ అన్నారు. సీపీఐ సికింద్రాబాద్ మూడో మహాసభ ఆదివారం లాలపేటలోని నఫీజ్ గార్డెన్ లో సీపీఐ సికింద్రాబాద్ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ రాజేశ్వరమ్మ పతాకావిష్కరణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్తులో పేద ప్రజల కోసం కమ్యూనిస్టు పార్టీ మరిన్ని పోరాటాలు నిర్వహించి వారికి అండగా నిలబడాలన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కామ్రేడ్ ఈటీ నరసింహ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే ఏకైక మార్గమని, అట్టడుగు వర్గాల ప్రజల కోసం నిరంతరం ఉద్యమించేది కేవలం ఎర్రజెండాలని అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ సంపాదను కొల్లగొడుతూ.. ఆదానీ, అంబానీలకు దోచిపెడుతూ.. ప్రభుత్వ సంస్థలను ప్రయివేటుపరం చేస్తూ జాతి సంపదనంతా విధ్వంసం చేస్తున్నారని తెలిపారు. మరోపక్క అచ్చేదిన్ అంటూ నిత్యవసర ధరలను రోజు రోజుకు ఆకాశానికి ఎత్తేస్తూ సామాన్య ప్రజల బతుకులను దుర్భరం చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే ప్రశ్నించే ప్రతిపక్షాల పైన ఈడీలను, సీబీఐలను, ఉసిగొలుపుతూ దాడులు నిర్వహిస్తూ ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగ పరుస్తున్నారన్నారు. మరోవైపు దేశంలో ప్రశ్నించే గొంతుకల, మేధావులు, కవులు రచయితల పైన అక్రమ కేసులు బనాయిస్తూ జైలులో నిర్బంధిస్తున్నారని ఇది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు భారత రాజ్యాంగ పరిరక్షణ ఏకైక మార్గమని కావున కమ్యూనిస్టు పార్టీ నాయకులంతా బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలను చైతన్య పరుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు స్టాలిన్, కమ టం యాదగిరి, ఉమర్ఖాన్, కొమరెల్లి బాబు, పాకాల యాద గిరి, సోమయ్య, శంకరమ్మ చెట్టు కింద శ్రీనివాస్,ఎస్కే లతీఫ్, మహమ్మద్, గువ్వల మల్లేష్, చారి, గౌరీ నాగరాజు, శంకరయ్య, కాజా, వెంకటలక్ష్మి, బాల మనమ్మ పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తుల కోసం కార్మికులపై భారాలు తగదు



- సీపీఐ(ఎం) సౌత్ జోన్ కన్వీనర్ అబ్దుల్ సత్తార్..
- గ్యాస్ సిలిండర్ల ధరలు తగ్గించాలని ఆందోళన

నవతెలంగాణ-హైదరాబాద్

కార్పొరేట్ శక్తులను పెంచి పోషించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులపై భారాలు మోపడం సరికాదని సీపీఐ(ఎం) సౌత్ జోన్ కన్వీనర్ అబ్దుల్ సత్తార్ అన్నారు. పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సీపీఐ(ఎం) చార్మినార్, బహదూర్‌పుర జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చార్మినార్ బస్టాండ్ దగ్గర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ. 1200కు మోడీ ప్రభుత్వం పెంచి పేదలపై, కార్మికులపై, కర్షకులపై, మహిళలపై పెద్ద బరువు వేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం పేదలను దోచి పెద్దలకు పెడుతున్నదనడానికి ఇదొక నిదర్శనం అన్నారు. తక్షణమే పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి వర్గ సభ్యురాలు మీనా మాట్లాడుతూ అదానీ, అంబానీ లాంటి పెద్దపెద్ద కార్పొరేట్ వ్యక్తులకు రూ. లక్షల కోట్లు మాఫీ చేస్తున్న ప్రభుత్వం పేదలపై భారాలు వేయడం క్షమించరాని నేరం అన్నారు. తక్షణమే పౌర సంఘాలు మోడీ ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించాలన్నారు. పేదలపై భారాలను తగ్గించేంతవరకు, బీజేపీ గద్దె దిగే వరకు పోరాడాలన్నారు. పేద ప్రజలు కార్మికులు, కార్మిక మహిళలు నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు బాబర్‌ఖాన్, సయ్యద్ ఇబ్రహీం, షేక్ యాకూబ్, జాహిద బేగం, తదితరులు పాల్గొన్నారు.

రూ.10 వేల కోట్లతో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాస్



నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమించిన ఉద్యమకారుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, రూ.10 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఫోరం చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం మాను కోట ప్రజా ప్రతిఘటన, మిలియన్ మార్చ్, సహాయ నిరాకరణ, సకలజనుల సమ్మె, సాగరహారం, సంసద్ యాత్ర, అసెంబ్లీ ముట్టడి తదితర అనేక కార్యక్రమాలను ఉద్యమకారులు నిర్వహించినట్టు గుర్తు చేశారు. వీరిలో సుమారు 1200 మంది అమరులు తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేయగా, వేలాది మంది వివిధ అనారోగ్య కారణాలతో, ఆర్థికంగా నష్టపోయినవారు ఉన్నారన్నారు. రాష్ట్ర సాధన తర్వాత ఉద్యమకారులను ప్రభుత్వం విస్మరించడం సరైంది కాదన్నారు. వెంటనే ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో 20 శాతం తెలంగాణ ఉద్యమకారులకు కేటాయించాలని, పెన్షన్, ఉచిత బస్సు, ట్రైన్ పాసులు, ఆరోగ్య కార్డులు, ప్రతీ ఒక్కరికీ 300 గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి గౌరవించాలని, అన్ని రాజకీయ పార్టీలు రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. విద్యార్థి ఉద్యమకారులకు ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రత్యేక కోటా కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హరివర్ధన్ రెడ్డి, ఫోరం ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు నరసయ్య, కన్వీనర్ ఐలయ్య యాదవ్, వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షులు కొంతం వీరాస్వామి, జంగా సుదర్శన్, మహిళా అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గోల్నాక డివిజన్ అభివృద్ధికి సహకరించండి'



నవతెలంగాణ-అంబర్‌పేట

గోల్నాక డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ మేయర్ గద్వాల విజయలక్ష్మికి గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గోల్నాక డివిజ న్‌లో ఇప్పటివరకు ప్రారంభోత్సవం చేసిన చాలా సీసీ రోడ్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రోడ్లు కొన్ని చోట్ల తొవ్వి వేయడంతో ప్రజలకు చాలా ఇబ్బం దులు కలుగుతున్నాయని చెప్పారు. చాలా సందర్భాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది అని, అదేవిధంగా గోల్నాక పాత బ్రిడ్జి పైన సైడ్ వాల్, గ్రీనరీ అభివృద్ధికి సంబంధించి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బస్తీలలో, కాలనీలలో చాలా సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. వాటికి సంబంధించిన బడ్జెట్ ఇచ్చి అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వెంటనే స్పందించిన మేయర్.. సీసీ రోడ్లకు సంబంధించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వీటి పైన కాంట్రా క్టర్లను పిలిచి వారి నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకోవాలని, ఇతరులకు కాంట్రాక్టులు ఇచ్చి సమస్యను పరిష్కరిం చాలన్నారు. సీసీ రోడ్లు గాని ఇతర అభివృద్ధి పైన ఎప్పటి కప్పుడు నివేదికలు తయారుచేసి అభివృద్ధిపై ఫోకస్ పెట్టాలని సూచించారు.

18 నుంచి సూత్రా ఎగ్జిబిషన్ షురూ..



నవతెలంగాణ- బంజారా హిల్స్

ఈ నెల 18 నుంచి 20 వరకు సూత్రా ఎగ్జిబిషన్ సమ్మర్ ఎడిషన్ బంజారాహిల్స్ లోని తాజ్ కృష్ణలో ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఫ్యాషన్ ర్యాంప్ నుంచి నేరుగా రిటైల్ స్టోర్లకు వెళ్లే ప్రస్తుత ఫ్యాషన్ ట్రెండ్ ఆధారంగా సూత్రా ఎగ్జిబిషన్ రూపొందించారని తెలిపారు. ఈ రకమైన ఫ్యాషన్ ధోరణిలో ప్రజల అభీష్టం మేరకు నూతన రకాలైన దుస్తులు, గౌన్లు, చీరలు, పాదరక్షలు, ఉపకరణాలు ఇంకా చాలా వరకు డిజైనర్ ఉత్పత్తులను సుత్రా ఎగ్జిబిషన్లలో ప్రదర్శిస్తామని చెప్పారు.

అసంఘటిత కార్మికులకు ఈ శ్రమ్ కార్డుల పంపిణీ



నవతెలంగాణ-అడిక్‌మెట్

అసంఘటిత కార్మికులు ఈ శ్రమ్ కార్డులను నమోదు చేసుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ రచన శ్రీ తెలిపారు. కవాడిగూడ డివిజన్ ఉన్ని కోట బస్తీలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన అసంఘటిత కార్మికుల ఈ శ్రమ్ కార్డులను కార్పొరేటర్ రచన శ్రీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. అసంఘటిత కార్మికులకు ఈ శ్రమ్ కార్డులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతీ ఒక్కరు నమోదు చేసుకుని కార్డులను పొందాలని సూచించారు. బీజేపీ ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ రామేశ్ రామ్, మహంకాళి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు సలంద్ర శ్రీనివాస్ యాదవ్, రంగరాజు, వెంకటేష్, పరిమల్ రమేష్ గౌడ్, సురేష్ ముదిరాజ్ తదితర నాయకులు పాల్గొన్నారు

ఉచిత ఆరోగ్య సేవలను సద్వినియోగించుకోవాలి

- కార్పొరేటర్ విజయారెడ్డి



నవతెలంగాణ-బంజారాహిల్స్

బంజారాహిల్స్‌లోని గౌరీ శంకర్ నగర్ కమ్యూనిటీ హాల్ రోడ్ నెంబర్ 10 లో అపోలో జనరల్ హాస్పిటల్ (ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసర్చ్ సెంటర్) వారి ఆధ్వర్యంలో మెగా ఫ్రీ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయ రెడ్డి విచ్చేసి హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించి బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ క్యాంప్‌లో డా. శ్రీజ(ఓబీజీవైఎన్) వారి టీం, డా.అరవింద్ (ఆర్థోపెడిక్)వారి టీం, డా. రాకేష్ (పీడియాట్రిక్)వారి టీం, డా.మేఘన్, హకియా (జనరల్ ఫిజిషియన్) నర్సింగ్ స్టాఫ్ పాల్గొని ఉచిత వైద్య సేవలనూ సద్వినియోగం చేసుకోవాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు భీమ్ రావు, అప్పారావు, యాకూబ్ భాయి, కురుమూర్తి, సతీష్, శ్యామ్, నజీర్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

అధికార దాహంతో అంధకారంగా రాష్ట్ర మేరు సంఘం పాలన

- రాష్ట్ర మేరు సంఘం జేఏసీ



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

రాష్ట్ర మేరు సంఘం పరిపాలన సంఘం నియమావళికి, నిబంధనలకు విరుద్ధంగా ఉందని, కొంతమంది గత 11 సంవత్సరాలుగా రాష్ట్ర మేరు ప్రజలను, రాష్ట్ర మేరు ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలి అధికార దుర్వినియోగానికి పాల్ప డుతున్నారని రాష్ట్ర మేరు సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం హనుమాన్ టెక్డి లోని బీసీ సాధికారిత భవన్‌లో రాష్ట్ర మేరు జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మునిగాల రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ సభ్యులు మాట్లాడుతూ వ్యక్తిగత పగలతో ప్రతికారాలతో అధికారమే పరమవ్య వధిగా వ్యవహరిస్తూ వివిధ రకాల కారణాలతో 11 ఏండ్లుగా రాష్ట్ర మేరు సంఘాన్ని, రాష్ట్ర మేరు ప్రజల సంక్షే మాన్ని సర్వనాశనం చేశారని దీనికి అందరూ బాధ్యత వహించాలని అన్నారు. రాష్ట్ర మేరు మేధావులు, యువత, పెద్దలు తప్పును తప్పు, ఒప్పును ఒప్పు.. అని సూటిగా ప్రశ్నించకపోవడం వలన రాష్ట్రమేరు సంఘంలో ఈ పరిస్థితి నెలకొన్నదని మండిపడ్డారు. రాష్ట్ర మేరు జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర మేరు సంఘం పెద్దల మధ్య చాలాసార్లు సయోధ్య చేయడానికి పలుమార్లు సమావేశమై చర్చించినా కొంతమంది వ్యక్తిగత పగలు ప్రతికారులతో ఆ సమావేశాల ఫలితాలను నీరుగార్చే ప్రయత్నం చేశారని ఇప్పటికైనా వ్యక్తిగత విభేదాలు పక్కకు పెట్టి రాష్ట్ర మేరు ప్రజల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. రాష్ట్రమేరు సంఘం,జిల్లా, నియోజక వర్గ, మండలాల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. అందరూ బంధువులు ఎగతాటిపై వచ్చి కుల అభివద్ధి కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మేరు జేఏసీని వివిధ జిల్లాలకు మండలాల్లో విస్తరించి రాష్ట్ర మేరు సంఘంలో జరుగుతున్న అధికార దుర్వినియోగాన్ని నియమ నిబంధనల దుర్వినియోగాన్ని ఎండగట్టే పని చేస్తుందని హెచ్చరించారు. అందరూ కలిసికట్టుగా ఒక సమావేశం ఏర్పాటు చేసి తొందరగా ఎన్నికలు నిర్వహించాలని దానికి రాష్ట్రమేరు సంఘంకు జేఏసీ పూర్తిగా సహకరిస్తుందని పేర్కొన్నారు ఈ సమావేశంలో వివిధ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు సంగ వెంకటరాజం, వెన్ను లింబాద్రి, ఎంపడి పాండు, సింగ్ విష్ణు, బొలకొండ రవితేజ, దీకొండ ప్రకాష్, మంతెన దామోదర్, నోముల శాంతి కుమార్, గంగాపురం మహేష్, పవన్ కుమార్, వేణు,అక్కు రాజేందర్ మొదలగు పాల్గొన్నారు.

ఘనంగా సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల 25వ వార్షికోత్సవం



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల 25వ వార్షికోత్సవ వేడుకలు భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సుందర్ రెడ్డి, కరస్పాండెంట్ ప్రొఫెసర్ కె. మర్రిరెడ్డితో పాటు కళాశాలలో ఉన్నత విద్యలను అభ్యసించి దేశ విదేశాలలో స్థిరపడిన విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల పురోగతికి విద్యార్థులు, అధ్యాపకులు అందిస్తున్న సహకారాన్ని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా ప్రశంసించారు.

ఘనంగా సత్యం టెక్నో స్కూల్ 12వ వార్షికోత్సవం



నవతెలంగాణ-అంబర్‌పేట

దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉందని ఎంపీ ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీ ఎల్ రమణలు అన్నారు, పెద్ద అంబర్‌పేట మున్సిపాల్టీ పరిధిలోని సత్యం టెక్నో స్కూల్ చైర్మెన్ గుజ్జ సత్యం, ప్రిన్సిపల్ అరవింద్ బాబుల ఆధ్వర్యంలో జరిగిన పాఠశాల 12వ వార్షికోత్సవానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని అందుకోసం వారి తల్లిదండ్రులు కూడా పూర్తిగా సహకరించాలని సూచించారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను చిన్నతనంలోనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాలలో నైపుణ్యత సంపాదించాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు ఏర్పాటుచేసిన జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల చైర్మెన్ సత్యం, ప్రిన్సిపాల్ అరవిందు బాబులు మాట్లాడారు. సత్యం టెక్నో స్కూల్ ఈ స్థాయికి రావడానికి, తమ అభివృద్ధికి సహకరిస్తున్న అందరికీ, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు తాము శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుతున్నా మన్నారు. రానున్న రోజులలో విద్యార్థులకు పలు పోటీ కార్యక్రమాలు రూపొందిస్తూ విద్యార్థులు ప్రతిభను కనబరిచేలా చేస్తామ న్నారు. అదేవిధంగా విద్యార్థులకు విద్యానందించడంలో తమ స్కూలుకు ప్రత్యేకత ఉందని నిరూపిస్తామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకురాలు విమలక్క, బీసీ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యం, రాష్ట్ర కన్వీనర్ లాల్ కృష్ణ, టీపీసీసీ కార్యదర్శి దండం రామ్ రెడ్డి, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, రాజేందర్, నాయకులు కోలా జనార్దన్, మల్లేష్, రామలింగం, సురేష్, పాండరీనాథ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

'టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి'



నవతెలంగాణ-ఓయూ

టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యంతోనే పేపర్ లీక్ జరిగిందని, దాన్ని కప్పిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో హ్యాకింగ్ అని లీకులు ఇచ్చారని విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ ఒక ప్రకటనలో ఆరోపించారు. లక్షల మంది విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. వ్యక్తిగత అవసరాల కోసం టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి పీఏ ప్రవీణ్ పేపర్ లీక్ చేసే దుస్థితికి టీఎస్‌పీఎస్సీని కేసీఆర్ ప్రభుత్వం దిగాజర్చిందని మండిపడ్డారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ) పేపర్ లీక్ ఘటన వెనుక ప్రవీణ్ కుమార్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుని పాత్ర , టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ జనార్ధన్ రెడ్డి, కార్యదర్శి అనిత రామచంద్రన్‌తో పాటు సభ్యుల అందరి మీద విచారణ జరిపించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని సర్ధార్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. రహస్యంగా పారదర్శకంగా, ఉండే సమాచారాన్ని ఒక సాధారణ ఉద్యోగి ఎట్లా లీక్ చేస్తాడని దీని వెనుక టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ తో పాటు రాష్ట్ర ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. మానిటర్ చైర్మెన్ పాత్ర మీద నిరుద్యోగులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ ఘటన మీద సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

సేవాగుణంలో రెడీ సర్వ్ ఫౌండేషన్

నవతెలంగాణ-బంజారాహిల్స్

మొదటగా ఆకలి తీర్చడంపై దృష్టి పెట్టామని.. అందుకే అన్నార్థుల కడుపు నింపేందుకు ఓ కార్యక్రమం చేపట్టామని రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ చైర్మెన్ పెద్ది శంకర్ అన్నారు. ఆదివారం నిలోఫర్ హాస్పిటల్ దగ్గర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎంతో మందికి తమ సేవలను నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తృతం చేశామని తెలిపారు. ఆరోగ్యం బాగా లేని వారికి, చికిత్స వేయించుకోలేని స్థితిలో ఉన్న వారికి సాయం చేస్తున్నామన్నారు. ఉచితంగా బ్లడ్ డొనేషన్ క్యాంప్స్, అలాగే ఇంజక్షన్ హోమ్ కేర్,డ్రెస్సింగ్ హోమ్ కేర్ ఎల్డర్స్ కేర్ ట్ హోమ్ కేర్.. ఇలా ఎన్నో కార్యక్రమలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రముఖ నటుడు టార్జాన్ లక్ష్మీనారాయణ గుప్త హాజరై ప్రసంగించారు. సేవ గుణంతో అన్ని దానాల కంటే అన్నదానం ఎంతో గొప్పదని అన్నారు. రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ద్వారా తనకు సేవ చేసే గొప్ప అవకాశం రావడం అదృష్టం అన్నారు. దాతలు ముందుకు వచ్చి ఈ రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ సేవలో మీరు పాలు పంచు కోవాలని అనుకునేవారు ఈ నంబర్ 9701295527ను సంప్రదించి మీకు చేతనైన సహాయం చేయవచ్చన్నారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ ప్రకాష్ ,శివ చైతన్య ప్రశాంత్,బీటీ నాయు డు,పి ఆర్వో లక్ష్మణ్,ప్రసన్న ,నవీన్ , ప్రవీణ్ , రాజు, శివ, నితిన్ పాల్గొన్నారు



ఐవీఎఫ్ మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎం.శైలజ



నవతెలంగాణ-నాగోల్
ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళా విభాగం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎం.శైలజను నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం నాగోల్‌లోని ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మరియు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాసగుప్తా క్యాంపు కార్యాలయంలో శైలజకు శ్రీనివాసగుప్త నియామక పత్రాన్ని అందించారు.

ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ తెలంగాణ మహిళా విభాగం ప్రతిమ మహిళ ఉప్పల స్వప్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్, రాష్ట్ర మహిళా విభాగం కోశాధికారి భువన పాల్గొన్నారు.

చలో మచిలీపట్నం వాల్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
జనసేన పార్టీ 10వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ గౌడ్ ఆదేశాల మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ నాగేంద్ర ఆధ్వర్యంలో చలో మచిలీపట్నం కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ డివిజన్ ప్రెసిడెంట్లు కొల్లా శంకర్, వెంకటేశ్వర్లు, నాగరాజు, మహేష్, రాజు, వేణుగోపాల్, వీరు, ప్రసాద్, జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ కృషి

- రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు రుద్రకుమార్



నవతెలంగాణ-బడంగ్‌పేట్
మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ కార్మిక సంఘం నిరంతరం ఎంతో కృషి చేస్తుందని రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు రుద్రకుమార్ అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బడంగ్‌పేట్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల అవరణంలో బాలాపూర్ మండల సీఐటీయూ నాయకులు దాసరి బాబు అధ్యక్షతన మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్ర కుమార్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ పాలన చేస్తున్నారని మండి పడ్డారు.

బడంగ్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మున్సిపల్ కార్మికులకు పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కార్మికులకు ఏవిధంగా వేతనాలు 21వేల రూపాయల వేతనాలు చెల్లిస్తున్నారో, అదే విధంగా మున్సిపాలిటీ కార్మికులందరికీ వేతనాలు చెల్లించాలని, అదేవిధంగా 6లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే మున్సిపల్ కార్మికులందరికీ సంవత్సర కాలం గడుస్తున్నా డ్రెస్సులు, చీరలు, చెప్పులు, సేఫ్టీ పరికరాలు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు కాలయాపన చేస్తున్నారని, ప్రధానంగా ఎండలు తీవ్రంగా పెరిగినందున మున్సిపల్ కార్మికులందరికీ ఒకేపూట పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులపై అధికారుల వేధింపులు అరికట్టాలన్నారు. సమావేశం అనంతరం బడంగ్‌పేట్ ఓల్డ్ విలేజ్ చౌరస్తాలో కార్మికులు సమస్యల పరిష్కారం కోసం రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీఐటీయూ కన్వీనర్ జే. పెంటయ్య, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు కే.రాములు, కే.యాదయ్య, మంగమ్మ, విజయలక్ష్మి, ధనలక్ష్మి, సుమలత, జంగమ్మ, జయమ్మ అమృత తదితరులు పాల్గొన్నారు.

యూరోకిడ్స్ ప్లే స్కూల్‌ను ప్రారంభించిన చైర్‌పర్సన్ క్రిష్ణవేణీ క్రిష్ణ



నవతెలంగాణ-దుండిగల్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మునిసిపాలిటీ, మల్లంపేట్ 25వ వార్డు శ్రీ సాయి బాలాజీ ఎన్‌క్లేవ్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన యూరోకిడ్స్ ప్లే స్కూల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దుండిగల్ పురపాలక చైర్‌పర్సన్ క్రిష్ణవేణీక్రిష్ణ హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మాదాస్ వెంకటేష్, మునిసిపల్ వైస్ ప్రెసిడంట్ శామీర్‌పేట రంగయ్య, మాజీ వార్డు సభ్యులు బాలా క్రిష్ణ, కాలనీ ప్రెసిడెంట్ జయవీర్, కాలనీ సభ్యులు భుపాల్ రెడ్డి, నాయకులు ప్రవీణ్, ప్రేమ, రేఖ, దీపిక, షాప్ నిర్వాహకులు శ్రీనిధి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ విజయలక్ష్మి సిల్క్‌హౌజ్ ప్రారంభం

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ కార్పొరేషన్ నిజాంపేట్ బండారి లే-అవుట్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ విజయలక్ష్మి సిల్క్ హౌస్, బోటిక్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో దుండిగల్ పురపాలక చైర్‌పర్సన్ శంభీపుర్ క్రిష్ణవేణి క్రిష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేటర్ సుజాత, కౌన్సిలర్ మాదాస్ వెంకటేష్, దుండిగల్ మునిసిపల్ వైస్ ప్రెసిడెంట్ శామీర్‌పేట రంగయ్య, మాజీ వార్డు సభ్యులు బాలాక్రిష్ణ, నాయకులు నర్సింగ్‌రావు, హరీష్, చందు, షాప్ నిర్వాహకులు భావన, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లిలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ- శామీర్‌పేట
మండలంలోని తుర్కపల్లి గ్రామంలో ఆదివారం డియర్ వన్ నియర్ వన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వృద్ధులకి, వికలాంగులకు గుండె, మెదడు, నరాలు, ఎముకలు, గైనకాలజీ మరియు ఇతర సాధారణ వ్యాధులకు డాక్టర్ల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 'డియర్ వన్ నియర్ వన్' ఫౌండేషన్ వ్యవస్థాపకులు సదుల కొండల్ రెడ్డి, అధ్యక్షులు గోపాల్ రెడ్డి, భానుచందర్, బాబు, అరవింద్, బాబు తోడేటి, శ్రీధర్ రెడ్డి, ఓ బాబు, సందీప్ రెడ్డి, రవికిరణ్ రెడ్డి, తుర్కపల్లి ఆర్టిస్ట్ నారా విజయలక్ష్మి , వైద్యులు డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ సాయి తేజ, డాక్టర్ అష్రఫ్ ఓవైసి, సిబ్బంది పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీకి ఎల్లవేళలా అండగా నిలుస్తాం



నవతెలంగాణ-దుండిగల్
కుతుబుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 11వ డివిజన్ స్థానిక కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై స్థానిక కాలనీవాసులు రాజేష్ ఆధ్వర్యంలో 30మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన డిప్యూటీ మేయర్, ఎన్ఎంసి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు బీఆర్ఎస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అందించే కృషి చేయాలి అన్నారు. అభివృద్ధి పనులు చేపడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆవుల జగన్ యాదవ్, 11,7, 14వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామకృష్ణ, మంజునాథ్, బొబ్బ శీను, నాయకులు సాయి ముదిరాజ్, యువకులు రాజేష్ మరియు వారి బృందం, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో మేడ్చల్ విద్యార్థులకు బంగారు పతకాలు



నవతెలంగాణ- మేడ్చల్
నేషనల్ లెవెల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో ఆదివారం నగరంలోని ఖర్మన్‌ఘాట్‌లో జరిగినటువంటి కరాటే పోటీలలో మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 షటోకాన్ కరాటే విద్యార్థులు అండర్ 12 ఇయర్స్ కుమ్మితే విభాగంలో జి అక్షయ గోల్డ్ మెడల్, అండర్ 10 ఇయర్స్ కుమ్మితే విభాగంలో జి.వరుణ్ తేజ్ గోల్డ్ మెడల్, సంకేత్ సిల్వర్ మెడల్, అండర్ 14 ఇయర్స్ విభాగంలో ఎం.పవన్ కుమార్, శ్రవణ్ కుమార్ గోల్డ్ మెడల్ సాధించగా, అండర్ 10 ఇయర్స్ కటాస్ విభాగంలో భార్గవ్, మంజుశ్రీ గోల్డ్ మెడల్, అనిత సిల్వర్ మెడల్ సాధించారని, వీరందరినీ ఈనెల 29, 30వ తేదీ లలో గోవాలో జరగబోయే ఇంటర్నేషనల్ ఏసియన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలకు తీసుకెళ్లడం జరుగుతుందని యూనివర్సల్ 369 కరాటే కోచ్ ఫౌండర్ గడ్డం సాయికుమార్ తెలిపారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి.

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జీడిమెట్ల 132వ డివిజన్ పరిధిలోని జీడిమెట్ల గ్రామంలో రోడ్డు మరియు డ్రైనేజ్ సమస్యలతో ఇబ్బందిపడుతున్నారని గ్రామస్తులు తెలపడంతో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి జీడిమెట్ల గ్రామంలో పర్యటించి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. గాయత్రినగర్ మెయిన్ రోడ్డులో జరుగుతున్న పనులను గోదావరి హోమ్స్ మరియు గాయత్రినగర్ కాలనీవాసులతో కలిసి కోల్ నాలా పనులు పరిశీలించి, పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సంబంధిత ఇరిగేషన్ కాంట్రాక్టర్, ఇంజినీరింగ్‌కి బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సుమేర్ సింగ్, మాధవరెడ్డి, సుభాష్, రాజు, బీరప్ప, దేవేందర్, బ్రిజేష్, సంజీవరెడ్డి, అరవింద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీజింగ్ నుంచి తొలగించాలి

సర్పంచ్ జీ సురేందర్ ముదిరాజ్

నవతెలంగాణ-మేడ్చల్
రాష్ట్రంలో గ్రామ పంచాయతీ నిధులు స్టేట్ ఫైనాన్స్, కేంద్ర ప్రభుత్వ నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీజింగ్ పేరిట తమ అవసరాలకు మళ్లించుకొని సర్పంచులను ఇబ్బందిపాలు చేస్తుందని రాష్ట్ర సర్పంచుల ఫోరం అధికార ప్రతినిధి, గౌడవెల్లి సర్పంచ్ జి.సురేందర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఆయన ఒక సమావేశంలో మాట్లాడుతూ సుమారు 6 నెలల నుండి గ్రామాలలో చేసిన పనులకు బిల్లులు రాక కొంతమంది సర్పంచులు ఆత్మహత్యకు పాల్పడుతు న్నారని, అలాగే కాంట్రాక్టర్లు కూడా బిల్లులు రాక నూతన పనులు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు రాక పంచాయతీల వద్ద నిరసన తెలియజేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామపంచాయతీ నిధులను ఫ్రీజింగ్ నుంచి తొలగించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని సూచించారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు, కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని చెప్పారు. గ్రామాల్లో బిల్లులు రాక సర్పంచులు గ్రామంలో తిరిగే పరిస్థితి లేదని, వెంటనే ఈ సమస్య పరిష్కరించకపోతే మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సర్పంచులు పెండింగ్ బిల్లులు మీద పోరాటం చేస్తారని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.



బీహార్ అసోసియేషన్ హైదరాబాద్ "హోలీ మిలన్"లో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ 130 డివిజన్ పరిధిలోని సుభాష్‌నగర్ విశ్వకర్మ మందిర్‌లో బీహార్ అసోసియేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "హోలీ మిలన్" కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ హరే రామ్ సింగ్, వెస్ట్ ప్రెసిడెంట్ ఉత్తమ్‌యాదవ్, సెక్రెటరీ ప్రభాకర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE. CUMIV ADDL METROPOLITAN MAGISTRATI, MEDCHAL MALKAIGIRI DISTRICT
AT: LB NAGAR
O.S.No. 646 of 2022
(Old O.N.No. 859/2019)

Between:
Katta Venkateshwar Reddy .....Plaintiff
AND
M. Balaraju and others ..Defendants
To
A. Venkata Rao, S/o. A. Hanumantha Rao, aged 42 years, Occ.: Business, r/o. 1-241/345, Bhavani Nagar, Kapra, ECIL Post, Hyderabad - 62
-- Defendant No.2

Please take notice that the above Plaintiff filed O.S.No. 646/2022 against M.Balaraju and 3 others for perpetual injunction in respect of suit schedule property on the file of Principal Junior Civil Judge cum IV Addl. Metropolitan Magistrate. Medchal-Malkajgiri District, at L.B.Nagar in which you are arrayed as Defendant No.2 and the Hon'ble Court ordered Notice/summons to you by paper publication vide order dated 09-03-2023. Please note that the above suit stands posted to 04-04-2023 for your appearance. If you fail to attend the Honourable Court on the said date either personally or through your Advocate, the same will be decided on merits by setting you exparte.

BY THE ORDER OF THE HONOURABLE COURT //
Mrs. A. ANASUYA, B.Sc.. B.L...
ADVOCATE, # 202, Sai Sudha Residency, H.No. 1-1-336/39/A/3, Vivek Nagar, Chikkadpally. Hyderabad 500 020
PH:9246106664

కూకట్‌పల్లిలో లక్ష్మీవాసవి సిల్క్స్ స్టోర్ ప్రారంభం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
కూకట్‌పల్లిలో సినీ నటి అర్చన సందడి చేశారు. ఆదివారం కేపీహెచ్బీ కాలనీలో గల లక్ష్మీ వాసవి సిల్క్స్ స్టోర్ ప్రారంభోత్సవానికి సినీ నటి అర్చన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోవు రోజుల్లో పెళ్లిళ్ల సీజన్ ఉందని, తక్కువ ధరకే పట్టు చీరలు సొంతం చేసుకోవాలన్నారు. లక్ష్మీ వాసవి సిల్క్స్ వారికి సొంత మగ్గాలు ద్వారా మంచి తక్కువ ధరకే పట్టు చీరలు అమ్ముతున్నారని తెలిపారు. లక్ష్మీవాసవి అధినేత నరేష్ మాట్లాడుతూ చేనేత కార్మికులు నేసిన ధరకే ఇక్కడ పట్టు చీరలు అమ్మడం వాసవి ప్రత్యేకత అన్నారు. కంచి, ఉప్పాడ, ధర్మవరం పట్టు చీరలు అందుబాటులో ఉంటాయని అన్నారు. హోల్ సేల్ ధరలు అనేది మీరు తరచుగా వింటూనే ఉంటారని, ఇప్పుడు అటువంటి హోల్ సేల్ వాళ్లకి కూడా సప్లై చేసే వాళ్ళు ఇప్పుడు మీ ముందుకు వచ్చేసింది లక్ష్మీ వాసవి సిల్క్స్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్టోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పన్నాల కొండల్ రెడ్డి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-ఘట్‌కేసర్
మృతుల కుటుంబాలను ఆదుకోవడంలో మల్లారెడ్డి ట్రస్ట్ సేవలు మరువలేనివని బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్ గ్రామంలో ఇటీవల అకస్మాత్తుగా తాటి చెట్టుపై నుండి కిందపడి మృతి చెందిన బబ్బురి అశోక్‌గౌడ్ కుటుంబ సభ్యులకు కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి మల్లారెడ్డి ట్రస్ట్ ద్వారా పంపించిన రూ.5వేలు బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి రూ.5వేలు, మొత్తం రూ.10వేలు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, జిల్లా రైతుబంధు సమితి సభ్యులు భిక్షపతి గౌడ్, ఉపసర్పంచ్ ఐలయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ గోపాల్ రెడ్డి, వార్డు సభ్యులు బొడిగే శ్రీనివాస్‌గౌడ్, కె.వీరేశం, కందకట్ల దయాకర్ రెడ్డి, గ్రామ బీఆర్ఎస్ కార్యదర్శి నాగరాజు, మెగోటి వెంకటేష్, గొరుకంటి నర్సింహ, బాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెడివిజన్ హాస్పిటల్ మెగా హెల్త్ క్యాంప్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్‌నగర్ 130 డివిజన్ పరిధిలోని పోచమ్మ ఆలయ కమిటీ హాల్ వద్ద ఎంఎస్ఆర్ హెల్పింగ్ హాండ్స్ మెంబర్ నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మెడివిజన్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌లో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు అడపా శేషు, నాగిరెడ్డి, బసవరాజు, సతీష్‌గౌడ్, అభిలాష్, శ్రీనివాస్, సత్యనారాయణ, మురళీకృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారించేందుకు చర్యలు

మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
ప్రజలకు తాగునీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు తీసుకుంటానని మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు అన్నారు. ఆదివారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ రోడ్ నెం.09లో గత కొంత కాలంగా లో ప్రెషర్ కారణంగా నీరు తక్కువగా వస్తుండడంతో కాలనీ వాసులు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పగుడాల శిరీషల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించి నూతన పైపులైన్ల కోసం నిధులు మంజూరు చేశారు. అట్టి పనులను ఆదివారం మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెరాస కాలనీ ప్రెసిడెంట్ భూమండ్ల అశోక్, కాలనీ వారు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి

నవతెలంగాణ - సరూర్‌నగర్
బీజేపీ నాయకుల భార్యల మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన నకిరేకల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సి.లింగయ్యపై చర్యలు తీసుకోవాలని ఆదివారం సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల పట్ల గౌరవం లేకుండా అమర్యాదగా మాట్లాడిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని అన్నారు.



మానవసేవే మాధవసేవ

నవతెలంగాణ-ఘట్‌కేసర్
మానవసేవే మాధవ సేవ అని శ్రీ రాజమాత ఫౌండేషన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు ఈ సందర్భంగా పోచారం లోని కూడా వికలాంగుల కాలనీలో వికలాంగులకు దాతల సహాయంతో నిత్యవసర వస్తువులను శ్రీ రాజమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వికలాంగులకు అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలను ఆదుకోవడమే పేదలకు సహాయం అందించడంలో శ్రీ రాజమాత ఫౌండేషన్ ఎన్నో విధాలుగా సహాయం అందిస్తుందని ఆయన అన్నారు మానవసేవే మాధవసేవ అంటూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారు ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు మనోజ్ కుమార్ రెడ్డి సభ్యులు శ్రీనివాస్ రెడ్డి పందు సంతోష్ తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ

నవతెలంగాణ - మీర్‌పేట్
హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ద్వారా పోలీస్ సిబ్బందితో భద్రత ఏర్పాట్లు చేశామని అన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ సిబ్బంది పోలింగ్ ఆఫీసర్ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



PUBLIC NOTICE

The general public are hereby informed that K.Sai Ram S/o Madusudhana Charyulu Aged about 49 Years Occ:-Employee R/o Flat No-301, Sushanth Estates, GTB Road, Bhagyanagar Colony, Kukatpally Rangareddy District has approached M/s Shriram Finance Ltd, Basheerbagh Branch, Hyderabad for depositing his title deeds by way of equitable mortgage in respect of schedule property for securing his future liability towards the loan amount. If any person or persons are having any objections, right, claim, title, interest over the schedule property they shall approach the undersigned with certified copies of documents in support of their claim within (7) Seven days from today, failing which the loan amount will be sanctioned **K.Sai Ram S/o Madusudhana Charyulu** and no claim or no objection of any nature thereafter will be entertained thereafter. Hence the notice.

SCHEDULE OF THE PROPERTY
All that Part and Parcel of Flat bearing no. G-2, in Ground Floor, with a plinth area of 1065 Sq.ft (including Common area & Car Parking), along with an undivided share of land admeasuring 26 Sq.yds out of total land admeasueing 550.60 Sq.yds in sy No. 277, Situated at Nizampet (Village), Bachupally (Mandal), Medchal-Malkajgiri District and Bounded as Follows:-North:: Open to Sky, South:Flat No G-1,East:Corridor West : Open to Sky

ITEM NO-III
All that Part and Parcel of the House bearing No. 1-152/North Gramakantam, admeasuring 109 Sq.yds equivalent to 91.13 Sq.mtrs with plinth area1160 Sq.ft consisting of Ground & first floor Situated at Gowraipally (Village).Yadagirigutta (Mandal), Yadadri-Bhongiri district and Bounded as Follows:-North: 20 Ft wide Road, South:House of 1-152/South of G.Lalitha,East:H-No:-1-151 of B.Kavya West:Open Place of G.Lalitha

For NomosVistas, The Lawyers,
Govardhan Venu,
Advocate & CEO
C-701Skyline & Sterling Residency, Basheerbagh, Hyderabad 29.
Mob:-9849091266

కోహ్లి కొట్టాడు 186


- భారత్ తొలి ఇన్నింగ్స్ 571/10
- తొలి ఇన్నింగ్స్‌లో 91 పరుగుల ఆధిక్యం

డ్రా దిశగా ఆస్ట్రేలియాతో నాల్గో టెస్టు

విరాట్ కోహ్లి శతక్కొట్టాడు. మూడేండ్ల సుదీర్ఘ శతక నిరీక్షణకు తెరదించాడు. 2019 నవంబర్‌లో బంగ్లాదేశ్‌పై చివరగా టెస్టు శతకం సాధించిన విరాట్ కోహ్లి.. 41 ఇన్నింగ్స్‌ల అనంతరం ఐదు రోజుల ఆటలో మరో సెంచరీ బాదాడు. ఆస్ట్రేలియాపై అహ్మదాబాద్‌లో 186 పరుగుల మెగా ఇన్నింగ్స్‌తో చెలరేగిన విరాట్ కోహ్లి తొలి ఇన్నింగ్స్‌లో 571 పరుగుల భారీ స్కోరు అందించాడు. విరాట్ కోహ్లి శతక జోరుకు అక్షర్ పటేల్ (79) తోడవటంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ విలువైన 91 పరుగుల ఆధిక్యం సొంతం చేసుకుంది. బౌలర్లకు సహకరించని పిచ్‌పై నాలుగు రోజుల్లో రెండు ఇన్నింగ్స్‌లే ముగియటంతో..చివరి టెస్టులో ఫలితం తేలే అవకాశం కనిపించటం లేదు!. భారత్, ఆస్ట్రేలియా చివరి టెస్టులో నేడు ఆఖరు రోజు ఆట.

నవతెలంగాణ-అహ్మదాబాద్

విరాట్ కోహ్లి (186, 364 బంతుల్లో 15 ఫోర్లు) శతకోత్సవం. మొతెరా పిచ్‌పై పరుగుల వరద పారించిన స్టార్ బ్యాటర్.. కెరీర్ 28వ టెస్టు శతకం పూర్తి చేశాడు. విరాట్ కోహ్లి సెంచరీకి తోడు అక్షర్ పటేల్ (79, 113 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులు) ధనాధన్ జత కావటంతో నాల్గో రోజు ఆటలో భారత్ వేగంగా పరుగులు సాధించింది. తెలుగు తేజం శ్రీకర్ భరత్ (44, 88 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు), రవీంద్ర జడేజా (28, 84 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ అనారోగ్యంతో బ్యాటింగ్‌కు రాలేదు. దీంతో భారత్ పది మంది బ్యాటర్లతో బరిలోకి దిగింది. నాల్గో రోజు చివర్లో బ్యాటింగ్‌కు వచ్చిన ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 3/0తో ఆడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో టీమ్ ఇండియా 91 పరుగుల ఆధిక్యం దక్కించుకోగా.. ప్రస్తుతం ఆస్ట్రేలియా మరో 88 పరుగుల వెనుకంజలో నిలిచింది.



తొలి సెషన్ : కొంచెం ఇష్టం..కొంచెం కష్టం!

ఓవర్‌నైట్ స్కోరు 289/3తో నాల్గో రోజు ఉదయం సెషన్లో బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్ ఇండియాకు తొలి సెషన్ సంతృప్తి ఇవ్వలేదు. అదే సమయంలో ఆస్ట్రేలియాకు సైతం ఉదయం సెషన్లో పెద్దగా దక్కిందేమీ లేదు. ఈ సెషన్లో టీమ్ ఇండియా 73 పరుగులు రాబట్టగా.. ఆస్ట్రేలియా ఓ వికెట్ దక్కించుకుంది. డ్రింక్స్ విరామం లోపే రవీంద్ర జడేజా వికెట్ కోల్పోయిన టీమ్ ఇండియా.. పరుగుల వేటలో దూకుడు తగ్గించింది. విరాట్ కోహ్లికి జతకలిసిన తెలుగు తేజం కె.ఎస్ భరత్ సావధానంగా బ్యాటింగ్ చేశాడు. ఆసీస్ స్పిన్నర్లు, పేసర్లు గొప్పగా బౌలింగ్ చేయలేదు. అయినా, పరుగులు ఆశించిన విధంగా రాలేదు. కంగారూ కెప్టెన్ స్టీవ్ స్మిత్ గొప్ప ఫీల్డింగ్ మొహరింపులతో బౌండరీల కోసం కోహ్లి, భరత్ చెమటోడ్చాల్సి వచ్చింది. చాలా మంచి షాట్ కొడితే గానీ బౌండరీ దక్కలేదు. లంచ్ విరామ సమయానికి భారత్ 362/4తో నిలిచింది.

రెండో సెషన్ : శతక దాహం తీరింది

కెరీర్‌లో తొలిసారి ఆట పరంగా విమర్శలు ఎదుర్కొన్న విరాట్ కోహ్లి.. టీ20, వన్డేల్లో శతకాలు బాదినా టెస్టుల్లో మాత్రం మూడంకెల స్కోరు అందుకోలేదు. మంచిగా ఆడుతున్నాడు, సెంచరీ కొడతాడనుకున్న ప్రతిసారీ కోహ్లి నిరాశపరిచాడు. అహ్మదాబాద్‌లో మాత్రం కోహ్లి ఆరంభంలో ఇబ్బంది పడ్డాడు. లయాన్ అతడిని ఇరకాటంలో పడేశాడు. కానీ ఆడుతున్న కొద్దీ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించిన విరాట్.. మొతెరాలో శతక మోత మోగించాడు. ఐదు ఫోర్లతో 241 బంతుల్లో 100 పరుగులు బాదాడు. విరాట్ కోహ్లికి ఇది టెస్టుల్లో 28వ సెంచరీ కావటం విశేషం. సుదీర్ఘ కాలం నిరీక్షించిన శతకం సాధించిన వేళ.. డ్రెస్సింగ్‌రూమ్ వైపు వచ్చి హెల్మెట్ తీసి మెడలో రింగ్‌ను ముద్దాడిన విరాట్ కోహ్లి సెలబ్రేట్ చేసుకున్నాడు. ఈ శతకంతో విరాట్ కోహ్లి మోస్తోన్న భారం దిగిపోయిందంటూ కామెంటరీ బాక్స్‌లో వ్యాఖ్యాతలు అనటం గమనార్హం. కోహ్లితో పాటు నిలకడగా ఆడిన కె.ఎస్ భరత్ అర్థ సెంచరీకి ఆరు పరుగుల ముంగిట వికెట్ చేజార్చుకున్నాడు. డ్రింక్స్ విరామ సమయానికి భారత్ 419/5తో నిలిచింది. ఇక్కడ విరాట్‌కు తోడైన అక్షర్ పటేల్.. ఇన్నింగ్స్‌ను కొత్త పుంతలు తొక్కించాడు. అక్షర్ పటేల్ దూకుడుగా ఆడటంతో పరుగుల వరద పారించింది. ఈ సెషన్లో ఒక వికెట్ కోల్పోయిన భారత్ 110 పరుగులు జోడించింది.

మూడో సెషన్ : విలువైన ఆధిక్యం సొంతం

బంతితో ఆశించిన ప్రదర్శన చేయకపోయినా.. బ్యాట్‌తో సిరీస్‌లోనే అత్యంత నిలకడగా రాణించిన బ్యాటర్‌గా నిలిచాడు అక్షర్ పటేల్. బ్యాటింగ్‌కు కష్టమైన పిచ్‌లపై అర్ధ సెంచరీ కొట్టిన అక్షర్.. సొంతగడ్డ అహ్మదాబాద్‌లోనూ అదే జోరు చూపించాడు. నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 95 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన అక్షర్ పటేల్ భారత్‌ను డ్రింక్స్ విరామానికి ముందే ఆధిక్యంలోకి తీసుకొచ్చాడు. మరోవైపు విరాట్ కోహ్లి 12 ఫోర్ల సాయంతో 313 బంతుల్లో 150 పరుగుల మైలురాయి దాటాడు. ధనాధన్ వేటలో ఉన్న అక్షర్ పటేల్ శతకం దిశగా సాగాడు. కానీ అక్షర్ పటేల్ నిష్క్రమణతో భారత్ స్వల్ప ఆధిక్యంతోనే సరిపెట్టుకుంది. విరాట్ కోహ్లి ద్వి శతకం కోసం అభిమానులు ఎదురు చూసినా.. అతడే చివరి వికెట్‌గా నిష్క్రమించాడు. దీంతో 186 పరుగుల వద్ద కోహ్లి మ్యాజిక్ ముగిసింది. లోయర్ ఆర్డర్‌లో అశ్విన్ (7), ఉమేశ్ (0) నిరాశపరిచారు. మహ్మద్ షమి (0) అజేయంగా నిలిచాడు. అనారోగ్యంతో శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌కు రాలేదు. 178.5 ఓవర్లలో 571 పరుగులకు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 91 పరుగుల ఆధిక్యం భారత్ దక్కించుకుంది. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ లయాన్ (3/151), టాడ్ మర్ఫీ (3/113) మూడేసి వికెట్లు పడగొట్టారు.

నాల్గో రోజు ఆటలో 6 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా వికెట్ నష్టపోకుండా ముగించింది. ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (3 బ్యాటింగ్, 18 బంతుల్లో)తో కలిసి నైట్‌వాచ్‌మన్ మాథ్యూ కునేమాన్ (0 బ్యాటింగ్, 18 బంతుల్లో) అజేయంగా నిలిచారు. అశ్విన్ మూడు ఓవర్లలో వికెట్ కోసం ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. జడేజా, మహ్మద్ షమిలు సైతం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 3/0తో కొనసాగుతోంది. ఆసీస్ మరో 88 పరుగుల వెనుకంజలో నిలిచింది.



ఫలితం వచ్చేనా?!

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ టీమ్ ఇండియా సొంతమవటం ఖాయమైంది. అహ్మదాబాద్ టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో కొండంత స్కోరు ముందున్నా.. అలవోకగా ఆధిక్యం దక్కించుకుంది భారత్. మూడేండ్లుగా శతకం కోసం ఎదురుచూసిన విరాట్ కోహ్లి (186) సూపర్ సెంచరీతో అదరగొట్టాడు. శుభ్‌మన్ గిల్ (128), అక్షర్ పటేల్ (79)లు సైతం మెరవటంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 571 పరుగులు చేసింది. చివరి టెస్టులో ఆస్ట్రేలియాకు పెద్దగా అవసరం లేదు. నెగ్గినా.. ఆ జట్టుకు సిరీస్ దక్కదు. కానీ భారత్‌కు అత్యవసరం. ఈ టెస్టులో విజయం సాధిస్తే ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో నేరుగా చోటు దక్కించుకోవచ్చు. లేదంటే శ్రీలంక, న్యూజిలాండ్ టెస్టు సిరీస్ ఫలితంపై ఆధారపడాల్సి ఉంటుంది. అయితే, అహ్మదాబాద్ టెస్టులో నాలుగు రోజుల ఆట ముగిసింది. 12 సెషన్ల ఆటలో రెండు ఇన్నింగ్స్‌లు మాత్రమే ముగిశాయి. ఇంకా రెండు ఇన్నింగ్స్‌లు ఆడాల్సి ఉంది. మరో మూడు సెషన్ల ఆట మాత్రమే మిగిలి ఉంది. ఈ మూడు సెషన్లలో ఆస్ట్రేలియా పది వికెట్లు పడగొట్టడంతో పాటు ఆ జట్టు నిర్దేశించిన లక్ష్యాన్ని భారత్ ఛేదించాలి. పిచ్ స్వభావం, స్పందిస్తున్న తీరు చూస్తే అది సాధ్యపడే పరిస్థితి లేదు. దీంతో భారత్, ఆస్ట్రేలియా నాల్గో టెస్టులో డ్రా తప్పదనిపిస్తుంది. చివరి రోజు పిచ్ పగుళ్ల తేలి స్పిన్‌కు అనుకూలిస్తే మినహా.. నేడు ఆటలో ఫలితం ఆశించే అవకాశం ఏమాత్రం లేదు.

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 480/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) లబుషేన్ (బి) కునేమాన్ 35, శుభ్‌మన్ గిల్ (ఎల్బీ) లయాన్ 128, పుజార (ఎల్బీ) మర్ఫీ 42, విరాట్ కోహ్లి (సి) లబుషేన్ (బి) మర్ఫీ 186, రవీంద్ర జడేజా (సి) ఖవాజ (బి) మర్ఫీ 28, శ్రీకర్ భరత్ (సి) హ్యాండ్స్‌కాంబ్ (బి) లయాన్ 44, అక్షర్ పటేల్ (బి) స్టార్క్ 79, అశ్విన్ (సి) కునేమాన్ (బి) లయాన్ 7, ఉమేశ్ యాదవ్ రనౌట్ 0, మహ్మద్ షమి నాటౌట్ 0, శ్రేయస్ అయ్యర్ (అబ్సెంట్ హర్ట్) 0, ఎక్స్‌ట్రాలు : 22, **మొత్తం : (178.5 ఓవర్లలో ఆలౌట్) 571.**

వికెట్ల పతనం : 1-74, 2-187, 3-245, 4-309, 5-393, 6-555, 7-568, 8-569, 9-571.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 22-3-97-1, కామెరూన్ గ్రీన్ 18-1-90-0, నాథన్ లయాన్ 65-9-151-3, మాథ్యూ కునేమాన్ 25-3-94-1, టాడ్ మర్ఫీ 45.5-10-113-3, ట్రావిశ్ హెడ్ 3-0-8-0.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : మాథ్యూ కునేమాన్ బ్యాటింగ్ 0, ట్రావిశ్ హెడ్ బ్యాటింగ్ 3, ఎక్స్‌ట్రాలు : 0, **మొత్తం : (6 ఓవర్లలో) 3.**

బౌలింగ్ : రవిచంద్రన్ అశ్విన్ 3-2-1-0, రవీంద్ర జడేజా 2-1-1-0, మహ్మద్ షమి 1-0-1-0.


కివీస్ లక్ష్యం 285

- ఛేదనలో ప్రస్తుతం 28/1
- శ్రీలంకతో న్యూజిలాండ్ తొలి టెస్టు



క్రైస్ట్‌చర్చ్ : శ్రీలంక, న్యూజిలాండ్ తొలి టెస్టు రసకందాయంలో పడింది. ఐదో రోజు ఆటలో ఫలితం కోసం ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. శ్రీలంక నిర్దేశించిన 285 పరుగుల లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ 28/1తో కొనసాగుతుంది. ఓపెనర్ టామ్ లేథమ్ (11 బ్యాటింగ్), కేన్ విలియమ్సన్ (7 బ్యాటింగ్) అజేయంగా ఆడుతున్నారు. డెవాన్ కాన్వే (5) నిరాశపరిచాడు. చివరి రోజు ఆటలో 90 ఓవర్లలో న్యూజిలాండ్‌కు మరో 257 పరుగులు అవసరం కాగా.. శ్రీలంక మరో 9 వికెట్ల దూరంలో నిలిచింది. ఇక బ్లెయిర్ టిక్‌నర్ (4/100), మాట్ హెన్రీ (3/71), టిమ్ సౌథీ (2/57) రాణించటంతో శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 302 పరుగులకు కుప్పకూలింది. ఏంజెలో మాథ్యూస్ (115, 235 బంతుల్లో 11 ఫోర్లు) శతకానికి తోడు ధనంజయ డిసిల్వ (47), దినేశ్ చండిమాల్ (42) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 373 పరుగులు చేయగా.. శ్రీలంక 355 పరుగులు చేసింది.

ఇగా స్వైటెక్ ముందంజ



- ఇండియన్ వెల్స్ మాస్టర్స్

ఇండియన్‌వెల్స్ : మహిళల సింగిల్స్ టాప్ సీడ్, అగ్రశ్రేణి క్రీడాకారిణి ఇగా స్వైటెక్ (పోలాండ్) ఇండియన్‌వెల్స్ మాస్టర్స్‌లో ముందంజ వేసింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో స్వైటెక్ అలవోక విజయం నమోదు చేసింది. అమెరికా అమ్మాయి క్లేరీ లీయుపై 6-0, 6-1తో అలవోక విజయం సాధించింది. ఐదు బ్రేక్ పాయింట్లు సాధించిన స్వైటెక్ అమెరికా అమ్మాయిని చిత్తు చేసింది. ఐదో సీడ్ కరొలినా గార్సియా (ఫ్రాన్స్) సైతం మూడో రౌండ్లోకి ప్రవేశించింది. దాల్మా గాల్ఫీపై 6-1, 6-7(4-7), 6-4తో కరొలినా గార్సియా గెలుపొందింది. దాల్మా 14 ఏస్‌లతో మెరిసినా.. మూడు సెట్ల పోరులో గార్సియా పైచేయి సాధించింది. జర్మనీ అమ్మాయి మరియ వరుస సెట్లలో ఓటమి చెందింది. రష్యా అమ్మాయి దరియా కసట్కినా 6-2, 6-1తో వరుస సెట్లలో విజయం సాధించింది. ఎలెనా రెబకానా 7-6(8-6), 7-6(7-5)తో సోఫియ కెనిన్‌పై విజయంతో మూడో రౌండ్‌కు చేరుకుంది. అమెరికా వెటరన్ స్టార్ మడిసన్ కీస్ కథ రెండో రౌండ్లోనే ముగిసింది. 1-6తో సోరాన సిర్స్టెటీ చేతిలో తొలి సెట్ చేజార్చుకున్న మడిసన్.. వాకోవర్‌తో టోర్నీ నుంచి నిష్క్రమించింది.

మెన్స్ సింగిల్స్‌లో టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్) వరుస సెట్లలో గెలుపొందాడు. 6-3, 6-3తో ఆస్ట్రేలియా ఆటగాడు కొక్కినాస్‌పై విజయం సాధించాడు. అమెరికా ఆటగాడు టేలర్ ఫ్రిట్జ్ 4-6, 6-4, 6-6తో రెండో రౌండ్లో సహచర ఆటగాడు బెన్ షెల్టన్‌ను ఓడించాడు. ఏడో సీడ్ హెూల్గర్ రూనె 7-5, 6-3తో మెక్‌డొనాల్డ్‌ను ఓడించి మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే 6-4, 6-3తో రాడు అల్బోట్‌పై వరుస సెట్లలో విజయం సాధించాడు. స్విస్ ఆటగాడు స్టానిస్లాస్ వావ్రింకా 7-6(10-6), 6-4తో మివోమిర్‌పై టైబ్రేకర్‌కు దారితీసిన మ్యాచ్‌లో విజయం సాధించాడు.

అంచనాలు అందుకునేలా సినిమాలు చేస్తా..



రోషన్

శ్రీకాంత్, ఊహల నట వారసుడిగా అరంగేట్రం చేసి తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు రోషన్ మేకా. బాలనటుడిగా 'రుద్రమదేవి' (2015) చిత్రంలో తెరపై మెరిశాడు. తర్వాత హీరోగా పరిచయం అవుతూ నటించిన 'నిర్మలా కాన్వెంట్' (2016) చిత్రానికి ఉత్తమ నటుడిగా సైమా అవార్డును సొంతం చేసుకున్నాడు. కెరీర్ ప్రారంభంలోనే దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు పర్యవేక్షణలో రూపొందిన 'పెళ్ళి సందడి' చిత్రంలో నటించడం విశేషం. గౌరీ రోణంకి దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ కామెడీ సినిమా రోషన్‌కి మంచి పేరు తీసుకొచ్చింది. 'పెళ్లి సందడి' విజయం తర్వాత రోషన్ చేస్తున్న కొత్త సినిమాపై అందరిలోనూ అంచనాలు భారీగా పెరిగాయి. ఈ యువ హీరో ప్రస్తుతం వైజయంతీ మూవీస్, వేదాంస్ పిక్చర్స్ ప్రొడక్షన్స్‌లో తన తదుపరి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాడు. నేడు (సోమవారం) రోషన్ బర్త్‌డే. ఈ సందర్భంగా తన కెరీర్ గురించి ఆయన మాట్లాడుతూ, 'కెరీర్ ప్రారంభంలోనే రాఘవేంద్రరావులాంటి దర్శక దిగ్గజం నిర్మించిన సినిమాలో నటించటం చాలా ఆనందంగా ఉంది. అలాగే నాగార్జునగారి అన్నపూర్ణ స్టూడియో నిర్మించిన 'నిర్మలా కాన్వెంట్'తో నాకు మంచి ఎంట్రీ లభించడం విశేషంగా భావిస్తున్నాను. మంచి సినిమాలతో, మంచి పాత్రలతో ప్రేక్షకులను అలరించేందుకు నా వంతు కృషి చేస్తాను' అని చెప్పారు.

రొటీన్‌కి భిన్నంగా గేమ్ ఆన్

గీత్ ఆనంద్, నేహా సోలంకి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'గేమ్ ఆన్'. కస్తూరి క్రియేషన్స్ ప్రొడక్షన్, గోల్డెన్ వింగ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుండి 'రిచ్చో రిచ్..' అంటూ సాగే ఫస్ట్ లిరికల్ సాంగ్‌ను చిత్ర బృందం రిలీజ్ చేసింది. ఈ పాటకు అసుర ఇచ్చిన లిరిక్స్ చాలా క్యాచీగా ఉన్నాయి.



గీత్ ఆనంద్, నేహా సోలంకి

వైవిధ్యమైన వాయిస్‌తో అసుర, రిక్కీ ఆలపించిన విధానం కొత్తగా ఉంది. ఈ సందర్భంగా నిర్మాత రవి కస్తూరి మాట్లాడుతూ, 'గతంలో మేం విడుదల చేసిన 'గేమ్ ఆన్' టైటిల్ అనౌన్స్‌మెంట్, ఫస్ట్ లుక్ లాంచ్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. రీసెంట్‌గా హైదరాబాద్ ఫేమస్ నవాబ్ గ్యాంగ్ బ్యాండ్ ద్వారా మ్యూజిక్‌ను ఫస్ట్ టైం రిలీజ్ చేశాం. ప్రోమోకు కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. టీజర్‌ను చూసిన చాలా మంది ఫ్రెండ్స్, డిస్ట్రిబ్యూటర్స్ మమ్మల్ని ఈ సినిమా గురించి మరింత ఆసక్తిగా అడిగారు. దీంతో ఈ సినిమాపై మాకు చాలా మంచి నమ్మకం వచ్చింది. ఈ సినిమాకు ఇద్దరు అన్న దమ్ములుగా వర్క్ చేస్తున్నారు. ఒకరు హీరోగా, ఒకరు డైరెక్టర్‌గా ఈ సినిమాకి చేయటం విశేషం. అరవింద్ విశ్వనాథన్ అద్భుతంగా విజువల్స్ ఇచ్చాడు. ప్రతి ఫ్రేమ్ మిమ్మల్ని ఓ కొత్త లోకంలోకి తీసుకెళ్తుంది. ఇంటెన్స్ క్యారెక్టర్స్ మధ్య జరిగే ఎమోషనల్ జర్నీ ఇది. హీరో ఒక లూజర్‌గా తన లైఫ్‌లో మిగిలిపోతున్న టైమ్‌లో తన లైఫ్‌లో ఒక గేమ్ స్టార్ట్ అవుతుంది. తనని ఆ గేమ్ ఏ లెవల్‌కు తీసుకెళ్తుందనేదే ఈ కథ. లేటెస్ట్‌గా మేం విడుదల చేసిన సాంగ్‌కు కూడా ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ వస్తోంది. త్వరలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కూడా చేయబోతున్నాం. అలాగే ఈ సినిమాకు చేసే ప్రతి ప్రమోషన్ కూడా వినూత్నమైన రీతిలో ఉంటుంది' అని తెలిపారు.

> ఇది రొటీన్ సినిమాలకు భిన్నంగా ఉండే కథ. తెలుగులో ఇప్పుడు డిఫరెంట్ సినిమాలు రావడమే కాదు.. సక్సెస్ కూడా అవుతున్నాయి. ఓ మార్క్ క్రియేట్ చేస్తున్నాయి. ఆ కోవలోనే ఈ సినిమా ఉంటుంది. చాలా ట్విస్టులు, టర్నులుంటాయి. ఈ సినిమాలో యాక్షన్, రొమాన్స్, ఎమోషన్స్... ఇలా అన్ని రకాల ఎలిమెంట్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటాయి.
>
> - డైరెక్టర్ దయానంద్

నవచిత్రం

నిర్మాతల ధైర్యాన్ని మెచ్చుకోవాలి



జయశంకర్, అభిషేక్ అగర్వాల్, శేషు మారంరెడ్డి

ఆర్ వీ రెడ్డి సమర్పణలో ఆర్వీ సినిమాస్ పతాకంపై శ్రీనివాస్ రామిరెడ్డి, శేషు మారంరెడ్డి నిర్మిస్తున్న సినిమా 'అరి'. మై నేమ్ ఈజ్ నో బడీ అనేది ఉపశీర్షిక. 'పేపర్ బాయ్' ఫేమ్ జయశంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను కశ్మీర్ ఫైల్స్, కార్తికేయ2 చిత్రాలతో పాన్ ఇండియన్ ప్రొడ్యూసర్‌గా మారిన అభిషేక్ అగర్వాల్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ టైటిల్ నాకు బాగా నచ్చింది. అలాగే ట్రైలర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. మంచి ప్యాడింగ్ కనిపిస్తోంది. రీసెంట్‌గా విడుదలైన మంగ్లీ పాడిన పాట నాకు బాగా నచ్చింది. డైరెక్టర్ జయశంకర్ మెదటి మూవీ 'పేపర్ బాయ్' కూడా చాలా బాగా ఆడింది. ఈ మూవీ కూడా కుడా పెద్ద హిట్ కావాలి. ఇలాంటి కథలు చేయాలంటే ధైర్యం చేయాలి. నిర్మాతలకు ఫస్ట్ మూవీ అయినా వారి ప్రయత్నం మెచ్చుకోవాలి' అని తెలిపారు. నిర్మాతల్లో ఒకరైన శేషు మారం రెడ్డి మాట్లాడుతూ, 'మా అరి మూవీ ట్రైలర్ విడుదల చేయడానికి అంగీకరించిన అభిషేక్ అగర్వాల్‌కి థ్యాంక్స్. ఈ అరి సినిమా అనేది వైవిధ్యమైన కథతో వస్తోంది. కథతో పాటు కథనం, సంగీతం హైలెట్ అవుతాయి. మంగ్లీ పాట చాలా పెద్ద హిట్ అయింది' అని చెప్పారు. దర్శకుడు జయ శంకర్ మాట్లాడుతూ, 'గత వారం విడుదల చేసిన శ్రీ కృష్ణ ఆంథెమ్ పాట అద్భుతమైన స్పందన తెచ్చుకుంది. అలాగే ఈ ట్రైలర్ కూడా మీ అందరికీ నచ్చుతుందనుకుంటున్నాను. మా నిర్మాతలు శేషు, ఆర్ వీ రెడ్డి సపోర్ట్ మర్చిపోలేనిది' అని అన్నారు.


మాధురీ దీక్షిత్‌కి మాతృవియోగం



మాధురీ దీక్షిత్, స్నేహలతా దీక్షిత్

బాలీవుడ్ సీనియర్ నటి మాధురీ దీక్షిత్ తల్లి స్నేహలతా దీక్షిత్ (91) కన్నుమూశారు. ఆదివారం ముంబైలోని తన నివాసంలో ఆమె తుది శ్వాస విడిచారు. తన తల్లి మరణ వార్తను మాధురీ దీక్షిత్, ఆమె భర్త శ్రీరామ్ నేనేతో చేసిన ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. 'మా ప్రియమైన వ్యక్తి ఆయ్, స్నేహలతా దీక్షిత్, ఆమె ప్రియమైన వారి మధ్య ఈ ఉదయం ప్రశాంతంగా కన్నుమూశారు' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. స్నేహలతా అంత్యక్రియలు వర్లీలోని శ్మశానవాటికలో ఆదివారం మధ్యాహ్నం జరిగినట్టు సన్నిహితులు తెలిపారు.

మమ్మల్ని క్షమించండి : వెంకటేష్, రానా



వెంకటేష్, రానా

ఓ తండ్రి తన కొడుకుతో, ఓ అన్న తన తమ్ముడితో, ఓ తమ్ముడు తన అక్కతో.. మాటల్లో చెప్పలేని అసభ్య పదజాలంతో మాట్లాడితే ఎలా ఉంటుంది?, మితి మీరిన అసహజ శృంగారం ఉంటే ఎలా ఉంటుంది? అనే దానికి పక్కా కేరాఫ్‌గా 'రానా నాయుడు' వెబ్ సిరీస్ నిలిచింది. వెంకటేష్ - రానా కలిసి తొలిసారి నటించిన వెబ్‌సిరీస్ 'రానా నాయుడు'. నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా ప్రేక్షకుల ముందుకొచ్చింది. శ్రుతిమించిన శృంగార సన్నివేశాలు, అసభ్య పదజాలం ఉన్న ఇలాంటి సిరీస్‌లో వెంకటేష్, రానా నటించడాన్ని నెటిజన్లు, అభిమానులు తప్పు బడుతున్నారు. రానా- వెంకీ నుంచి ఇలాంటిది ఊహించలేదని, కుటుంబ సభ్యులతో కలిసి సిరీస్‌ను చూడలేకపోతున్నామని విమర్శించారు. ముఖ్యంగా వెంకీ ఇమేజ్ పూర్తి డామేజ్ అయ్యిందని ఫ్యాన్స్ వాపోయారు. దీనికి రానా స్పందిస్తూ, 'ఈ సిరీస్‌ను అసహ్యించుకుంటున్న వారికి క్షమాపణ చెబుతున్నాం. సిరీస్‌ను కుటుంబంతో కాకుండా ఒంటరిగా చూడాలని కోరుతున్నాను' అని ట్వీట్ చేశారు.

బ్లాక్‌బస్టర్ ఖాయం



నాగశౌర్య, మాళవిక నాయర్

'ఊహలు గుసగుసలాడే', 'జ్యో అచ్యుతానంద' వంటి ఘన విజయాల తర్వాత యువ కథానాయకుడు నాగ శౌర్య, దర్శకుడు శ్రీనివాస్ అవసరాల కలయికలో వస్తున్న చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, దాసరి ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మించిన ఈ ఫీల్ గుడ్ రొమాంటిక్ ఫిల్మ్‌లో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటించారు. టీజీ విశ్వ ప్రసాద్, పద్మజ దాసరి నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈనెల 17న ఈ చిత్రం థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో ఈ మూవీ ప్రీ రిలీజ్‌ను ఘనంగా నిర్వహించింది. యువ హీరో అడివి శేష్, నిర్మాతలు అశ్వినీదత్, సునీల్ నారంగ్, రవి శంకర్, దామోదర ప్రసాద్, కోన వెంకట్, దర్శకులు బాబీ కొల్లి, మారుతి, నందిని రెడ్డి తదితరులు అతిథులుగా హాజరయ్యారు. అతిరథమహారథుల సమక్షంలో వైభవంగా జరిగిన ఈ వేడుకలో చిత్ర ట్రైలర్‌ను కూడా విడుదల చేశారు.

'విద్యాసాగర్‌కి, వివేక్‌కి, విశ్వప్రసాద్‌గారికి, కళ్యాణి మాలిక్‌కి, భాస్కరభట్ల, లక్ష్మీభూపాల, ఎడిటర్ కిరణ్‌కి కృతజ్ఞతలు. ఈ సినిమాకి ఎమోషన్ పండించగల నటి కావాలి. ఈ కథ చెప్పినప్పుడు మాళవిక స్పందన చూసే పూర్తి నమ్మకం వచ్చేసింది. నాగశౌర్య అద్భుతమైన నటుడు. 1960 నాటి నాకిష్టమైన పాటను ఇందులో రీమిక్స్ చేశాం. ఆ పాటను ఆలపించిన నా మొదటి దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటికి ప్రత్యేక కృతజ్ఞతలు. సునీల్ నామా ఈ కథను సరిగ్గా అర్థం చేసుకొని సినిమాకి అవసరమైన సినిమాటోగ్రఫీని అందించారు' అని దర్శకుడు శ్రీనివాస్ అవసరాల చెప్పారు.

'మంచి సినిమాలో నటించే అవకాశం లభించడం అదృష్టం' అని నాయిక మాళవిక నాయర్ చెప్పారు.

నిర్మాత దాసరి పద్మజ మాట్లాడుతూ,' మంచి సినిమాలో భాగమయ్యే అవకాశమిచ్చిన విశ్వ ప్రసాద్‌కి, వివేక్‌కి ధన్యవాదాలు. శ్రీనివాస్, నాగశౌర్య సినిమాలు ఎంతో బాగుంటాయి. ఈ సినిమాతో మరో విజయాన్ని అందుకుంటారని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

> ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి అనేది మనం తరచూ ఉపయోగించే మాట. ఈ సినిమా విడుదలయాక ఫలానా శౌర్య, ఫలానా శ్రీనివాస్, ఫలానా మాళవిక అంటారు. శ్రీనివాస్ డైరెక్షన్, డైలాగ్స్ అంటే చాలామందికి ఇష్టం. ఈ సినిమా ఖచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుంది. నేను, మాళవిక పెద్ద హిట్ కొట్టబోతున్నాం. ఈ సినిమా రికార్డులు బద్దలు కొట్టేస్తుంది అని చెప్పను కానీ.. ఈ సినిమాతో మీ మనస్సుల్లో మేము కుర్చీలు వేసుకుని కూర్చుంటాం. దీని తర్వాత ఎన్ని ఫ్లాప్‌లు తీసినా మమ్మల్ని క్షమిస్తారు. అంత మంచి సినిమా.
>
> - హీరో నాగశౌర్య

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

అంతా మా ఇష్టం..

గ్రామాల్లో ప్రజాస్వామ్యాన్ని ధిక్కరిస్తున్న వీడీసీలు

మాట వినకుంటే కుల బహిష్కరణలు

- అక్రమ వేలంపాటలు, అనుమతులతో ధనార్జన
- అభివృద్ధి పేరుతో ఆక్రమణలు
- కట్టడి చేయడంలో అధికారుల వైఫల్యం



నవతెలంగాణ - మెట్‌పల్లి రూరల్

ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకొనే ప్రభుత్వ విధానాన్ని ప్రజాస్వామ్యం అంటాం. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎనుకున్న నాయకులే పరిపాలన చేస్తుంటారు. కానీ ఇందుకు విరుద్ధంగా కొందరు పెద్దమనుషులు కలిసి ఎన్నుకున్న గ్రామ అభివృద్ధి కమిటీలు సమాంతర ప్రభుత్వాలుగా అధికారాన్ని గుప్పింట్లోకి తీసుకుని అంతా తామే అన్నట్టు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన పాలకర్గాన్ని శాసిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికార యంత్రాంగం, ప్రభుత్వాలు వాటిని కట్టడి చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి.

ఇటీవల జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవాలయ భూ సమస్యతో గ్రామ వీడీసీలకు, ముదిరాజ్ సంఘ సభ్యులకు మధ్య వివాదాలు తారస్థాయికి చేరాయి. దీంతో ముదిరాజ్ కులస్తులను గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ) గ్రామ బహిష్కరణ చేసింది. ఇప్పటికే ఐదు నెలలు కావస్తున్నా ముదిరాజ్ కుటుంబాలు బహిష్కరణలోనే ఉన్నాయి. అంతే కాకుండా సర్పంచ్, వీడీసీ పెద్దలు కలిసి ఈ 5ఎకరాల 10 గుంటల స్థలంలో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. విషయం తెలిసిన భూమి పట్టాదారు ఎడమల సుదర్శన్ రెడ్డి సర్పంచ్‌పై కేసు నమోదు చేశారు. ఈ కేసు ఇప్పటికీ కోర్టులో నడుస్తోంది. వీడీసీ పెద్దలకు కోరుట్ల నియోజకవర్గ స్థాయి నాయకులు సహకరించటంతో పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేసినా ముదిరాజ్ కులస్తులకు న్యాయం జరగడం లేదని అంటున్నారు.

బహిరంగ వేలం పాటలతో ధనార్జన :

గ్రామాల్లో బహిరంగ వేలంపాటలు నిర్వహించి ఎక్కువ డబ్బులు పాట పాడే వారికి గ్రామాల్లో అనుమతులు కట్టబెడుతున్నారు. ఈ పద్ధతిలో వీడీసీలకు పెద్ద మొత్తంలో డబ్బు సమకూరుతోంది. దీంతో ఇసుక, బెల్ట్ షాపులు, మొరం, చికెన్, మటన్, కోడిగుడ్లు, మినరల్ వాటర్, కూల్‌డ్రింక్స్ అమ్మే యజమానులు ధనార్జనే ధ్యేయంగా ఎంతో కొంత డబ్బు వీడీసీలకు ముట్టజెప్పడం ఆనవాయితీగా మారింది. అనుమతులు పొందిన షాప్ యజమానులు అధిక ధరలతో ప్రజలకు విక్రయించడంతో ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం గాని, ఎక్సైజ్ శాఖ అధికారులు కానీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, పలు గ్రామాల్లో గ్రామ కమిటీలు ఎన్నికలను సైతం ప్రభావితం చేస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

వారిదే అంతిమ తీర్పు

వీడీసీల వేధింపుల వలన ప్రస్తుతం పట్టణాల్లో కంటే గ్రామాల్లో ఉండాలంటేనే ప్రజలు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లోనే కాకుండా, గ్రామ అభివృద్ధిలో పాలు పంచుకొని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకునేవారు. కానీ ప్రస్తుతం గ్రామ అభివృద్ధి కమిటీల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. వీడీసీ సభ్యులకు రాజకీయ నాయకుల అండతో వారు విపత్కర ధోరణి కొనసాగిస్తున్నారు. వారి మాట వినని వారిని గ్రామ బహిష్కరణ చేస్తూ రాజ్యాంగాన్ని సైతం ధిక్కరిస్తున్నారు. వీడీసీల ఆగడాలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఒక రాజకీయ నాయకుడి అండతో కేసుల నుండి తప్పించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

తిష్ట వేసుకొని కూర్చుంటున్న అధ్యక్షుడు, సభ్యులు :

మెట్‌పల్లి మండలంలోని కొన్ని గ్రామాల్లో తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించి అధ్యక్షులను ఎన్నుకుంటుంటే, కొన్ని గ్రామాల్లో ఎన్నికలే లేకుండా అధ్యక్షులు, కమిటీ సభ్యులు కొన్ని సంవత్సరాలుగా తిష్ట వేసుకుని కూర్చుంటున్నట్లు సమాచారం. గ్రామాన్ని అన్ని విధాలుగా దోచుకుంటూ, ప్రజల్ని మోసం చేస్తూ రాజకీయ నాయకులకు కొమ్ముకాస్తూ, పీఠాన్ని అధ్యక్షులు వదులుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు శృతిమించిన గ్రామ అభివృద్ధి కమిటీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కక్ష కట్టి గ్రామ బహిష్కరణ చేశారు...



జగ్గసాగర్ గ్రామానికి చెందిన ఎడమల సుదర్శన్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, నర్సింహా రెడ్డికి సంబంధించిన 5 ఎకరాల 10 గుంటల భూమి కొండకర్ల గ్రామ శివారులో ఉంది. ఈ భూమిని పంపకాలు జరపగా ఎడమల సుదర్శన్ రెడ్డికి తన వంతుగా 2 ఎకరాల 25 గుంటలు భూమి రాగా... గత ఐదారు దశాబ్దాలుగా బీడు భూమిగా ఉంది. దీనిని గుర్తించిన కొండ్రికర్ల గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులందరం 2013లో ఎడమల సుదర్శన్ రెడ్డిని సంప్రదించి పెద్దమ్మ దేవాలయం నిర్మాణం చేసుకుంటుంటామని, కుల పెద్దలం అడగగా ఒప్పుకున్నారు. గుడి నిర్మాణం కోసం సర్వే నెంబరు 994/1/2 గల 10 గుంటల భూమి అవసరమవుతుందని సుదర్శన్ రెడ్డికి తెలిపి ఏడు గంటల భూమిలో గుడి నిర్మించాము. తర్వాత 2016లో 10గుంటల భూమికి సంబంధించి విలువ రెండున్నర లక్షల రూపాయలు సుదర్శన్ రెడ్డికి ముట్టజెప్పి 50 రూపాయల విలువ గల బాండ్ పేపర్ పైన రాసుకున్నాం. అయితే ఇటీవల ప్రభుత్వ సహాయం కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సంఘ సభ్యులందరం కలిసి జిన్నా శంకర్ అను నా పేరు మీద ఆరు నెలల కిందట రిజిస్టర్ చేయించాం. ఈ 5 ఎకరాల 10 గుంటల భూమి గ్రామానికి సంబంధించిందని కక్ష కట్టిన వీడీసీ పెద్ద మనుషులు ముదిరాజ్ కులస్తులందరినీ గ్రామ బహిష్కరణ చేశారు. ఇప్పటికీ మా కుటుంబాలను బహిష్కరించి ఐదు నెలలు కావస్తుంది. ఎంతమంది అధికారులను కలిసిన ఇప్పటికీ మాపై దయ చూపలేదు సరి కదా వీడీసీ సభ్యులకే వత్తాసు పలుకుతున్నారు. ఈ కుట్రలో పదవిలో ఉన్న నియోజకవర్గ స్థాయి నాయకులు భాగస్వాములుగా ఉన్నారు. మాకు న్యాయం చేయాలని చేతులెత్తి వేడుకుంటున్నాం.

- జిన్నా శంకర్ ముదిరాజ్, కొండ్రికర్ల.

భూమి కొనుగోలు చేస్తే తిడుతున్నారు..

ఎడమల జనార్దన్ రెడ్డి, నర్సింహా రెడ్డి (జగ్గసాగర్) వంతుగా వచ్చిన భూమి రెండు ఎకరాల 25 గుంటల భూమి 26 లక్షల రూపాయలకు ఒక సంవత్సరం క్రితం కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను. రెండు సార్లు రైతుబంధు కుడా తీసుకున్నాను. కానీ ఇప్పుడు వీడీసీ సభ్యులు నాతో ఈ భూమి గ్రామానికి సంబంధించిందని, ఎట్లా కొంటావు అని తిడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

- దబ్బా లక్ష్మీరాజాం, జగ్గసాగర్.

వీడీసీ పెద్దలు మా భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారు..

కొండ్రికర్ల గ్రామంలోని 5 ఎకరాల 10 గుంటలు భూమి మా తాతలు, తండ్రుల నుండి స్థిరాస్తిగా ఉంది. ఈ భూమి పట్టా ఇప్పటికీ మా దగ్గరే ఉంది. మా కుటుంబంలో ఈ భూమిని ఎవరూ ఎవరికీ దానధర్మాలు చేయలేదు. కొన్ని సంవత్సరాలుగా బీడు భూమిగా ఉండడంతో ఇప్పుడు కొందరు వీడీసీ పెద్దలు, సర్పంచ్ అందరూ కలిసి మా భూమి కబ్జా చేయాలని చూస్తున్నారు. కాబట్టి సంబంధిత అధికారులు నిజా నిజాలను గుర్తించి న్యాయం చేయాలని కోరుతున్నాం.

- ఎడమల సుదర్శన్ రెడ్డి, జగ్గసాగర్.

కోవిడ్ దర్యాప్తునకు కట్టుబడి ఉన్నాం

డబ్ల్యూ హెచ్ఓ పునరుద్ఘాటన

జెనీవా : కోవిడ్-19 వైరస్ ఎలా ఉద్భవించిందో కనుగొనడంపై దర్యాప్తునకు కట్టుబడి ఉన్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) పునరుద్ఘాటించింది. వైరస్ మూలాలను కనుగొనడం నైతిక ఆవశ్యకత అని, అన్ని వైపులను నుంచి పరిశోధన ముఖ్యమని మరోసారి డబ్ల్యూహెచ్ఓ స్పష్టం చేసింది. చైనా లేబొరేటరీ అనాలోచిత లీక్ వల్ల వైరస్ ఉద్భవించినట్లు అంచనా వేస్తున్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదిక ప్రచురించినట్లు అమెరికా మీడియాలో కథనాలు రావడంతో డబ్ల్యూహెచ్ఓ చీఫ్ ఈ విషయాన్ని ప్రకటించారు. 'కోవిడ్-19 మూలలను అర్థం చేసుకోవడం, అన్ని వైపుల నుంచి అన్వేషించడం ఇంకా మిగిలే ఉంది. ఈ వైరస్‌తో మరణించిన, దీర్ఘకాలిక కోవిడ్‌తో జీవిస్తున్న కోట్లాది మంది కోసం, అలాగే భవిష్యత్‌లో వ్యాప్తి చెందకుండా నిరోధించడంలో మాకు ఈ దర్యాప్తు నైతికత ఆవశ్యకత' అని డబ్ల్యూహెచ్ఓ చీఫ్ టెడ్రోస్ అధనోమ్ ఘేబ్రాయెసుస్ శనివారం రాత్రి ట్వీట్ చేశారు. కరోనా వైరస్ ఆవిర్భావంపై దర్యాప్తు కోసం డబ్ల్యూహెచ్ఓ నేతృత్వంలోని బృందం 2021లో చైనాలోని వుహాన్ పరిసర ప్రాంతాల్లో కొన్ని వారాలు గడిపిన సంగతి తెలిసిందే. తదుపరి పరిశోధన అవసరమని నివేదిక ఇచ్చింది. ఈ తరువాత డబ్ల్యూహెచ్ఓ ఒక శాస్త్రీయ సలహా బృందాన్ని ఏర్పాటు చేసింది. కానీ వైరస్ పుట్టకపై ఇంకా ఎటు వంటి నిర్ధారణలకు రాలేదు.

అమెరికా అడ్వైజరీ కమిటీలో ఇద్దరు ఇండో-అమెరికన్ సిఇఓలు

వాషింగ్టన్ : ట్రేడ్ పాలసీ, పెట్టుబడులు, అభివృద్ధి అంశాలపై అమెరికా ప్రభుత్వం నియమించిన అడ్వైజరీ కమిటీలో ఇద్దరు ఇండో-అమెరికన్ సిఇఓలకు స్థానం లభించింది. ఫ్లెక్స్ సిఇఓ రేవతి అద్వైతి, న్యాచరల్ రిసోర్స్ డిఫెన్స్ కౌన్సిల్ సిఇఓ మనీషా బాప్నాలకు కమిటీలో సభ్యులుగా నియమించినట్లు అమెరికా అధ్యక్షులు జో బైడెన్ ప్రకటించారు. మొత్తం 14 మంది సభ్యులతో కమిటీని నియమించారు. అమెరికా వాణిజ్య విధానం అభివృద్ధి, అమలు, నిర్వహణకు సంబంధించి విషయాలపై అమెరికా ప్రభుత్వానికి ఈ కమిటీ తన సలహాలను అందచేస్తుంది. అలాగే ఏదైనా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే ముందే ఒప్పందం అమలయితే దాని ప్రభావం, నిర్వహణకు సంబంధించిన అంశాలపైనా కమిటీ సలహాలు ఇవ్వనుంది.

ఇంజక్షన్ వికటించి.. మూడు నెలల బాబు మృతి



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

ఇంజక్షన్ వికటించి మూడు నెలల బాబు మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం రంగాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రంగాపురం గ్రామానికి చెందిన వీరన్న- లక్ష్మీ దంపతుల మూడు నెలల బాబుకు జ్వరం వచ్చింది. దాంతో గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడు ఆలీ బాబు వద్దకు తీసుకువెళ్లారు. వైద్యుడు వేసిన ఇంజక్షన్ వికటించడంతో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తీసుకెళుతుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడని బాధితులు తెలిపారు.

వేతనాలు రాక.. పంచాయతీ సిబ్బంది బిక్షాటన



- పెద్దపల్లి జిల్లాలో నిరసన

నవతెలంగాణ - ఓదెల

నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో కనగర్తి గ్రామపంచాయతీ సిబ్బంది బిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ.. నిత్యం గ్రామాన్ని శుభ్రపరుస్తూ స్వచ్ఛతకు పాడుతున్నామన్నారు. అయినా తమ బతుకులు మాత్రం మారడం లేదని వాపోయారు. వచ్చే తక్కువ వేతనం కూడా నాలుగు నెలలుగా రావడం లేదని తెలిపారు. దాంతో పిల్లల చదువులకు ఫీజులు కట్టలేక, నిత్యావసర వస్తువులు కొనుక్కునే స్థితి లేక గ్రామంలో వీధి వీధి తిరుగుతూ బిక్షాటన చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, మల్టీపర్పస్‌ను రద్దు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిహెచ్.ప్రభాకర్, శనిగరపు బాపు, పైడిపల్లి నాగయ్య, పైడిపల్లి స్వప్న, తాళ్లపల్లి శంకర్, రమేష్, తదితరులు ఉన్నారు.

టైరు పేలడం 'దైవేచ్ఛ' కాదు

- మానవ నిర్లక్ష్యమే : బాంబే హైకోర్టు స్పష్టీకరణ

ముంబయి : వాహనాల టైరు పేలడం యాక్ట్ ఆఫ్ గాడ్ (దైవేచ్ఛ) కాదని.. అది మానవ నిర్లక్ష్యమేనని బాంబే హైకోర్టు ఇటీవల స్పష్టం చేసింది. బాధిత కుటుంబానికి బీమా సంస్థ పరిహారం అందించాలని ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును సమర్థించింది. కారు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం యాక్ట్ ఆఫ్ గాడ్ కిందకే వస్తుందని, పరిహారం చెల్లించలేమంటూ న్యూ ఇండియా అస్యూరెన్స్ చేసిన విజ్ఞప్తిని బాంబే హైకోర్టు తిరస్కరించింది.

ముంబయికి చెందిన పట్వర్ధన్ 2010 అక్టోబర్‌లో ఇద్దరు స్నేహితులతో కలిసి పూణె నుండి ముంబయికి కారులో వెళ్తున్నారు. డ్రైవర్ కారుని వేగంగా నడపడంతో కారు వెనక టైరు పేలడంతో కారు గుంతలో పడింది. ఈ ప్రమాదంలో పట్వర్ధన్ మరణించారు. ఈ కేసును విచారించిన మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ పట్వర్ధన్ కుటుంబానికి రూ.1.25 కోట్ల రూపాయల పరిహారం అందించాలని న్యూ ఇండియా అస్యూరెన్స్ బీమా కంపెనీని 2016లో ఆదేశించింది. అతడి కుటుంబానికి అతనొక్కడే ఆర్థిక ఆధారమని వ్యాఖ్యానించింది. అయితే, ఆ పరిహారం చాలా అధికంగా ఉందని పేర్కొంటూ ట్రిబ్యునల్ తీర్పును సవాలు చేస్తూ బీమా సంస్థ బాంబే కోర్టులో అప్పీలు చేసింది.

వాహన టైరు పేలడం అనేది విపత్తు కిందకు వస్తుందని బీమా సంస్థ హైకోర్టులో వాదనలు వినిపించింది. ఈ వాదనను జస్టిస్ ఎస్.డి. డిగే ధర్మాసనం బీమా సంస్థ వాదనను నిరాకరించింది. టైరు పేలడం అనేది విపత్తు కిందకు రాదని.. అది నియంత్రించగలిగే చర్యేనని స్పష్టం చేసింది. అతివేగం, టైరులో గాలి హెచ్చు తగ్గులు లేదా సెకండ్ హ్యాండ్ టైర్, ఉష్ణోగ్రత వంటివి టైరు పేలడానికి కారణాలై ఉండవచ్చని పేర్కొంది. ప్రయాణానికి ముందు వాహనం డ్రైవర్ లేదా యజమాని టైర్ పరిస్థితిని తనిఖీ చేసి ఉండాల్సిందని, దీంతో ఇది మానవ తప్పిదం కిందకే వస్తుందని బాంబే హైకోర్టు పేర్కొంది.

కోదాడ సంతలో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం

కోడె దూడ మృతి • ధర్నాకు దిగిన రైతులు



నవతెలంగాణ-కోదాడరూరల్

కోడెదూల విక్రయాల్లో తేడా రావడంతో దళారీ.. రైతుపై దాడి జరిగి రైతుకు తగలాల్సిన కర్ర కోడెదూడకు తగలడంతో కోడెదూడ మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని సంతలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కోదాడ సంత ఒకప్పుడు నిత్యం జనంతో కళకళలాడేది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది ఈ సంతకు వచ్చి క్రయ విక్రయాలు కొనసాగించేవారు. కానీ సంతలో దళారీలదే ఇష్టారాజ్యంగా ఉండటంతో రైతులు సంతకు రావాలంటేనే జంకుతున్నారు. అయినప్పటికీ ఆర్థికంగా డబ్బులు అవసరం ఉన్న రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో సంతకు వస్తుంటారు. ఈ క్రమంలోనే ఆదివారం కూడా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన బత్తుల అంజయ్య తన కోడె దూడను సంతలో విక్రయించడానికి తీసుకురాగా కోదాడకు ప్రాంతానికి చెందిన కటిక వ్యాపారి అక్బర్ రూ.50 వేలు ఖరీదు చేసే దూడను రూ.10 వేలకు అడుగగా అంత తక్కువ ధరకు అమ్మడం కుదరదని తేల్చి చెప్పాడు. దాంతో ఆగ్రహించిన దళారీ.. రైతుపై దౌర్జన్యంగా కర్రతో దాడికి ప్రయత్నించగా రైతు తప్పించుకునే క్రమంలో ఆ కర్ర దూడ తలపై తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. రైతుకు గాయాలవ్వడంతో ఆస్పత్రికి తరలించారు. దాంతో సంతకు వచ్చిన రైతులంతా ఒక్కటవ్వడంతో దళారీ అక్కడి నుంచి పరారయ్యాడు. సంతకు వచ్చిన రైతులు మాకు న్యాయం చేయాలంటూ గేటు ఎదుట బైటాయించి ఆందోళన చేపట్టారు. నడిరోడ్డుపై కర్రలతో దాడులు చేస్తారా అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడెదూడ విలవిల్లాడుతూ కంటి ముందే మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ధర్నాను విరమింపజేశారు. అనంతరం రైతు అంజయ్య ఫిర్యాదు మేరకు దళారీ అక్బర్‌పై టౌన్ ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదు చేశారు.

ఆస్కార్‌కు వేళాయె!

'నాటునాటు'పై సర్వత్రా క్రేజ్

ఉదయం 5.30 గంటల నుంచి వేడుకలు షురూ



లాస్ ఏంజిల్స్ : ప్రపంచ సినీ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆస్కార్స్ 2023 లేదా 95వ అకాడమీ అవార్డుల సంబరం రానేవచ్చింది. అవార్డుల ప్రదానోత్సవానికి అమెరికాలోని లాస్‌ఏంజిల్స్‌లో ఉన్న డాల్బీ థియేటర్ సర్వాంగ సుందరంగా ముస్తాబు అయ్యింది. భారత కాలమాన ప్రకారం ఈ నెల 13న సోమవారం ఉదయం 5.30 నుంచి వేడుకలు ప్రారంభం కానున్నాయి. ప్రముఖ దర్శకులు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాట బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో ఆస్కార్ బరిలో నిలిచిన నేపథ్యంలో ఈ దఫా వేడుకలు భారత చలనచిత్ర రంగానికి విశేషమైనవి. గోల్డెన్ గ్లోబ్, హాలీవుడ్ సినీ క్రిటిక్స్ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలను కైవసం చేసుకొని ఇప్పటికే విశ్వవ్యాప్తంగా విశేష క్రేజ్ సంపాదించుకున్న 'నాటునాటు' పాట ఆస్కార్‌ను కైవసం చేసుకోవడం ఖాయమని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఆస్కార్‌కు నామినేట్ అయిన తొలి భారతీయ సినిమా పాట ఇదే. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగానూ ఉత్కంఠ నెలకొంది. పలుచోట్ల ప్రత్యేక కార్యాక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ఆస్కార్ వేదికపై 'నాటునాటు' పాట పాడేందుకు గాయకులు కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ లాస్ ఏంజిల్స్ చేరుకున్నారు. దర్శకుడు రాజమౌళి, సంగీత దర్శకులు ఎంఎం కీరవాణితో సహా ఆర్ఆర్ఆర్ బృందం కూడా లాస్ ఏంజిల్స్‌లోనే నేరుగా వేడుకలను ఆస్వాదించనుంది. ఆస్కార్ వేడుకల ప్రత్యక్ష ప్రసారాలను ఎబిసి నెట్‌వర్క్, అలాగే యూట్యూబ్, డైరెక్ట్ టివి, వంటి లైవ్ స్ట్రీమింగ్ వేదికల ద్వారా వీక్షించవచ్చు. భారత్‌లో డిస్నీ, హాట్‌స్టార్ ఛానెళ్ల ద్వారా వీక్షించవచ్చు.

అంతర్జాతీయ మీడియా అంచనా ఇలా..

ఆస్కార్ పురస్కారాల కంటే ముందుగా ప్రకటించే గోల్డెన్ గ్లోబ్, హాలీవుడ్ సినీ విమర్శకుల అవార్డులకు ప్రత్యేక గుర్తింపు వుంది. ఈ రెండు అవార్డుల్లో ఏ ఒక్కదానిని కైవసం చేసుకున్నా ఆయా చిత్రాలకు, నటులకు ఆస్కార్ పక్కా అన్న విషయాన్ని గత చరిత్ర చెబుతోంది. వీటి ఆధారంగా అంతర్జాతీయ మీడియా ఆస్కార్ అవార్డులు దక్కెదెవరికో ముందుగానే జోస్యం చెబుతూ కథనాలు వెలువరించింది. ఆ కథనాల ప్రకారం.. అవార్డులు ఇలా ఉండే వీలుంది.

ఉత్తమ చిత్రం :	ఎవరీ థింగ్ ఎవరీ వేర్ ఆల్ అట్ వన్స్
ఉత్తమ దర్శకులు :	డేనియల్ క్వాన్, డేనియల్ సెచినర్ట్ (ఎవరీ థింగ్ ఎవరీ వేర్ ఆల్ అట్ వన్స్)
ఉత్తమ నటుడు :	బ్రెండాన్ ఫ్రాజర్ (ద వేల్)
ఉత్తమ నటి :	మిచెల్ యేహ్ (ఎవరీ థింగ్ ఎవరీ వేర్ ఆల్ అట్ వన్స్)
ఉత్తమ సహ నటుడు :	కె హుయ్ క్వాన్ (ఎవరీ థింగ్ ఎవరీ వేర్ ఆల్ అట్ వన్స్)
ఉత్తమ సహ నటి :	ఏంజిలా బస్సెట్ (బ్లాక్ పాంథర్ : వకండా పొరెవర్)
ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే :	ఎవరీ థింగ్ ఎవరీ వేర్ ఆల్ అట్ వన్స్
ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే :	ఆల్ క్వైట్ ఆన్ ది వెస్ట్రన్ ఫ్రంట్
ఉత్తమ డాక్యుమెంటరీ :	నవల్నేయ్
ఉత్తమ ఒరిజినల్ సాంగ్ :	నాటు నాటు (ఆర్ఆర్ఆర్)
ఉత్తమ యానిమేషన్ చిత్రం :	గుయిలెర్మో డెల్ టోరోస్ పినోసిచియో
ఉత్తమ అంతర్జాతీయ చిత్రం :	ఆల్ క్వైట్ ఆన్ ద వెస్ట్రన్ ఫ్రంట్

కుక్కల దాడిలో 3 దుడ్డెలు, లేగదూడ మృత్యువాత

- ఆందోళనలో పాడి రైతు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


కుక్కల దాడిలో మరణించిన దూడలు

నవతెలంగాణ - శంషాబాద్

కుక్కల దాడిలో మూడు దుడ్డేలు, ఒక లేగ దూడ మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కూడ గ్రామంలో ఆదివారం జరిగింది. బాధిత రైతు నిమ్మల శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ రెవెన్యూలోని సర్దార్ మియా (శాస్త్రి బాయి) వద్ద చింత చెట్ల కింద తన బర్రెలను కట్టేసి రాత్రి ఇంటికి వెళ్లి పడుకున్నారు. తెల్లవారుజామున పశువులు ఉన్న ప్రదేశం వద్దకు వచ్చి చూశాడు. అక్కడ మూడు దుడ్డెలు, ఒక లేగ దూడను కుక్కలు దారుణంగా కరిచి చంపాయి. దాంతో పాడి రైతు తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. తనను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకున్నాడు. 20 రోజుల కిందట మహారాష్ట్ర నుంచి రూ.లక్షా 80 వేలు పెట్టి రెండు పాడి బర్రెలను కొనుగోలు చేశానని తెలిపారు. పూటకు నాలుగు లీటర్ల చొప్పున పాలు ఇస్తున్నాయని చెప్పారు. అకస్మాత్తుగా కుక్కల దాడిలో దూడలు చనిపోవడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు ఎట్లా తీర్చాలని వాపోయాడు. వ్యవసాయ పొలాలకు వద్దకు వచ్చే కుక్కల పట్ల ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, తమను ఆదుకోవాలని కోరారు. కాగా, కుక్కల దాడిలో దూడలు చనిపోవడం సర్వసాధారణమైపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.. గ్రామంలో మాంసం విక్రయదారులు మిగిలిన పనికిరాని మాంసాన్ని, కోళ్ల మాంసాన్ని వాటి ముందు పడేయడం వల్ల అవి పూర్తిగా వేట కుక్కలుగా మారి పశువుల మీద పడుతున్నాయన్నారు. గ్రామ పంచాయతీ నుంచి వారికి ఎలాంటి సలహాలు సూచనలు ఇవ్వకపోవడం వలన ఇలాంటి సంఘటన జరుగుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఒకవేళ పశువుల ఆహారం లభించకపోతే గ్రామాల్లోనూ పిల్లలపైన, పెద్దలపైన కుక్కలు దాడులు చేస్తున్నాయని, దీనిపై నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

పంజాబ్‌లో ఒకే రోజు 813 తుపాకీ లైసెన్సులు రద్దు

అమృతసర్ : రాష్ట్రంలో విచ్చలవిడిగా వినియోగిస్తున్న తుపాకులకు అడ్డుకట్ట వేయాలని పంజాబ్ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో మొత్తం 3,73,053 తుపాకీ లైసెన్సులు ఉన్నాయని, తుపాకీ సంస్కృతిని అంతమొందించేందుకు తాము నిరంతరం చర్యలు తీసుకుంటామని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 813 తుపాలకు సంబంధించిన లైసెన్సులను రద్దుచేసింది. దీంతో ఇప్పటివరకు రద్దుచేసిన లైసెన్సుల సంఖ్య 2 వేలకుపైగా చేరింది. తాజాగా లైసెన్సులను రద్దుచేసిన వాటిలో ఎస్‌కేఎస్ కస్బా ప్రాంతంలోనే 235 తుపాకులు ఉన్నాయి.

గ్లకోమా వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం: డాక్టర్ రాజలింగం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాశ్వత అంధత్వానికి దారి తీసే గ్లకోమా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సరోజినీ దేవి కంటి ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజలింగం హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆస్పత్రి ప్రాంగణంలో గ్లకోమా వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు, నర్సులు, సిబ్బందితో పాటు నిమ్స్, ఉస్మానియా, గాంధీ తదితర ఆస్పత్రుల నుంచి వచ్చిన నర్సింగ్ విద్యార్థులు తదితరులు ప్ల కార్డులు, బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు.

గ్లకోమా వ్యాధి అంటే ఏమిటీ? దాని బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. అనంతరం రాజలింగం మాట్లాడుతూ 40 ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరు ఏడాదికి ఒకసారి గ్లకోమా పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మోదినీ, కార్నియా విభాగం అధిపతి డాక్టర్ కేశవ రావు, గ్లకోమా విభాగం డాక్టర్ సుపర్ణ తదితరులు పాల్గొన్నారు.

